# గ్రంథాలయ సర్వస్వము

ధాత — భాద్రపదము, అక్టోబరు 1936.



శ్రీ కృష్ణదేవరాయలు.

సచిత్రమాసపత్రిక

సంపుటము ౧౦

సంచిక ౬

## ఏలూరు, అన్నదానసమాజము — Annadanasamajam, Ellore.

ఏలూరు, అన్న, వస్త్ర, వైద్య విద్యాదానసమాజము 1913 సం॥ రమున స్థాపింపబడెను. ప్రభుత్వమువారు స్థలము ధర్మముగ నొసంగిరి. మ. రా. శ్రీ బొమ్మా రత్నంగారి ద్రవ్యసహాయమున భవనము నిర్మింపబడెను. ఇందు ప్రతిదినము అశక్తులకు అన్నదానము జరుగుచున్నది. ప్రతిసంవత్సరము 15 డిశంబరున బీదలకు వస్త్రదానము జరుగుచున్నది. వేసవికాలమున మంచినీళ్ల చలివేంద్రలు పెట్టబడుచున్నవి. వైద్యదానము ప్రతిరోజు సాయంకాలము సమాజమువద్ద జరుగుచున్నది.

ఒకరోజు అన్నదానమునకు రు 60 లు ధర్మమిచ్చిన స్థిరాస్తులవల్ల వచ్చే ఆదాతో వారు కోరిన తేది 1 రోజున బీదలకు అన్నదానము జరుగును. వస్త్రదానము శాశ్వతనిధి ధర్మము రు 10 లు లగాయతు ఈయవచ్చును. ధర్మములకు రశీదులను, శాశ్వతనిధి ధర్మములకు రసీదులతోసహా పట్టాలను 5 గురు శాశ్వతధర్మకర్తలు (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. ఎల్లరు సహాయపడ గోరుచున్నాము. ఇతర వివరములకు :—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు
కొత్తమాసు సీతారామయ్యగారు, ( సోల్‌ట్రస్టీలు )
పసుమర్తి పురుషోత్తంగారు, (ప్రెసిడెంటు)
మద్దుల వెంకట చినరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు)
నున్నా గంగరాజుగారు, (వైస్‌ప్రెసిడెంటు)
కందుల రామయ్యగారు, (సెక్రిటరీ)

} శాశ్వతధర్మకర్తలలోనివారు

---

## ఏలూరు, హిందూ యువజనసంఘము
### Youngmen's Hindu Association, Ellore.

ఈగ్రంథాలయము 1904 సం॥రమున స్థాపింపబడెను. 1918 సం॥రము సంఘమురిజష్టరు అయినది. 1928 సం॥రము మ. రా. శ్రీ రా. బ. మోతే గంగరాజు జమీందారుగారి ద్రవ్యసహాయమున నూతన దివ్యభవనము (రు 50,000 లు వెచ్చింపబడి) నిర్మింపబడినది. ఇందు దిన, వార, పక్ష, మాసపత్రికలు, ఆంగ్ల, ఆంధ్రభాషలయందు వచ్చుచున్నవి. ఆంగ్ల, ఆంధ్ర, సంస్కృత గ్రంథములు సుమారు 13 వేలవరకు గలవు. మ్యాజిక్‌లాంతరు, వ్యాసరచన పోటీపరీక్షలు, విషయనిర్ధారణ సభలు, వక్తృత్వపోటీపరీక్షలు ప్రతిసంవత్సరము జరుపుచు అందు తీర్ణులకు బహుమతు లొసంగబడుచున్నవి. ఇంకను గ్రంథములు, పత్రికలు తెప్పించవలసిన యున్నవి. ఎలక్ట్రిసిటి, రేడియో అవసరము. ప్రతిసంవత్సరము ఆదాయమునకు మించిన వ్యయమగుచున్నది. కాన ఎల్లరు శక్తికొలది సహాయపడుడు. ధర్మములకు రశీదులను శాశ్వత ధర్మములకు రశీదులతోపాటు పట్టాలను, 5 గురు శాశ్వతధర్మకర్తల (రు 500 దాతలు) సంతకములతో నిచ్చెదరు. క్యాటలాగులు అచ్చువేయబడెను. బజారులో బ్రాంచి లైబ్రరీకూడ కలదు.

ఇతర వివరములకు:—

రావుబహద్దరు, మోతే గంగరాజు జమీందారుగారు, (ధర్మకర్తృసభాధ్యక్షులు)
మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు, (ధర్మకర్తృసభాగౌరవకార్యదర్శి)

1 RSVM01A 159

# ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము

## మనవి

తోఁబుట్టువులారా!

ఈ సంఘము ౧౯౧౪ వ సం॥లో ఏర్పడి 3,౪ ఏండ్లు అగ్గలికతో పనిచేసినది. కాని, పిదప ఇందు పనిచేయవలసినవారు పలువురు ఇతరోద్యమములలో చొచ్చి వానిలో చిక్కుకొనియుండుట వలన ఇది ఎట్లో కాలము కడపుచున్నను సరిగా పనిచేయఁగల ఉనికికి రాలేకపోయినది. అందుచే దీని బిడ్డ అగు గ్రంథాలయ సర్వస్వమును నానాఁటికి పెంపొంది చదువరులకు ఇంపుసొంపులు హెచ్చుగా సమకూర్పఁజాలకపోయినది. ఇంతకు మఱొక మాట. చందాదారులు హెచ్చుగా చేరి, అభిమానించి, తమ చందాలు తమంతతాము పంపుచుండినఁగాని, ఏపత్రికయేని బాగుగా వెలయఁగలుగుట ఎట్లు?

నాగరికత కొంచిన నాడులన్నిటిలో గ్రంథాలయములె ఆనాడులు అన్ని తెఱంగులను పెంపొందుటకు హెచ్చుగా పనిచేయుచున్నవి. మన తెనుఁగునాడుకూడ అటు లేల పెంపొందరాదు? అది మీరు గట్టిగా తలఁచుకొన్నఁగాని కాదు. మీతోడ్పాటుతో మాసంఘమువారు - ఇప్పుడు వలంతులు పెక్కురు పూనుకొనుటచే - గ్రంథాలయసర్వస్వము వలన తోడివారికి ఎల్లచందముల తెలివి తేటలను వెలయింప పూనుకొనినారు. అది తెలిపి వెలువడించిన సంచికలలో ఇది రెండవది. ఈ యేఁడు ౧౦ వ సంపుటమున ఇప్పటికి ౫ సంచికలు చందాదారులకు అందినవి. వారిలో చందాలు మాకు అందఁజేసినవారికి పెక్కు వందనములు. వారికంటె చందాలు చెల్లింపనివారే హెచ్చుమంది ఉన్నారు.

కావున, ఈయేటి చందాసొమ్ము చెల్లింపని చందాదారు లందఱును రాఁబోవు సంచిక వీ. పీ. గా పంపనక్కఱలేకుండ దయచేసి ఈసంచిక అందినవెంటనే తమచందాలు, మనియార్డరుగా, మేనేజరు, గ్రంథాలయ సర్వస్వము, గవర్నరుపేట, బెజవాడ - అను చిరునామాకు పంపుదురుగాక!

ఇపుడు గ్రంథాలయసర్వస్వము అన్నివిషయములనుగూర్చిన వ్యాసములతోడను వెలువడుచున్నది. కావ, ఇంతకుముందు చందాదారులుగా చేరని భాషాభిమానులందఱునుకూడ చందాదారులుగా చేరియు, ధనికులును, జమీందారులును, పోషకులుగను, రాజపోషకులుగను చేరియు మాకు తోడ్పడి ఆంధ్రదేశ గ్రంథాలయసంఘమునకు స్థిరత్వము కలిగించి దానిచే తెనుఁగునాటికి కొలువు చేయించి తెనుఁగువారిని పెంపొందింపఁజేయుదురుగాక!

నాటి పెంపుకొఱకు పాటుపడఁదలఁచువారెల్లరును పై సంఘమున సభ్యులుగా చేరి, మాకు తోడ్పడుదురుగాక! సభ్యత్వపుచందా ఏఁడాదికి రు 3-0-0 లు. అది చెల్లించినవారికి గ్రంథాలయ సర్వస్వము ఊరకే వచ్చును.

ప్రకటనములు చేయువారు మాఱుమూలలలోని ఊళ్ళకుకూడపోయి గ్రంథాలయములలో పలువురు చూచుటకు వీలుపడు మా పత్రికలో తమ ప్రకటనములు ప్రకటించి మేలొందుదురుగాక!

తమపొత్తములనుగూర్చి వెల్లడింపఁదలఁచు వ్రాతకాఁడులకు రేట్లు కొంతవఱకు తగ్గింతుము. కావున వారు దీని తోడ్పాటు కైకొందురుగాక!

ఖద్దరు సంస్థానమువారి కే. యస్. బార్టరుకంపెని, బెజవాడ (వస్తుమార్పిడిశాఖ)లో రిజిష్టరు చేసికొన్న చందాదారులకు వస్తురూపకమగు చందామీఁద "గ్రంథాలయసర్వస్వము" అందఁగలదు.

ది ౨౯-౯-౧౯౩౬,<br>
గాంధివిలాస్,<br>
బెజవాడ.

మారేపల్లి రామచంద్రశాస్త్రి,<br>
కార్యనిర్వాహక సంఘాధ్యక్షుడు.


# విషయసూచిక


| విషయము. | | పుట. |
|---|---|---|
| ౧ | మహాత్ముని సందేశము | 163 |
| ౨ | ఆంధ్రవిశ్వవిద్యాలయము - తెనుఁగు | ,, |
| ౩ | మూఢముకురము | 164 |
| ౪ | స్పైన్ దేశపు వీరవనితలు | 165 |
| ౫ | రాజవాద జాతకకథ | 168 |
| ౬ | అత్తమ్మకు జాబు | 170 |
| ౭ | చిత్పావన బ్రాహ్మణు లెవరు? | 172 |
| ౮ | కార్మికవిద్య - రస్కినుకాలేజి | 174 |
| ౯ | మేక్సిమ్ గోర్కి | 176 |
| ౧౦ | రుష్యాదేశపు నూతనరాజ్యాంగ ప్రణాళిక | 177 |
| ౧౧ | కాలము విలువ | 179 |
| ౧౨ | మానవునికి మాంసభక్షణము తగునా ? | 180 |
| ౧౩ | సనాతనధర్మసభలు | 182 |
| ౧౪ | జపానుదేశ వర్తకము - పరిశ్రమములు | 183 |
| ౧౫ | వస్తుమార్పిడి విధానమే స్వదేశోద్యమము | 184 |
| ౧౬ | ఐర్లాండులో గ్రంథాలయోద్యమము | 186 |
| ౧౭ | విజయనగర సామ్రాజ్యము | 188 |
| ౧౮ | ఆంధ్రద్విపద వాఙ్మయము | 191 |
| ౧౯ | భీమవరంతాలూకా గ్రంథాలయయాత్ర | 194 |
| ౨౦ | గ్రంథాలయవృత్తాంతములు | 195 |
| ౨౧ | ఇండియన్ అసెంబ్లీ - మద్రాసుశాసనసభ | 200 |
| ౨౨ | సంపాదకీయములు | 201 |



---

## సంపాదకులు:

1. గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు, ఎం. ఏ.
2. మారేపల్లి రామచంద్రశాస్త్రి.
3. అయ్యంకి వేంకటరమణయ్య.



శిథిలవిజయనగరమందలి కట్టడములు.



శిథిల విజయనగరములోని వేయికంబముల మండపము.

# గ్రంథాలయసర్వస్వము.

| సంపుటము ౧౦ | ధాత - భాద్రపదము - అక్టోబరు 1936 | సంచిక ౫ |
|---|---|---|


## మహాత్ముని సందేశము

(శ్రీ సబ్నీసు గురునాధరావుగారు.)

వినుడి వినుడి, ఓ జనులారా!
విని
ధన్యత నొందుడి, జనులారా!!
పతితపావనుడు - పురుషోత్తముడగు
గాంధిమహాత్ముని - ఘనసందేశము.

౧ ఖద్దరుకట్టుడి - జనులారా!
మన
కలిమిబలము అది - జనులారా!!
రాటముఁగొని యా-రాటముడిగి, పో
రాటములేకను-పొంది సుఖింతము...విను.

౨. పంచమజాతిని - జనులారా!
మన
పక్షముగొందము - జనులారా!!
మతమనగను మన - యాత్మోన్నతికే!
మానవైక్యతను- మాపనేర్పడదు...విను.

3. గ్రామోద్ధరణకు - జనులారా!
ఇక
గడగుదమండి, సు-జనులారా!!
నిప్పచ్చరముల - నిలయము లాయెను
పడినవృత్తులను - పైకితీయుదము...విను

## ఆంధ్ర విశ్వ విద్యాలయము - తెనుఁగు

(శ్రీ బాలకవి అల్లమరాజు నారాయణరావుగారు.)

సీ. పలుకఁపలుకఁనఁ దేనె లొలుకఁ మిక్కుటమైన, వలపు పుట్టఁగఁ జేయుఁ దెనుఁగుబాస
నన్నయమొదలగువన్నె కెక్కిన కవి,మణుల పేరిమిబిడ్డ తెనుఁగుబాస
భాషలన్నిఁటిలోనఁ బ్రఖ్యాతికెక్కిన రత్న, దీపంబు కాదొకో! తెనుఁగుబాస
భారతీయులకొంగుబంగారమై మించి, తేటఁగల్గినబాస తెనుఁగుబాస

గీ. అల్లనల్లన నన్యరాష్ట్రాంతరముల, నల్లుకొని ముద్దు గులుకంగ నెల్లవారి
కిల్లటికమయ్యెఁ గవుఁగిండ్ల నల్లలాడు, దివిజసన్నుతభాష కా! తెనుఁగుబాస.

సీ. అన్యభాషాసక్తి కాశించి గారాబు, తెనుఁగుబాసను మూలఁ జొనిపినారు
పహాణవిద్యకు సేవలొనరింపఁ గాలూని, మాతృవిద్యఁ బఠింప మానినారు
ఇంగ్లీషుకళయందు నేమొ వ్రాయుట లెంచి, తేటతెన్గు లిఖింపఁ దెలియలేరు
ఇతరభాషాగ్రంథవితతిఁ గూర్చుట నేర్చి, స్వీయగ్రంథాపేక్షఁ జెండినారు

గీ. కలితమధురాంధ్రభాషావికాసమహిమ, నుంత తలపోయ రకట! నీసుతులు; ఆంధ్ర
విశ్వవిద్యాలయము నేలు విభులకైన, నక్కటిక మింత లేదాయె నాంధ్రమాత !!

# మూఢముకురము.

(శ్రీ పట్టిసపు శ్రీరామమూర్తిగారు, కవితాసమితి.)

క. అవసానకాలమున నిన్నెవరెటు ప్రోచెదరు? నీ డు♦కృఞ్కరణము ల
య్యావి ప్రోవవుచుమి? రక్షకుఁడవు గోవిందుని భజింపు ♦ మనిశము మూఢా!

క. ధనమందుఁ దృష్ణ వీడుము; ఘనబుద్ధిన్ మది వితృష్ణఁ♦గను; నిజ కర్మం
బునఁబొందు ధనముతో మదిఁ దనుపుచు గోవిందునెప్పుడుఁ ♦ దలఁపుము మూఢా!

క. నారీజన నాభీస్తన భారముగని నీవు మోహ ♦ భరమందకుమీ;
సారెకు మాంసవసాది వికారం బవియంచు రోసి ♦ కను హరిఁ మూఢా!

క. నళినీదళ గత చంచల జలము వలెన్ జీవితమ్ము ♦ చపలము; వ్యాధ్యా
దులఁ శోక హతము లోకం; బిలఁ దీనినెఱింగి కొల్వు♦మీ హరిఁ మూఢా!

క. ధన సంపాదన కాలంబునఁ బరిజను.లుందురు; దేహ♦మున జర చేరఁ
గనరెవరు సరేకద, వార్తను నడుగరుగాన హరిని ♦ దలఁపుము మూఢా!

క. అడుగుదురు కుశల మూపిరి, యొడలన్ గలనాఁడె; గాలి♦ యుడిగినచో నా
యొడలిన్ గన నర్ధాంగియు నడలును; గావున భజింపు ♦ మచ్యుతు మూఢా!

క. అర్థ మనర్థము సుమ్మీ; అర్థమ్మున లేదు లేశ♦మైనను సౌఖ్యం;
బర్థార్థ్యుఁడడరుఁ బుత్రుల; కర్థము గ్రహియించి కొల్వు ♦ మచ్యుతు మూఢా!

క. ధరఁ గ్రీడలందు బాలుఁడు, తరుణీలోలత్వమంచుఁ ♦దరుణుఁడు, చింతా
భరమందు వృద్ధుఁడుండన్, హరిఁ గొల్చెదరెవరు? కొలువు ♦ హరి నెదఁ మూఢా!

క. ఎవ్వతె సతి? యెవ్వఁడు సుతుఁ? డెవ్వని వాఁడవుర? చిత్ర ♦ మీసంసారం;
బెవ్వసుధ కెట్లు వచ్చితి? వివ్విధము గ్రహించి కొల్వు♦మీ హరిఁ మూఢా!

క. సాత్విక సంగతి నిస్సంగత్వమ్మును గల్గు; దాన ♦ గల్గును నిర్మో
హత్వము; దానన్ నిశ్చల తత్వం; బద్దాన ముక్తి ♦ దనరును మూఢా!

క. ఎది కామము వయసేగఁగ? నెదిచెఱు వప్పింక? భాగ్య ♦ మెడలిన సైన్యం
బెది? తత్త్వమెఱుఁగ భవ మెది? అది యెఱఁగుఱు తెఱఁగి కొల్వు ♦ మచ్యుతు మూఢా!

క. ధనజన యౌవన గర్వము గనకుము; త్రుటిలో హరించు ♦ కాలము సర్వం
బును; మాయామయ మఖిలం బని విడు; పద మెఱిఁగి కొలువు ♦ హరిఁమదిఁ మూఢా!

క. దినయామినులును, ఋతువులు పునరాయాతములు; కాల ♦ మున్ గ్రీడలఁ బో
వును; చనునాయు వయినఁబో నను నాశభజింపుమెప్పుడుఁ ♦ హరి నెదఁ మూఢా!

క. వరవిద్యానిపుణులు శం కరభగవచ్చరణు లరసి ♦ ఘనతరవైయా
కరణునకీ ద్వాదశ మం జరియందున తత్త్వబోధ ♦ సల్పిరి మూఢా!

పద్మపాదుఁడు:—

క. ధనచింతవలన సన్మైత్రిని గానవదేల? కనుము;♦త్రిజగములందుఁ
ఘనసంసారాబ్ధితరణ మున కదియే నావ; కాన ♦ ముఖ్యము మూఢా!

తోటకాచార్యులు;—

క. జటలన్ బెంచుట, శిఖఁ దీయుట, లుంఛిత కేశుఁడౌట♦యున్, గావులఁ దా
ల్చుట యీబూటక వేసము లెటుముక్తిన్ గూర్చు? తిండి♦కే యివి మూఢా!

(సశేషము)

# స్పైన్‌దేశపు వీరవనితలు

(శ్రీ ఉప్పులూరి రామశాస్త్రిగారు)

[‘ఎల్లెన్‌విల్కిన్సన్’ కన్య ఇంగ్లండులో పార్లమెంటునందు సభ్యురాలు. ఆమె నేడు ఘోర యుద్ధములో మునిగియున్న స్పైన్ దేశమునకు ముఖ్యస్థానమగు ‘మేడ్రిడ్’ పట్టణమును దర్శించుటకు పోయి అనుభవించిన దృశ్యమును ‘జాన్ బుల్’ పత్రికలో ప్రకటించినది. ఇది నాటకములోని ఒకరంగమువలె చిత్రింపబడి స్పైన్ దేశపుస్థితిని కంటికి కట్టినట్లు తోపింపజేయును.]

కడచిన ‘మే’ మాసము వేసవిదినములు; రాత్రి 10½ గంటలైనది; ‘మేడ్రిడ్’లోని ‘ప్లాజా డెల్టారస్’ అను ఆవరణమునకు పైనున్న ఆకసపు కప్పున నిండుచందురుడు పెద్ద విద్యుద్దీపమువలె వెలుగుచున్నాడు. గొప్ప పాప్యులరుఫ్రంటు సమావేశము (అనగా నేటిదినము రాజ్యాధికారము వహించి తిరుగుబాటుదారులతో హోరాహోరిగ పోరుచున్న ప్రజాపక్షపు సమావేశము) జరుగనున్నది. విస్తారమగు అర్ధవలయాకారముగా తీరిన రాతిపీఠములు త్వరితగతిని నిండుచున్నవి. స్త్రీలు రాత్రిదుస్తులలోను, పురుషులు నగరపు దుస్తులలోను ఒండొరుల నొరసికొనివచ్చి ఆసీనులగుచున్నారు.

యువకుల బృందమును, యువతుల బృందమును ఏమాకనిపించలేదని నేను రిత్తచూపులు చూచుచుంటిని.

ఇంటర్‌నేషనేల్ శంఖారావముదీర్ఘమైనిశితమై మ్రోసినది. రంగములోనికి బారులుతీరినయువకుల బృందము, లయయుక్తముగ నడచినది. చూతునుకదా- నీలపురంగు నిండుదుస్తులతో, కార్మికసంఘపు పతాక చిహ్నములతో చూపట్టు యువకబృంద మిది కాదు. ఫేసిజము (ముసోలినీ రాజకీయమతము) పరముగా కానిండు, కమ్యూనిజము(సోవియటు రాజకీయ మతము) పరముగా కానిండు, ప్రజాప్రభుత్వముపరముగా కానిండు, ఏదోఒకరంగుపట్టులు తగిలించుకొని, ఈవిధముగా ప్రదర్శనములకు నడచు యువక బృందములను కడచిన అయిదేండ్లలో యూరోపు నందలి ముఖ్యపట్టణములందు చూచి ఎరుగుదును.

కాని హిట్లరుకు పూర్వము బెర్లిను నగరమున సోషలిస్టుల ప్రతిభ వెలుగుచుండినప్పుడుకూడ ఈవిధముగా గంభీరముగ బారులుతీరి వచ్చిన ప్రమిళల నెప్పుడును చూడలేదు. తలలెత్తుకొని, భుజములు నిక్కపొడుచునట్లు వెనుకకు త్రోసి, లయతప్పక నడచివచ్చుటచూడ సాధారణముగా కొంత సోలుచు, సొక్కుచు వచ్చు పురుషుల కన్న మే లనిపించినది.

లాటిన్ దేశములలో (స్పైన్ లాటిను దేశము) పురుషులు వీరులై పోరుదురు. కాని చూపులకు వారియందు వీర్యము ఉట్టిపడదు. ఈ స్పైన్ కన్యలందో- ప్రపంచమును గెలుతుమను ప్రౌఢదృష్టి నాకుతటిల్లతవలె గోచరించినది.

ఒక విషయము మరవవలదు. ఈ దృశ్యము స్పైన్‌లోనిది. ఇచ్చటి కన్యల కిదివరలో చదువు రాదు. చదువ తలంచినను మతపుసంగీతముతప్ప మరి ఏమియు చదువరాదు. ‘మేడ్రిడ్’ పట్టణమునకు దూరమందుండు కొన్ని గ్రామములలో నేటికిని ‘మూరిష్’ ఆచారములు (తురకల ఆచారములు) ప్రబలియున్నవి. 1930 లో గాంధి పరదా నుండి స్త్రీలను బయటకు లాగి వీరవనితలను చేసిన

ఆఖ్యాయికకు తరువాత నేటిదినము స్పైన్‌లో జరిగిన ఈశీఘ్రతమ పరివర్తనమునకు మించిన మరియొక పరివర్తనము ఎచ్చటను కానరాదు.

నాప్రక్కనుండిన ఒక 'స్పేనిష్'మిత్రము ఈకన్యకలు ఆయుధముల నుపయోగింపగల రని నాకు తెలిపెను. నాకు తెలియదా! యుద్ధమున చేతులుకలిపి పోరాడినవారిని నేను కన్నులార చూచినాను.

1934 లో 'అస్టూరియా'లో తిరుగుబాటుజరిగినది. నే నప్పుడు 'ఒవీడో'లో నుంటిని. అచ్చటి గనుల పనివాండ్రు స్వగృహముల సంరక్షణార్థము యుద్ధము చేయవలసివచ్చినది. అప్పుడు ఎవ్వరి నోటను ఇద్దరు కన్యకల పేళ్లే ఆడినవి. కొండ ప్రదేశములలోని గనుల పనివారు పరాజితులై పట్టువడిన పిదప, 'సూసీ,' 'అయొడాలాఫాంటీ' అను కన్యలు వెనుకటి మొనలను మగంటిమికి ప్రేరేచిరి. 'సూసీ' చూపిన ధైర్యమునకు మెచ్చి కవిసినసైన్యములయధికారులు ఆమె లోబడినయెడల ప్రాణరక్షణముతో కూడ సర్వగౌరవమును చేయుదు మనిరి. ఆమె లొంగలేదు. మరఫిరంగి చేతబట్టి కాల్చుచు, ఒంటినిండ గుండ్లు చొర ప్రాణము సమర్పించెను.

ఈ విధముగ 'స్పైన్' ఉత్తరసీమలలో స్త్రీలు వీరలై పోరుట సహజమైనది. కాని 'మేడ్రిడ్'లో 1934 వ సంవత్సరమున కూడ ప్రాచీనాచారములు వారిని వదలియుండలేదు. నేటికి మార్పు గలిగినది. క్రమముగా, ప్రశాంతముగా వారు డ్రిల్లు నేర్చి, యుద్ధమునకు సిద్ధపడుచున్నారు.

నాప్రక్కన 'మార్గరెటానెల్కన్' అను స్పైన్ దేశపు సోషలిస్టు పార్లమెంటు మెంబరు ఉండినది. ఆమెయు నావలె శాంతిస్థాపనమునకు మిక్కిలి పాటుపడినది. ఆమెను చూచి నేను "ఇది నాకు ఘోరముగ కన్పించుచున్నది; స్త్రీలు హత్యకర్మ కారంభింతురేని, ఈ మహాప్రవాహము ప్రపంచమును అగాధకర్దమాంబుధిలోనికి త్రోయగలదు" అంటిని.

ఆమె భుజ మెగవేసినది. 'స్పైన్' దేశములోని అంతఃకలహయుద్ధ మెట్టిదనుట మీరు చూచి ఎరుగరు. అందు దయాదాక్షిణ్యములు లేవు. పురుషునివద్దనుండి సంగతిసందర్భములను తెలిసికొనుటకై వానికంటియెదుట వానిభార్యను శత్రువర్గమువారు పెట్టునట్టి చిత్రహింసలు అవాచ్యములు. యుద్ధమారంభమయ్యెనా ఇట్టివి తప్పవు. కావున మాదేశమున స్త్రీలు రిత్తగ నిలిచి, పురుషులు హతులగుటను చూచుచుండ వీలులేదు! 'స్పైన్' దేశములోని అరాజకపక్షము వారు తమ స్త్రీలమీదనే ఆధారపడుచున్నారు. కాబట్టి ఆయుధప్రయోగమున, వేగులవృత్తియందు వీరిని సుశిక్షితలను కావించుకొన్నారు.

1934 లో ఆఫీసర్ల తిండిబల్లలవద్దిఆడునౌకర్లు, న్యాయాధికారుల మైలగుడ్డలను ఉతుకుటకు తీసికొనిపోవచ్చిన రజకస్త్రీలు, మాట మంతి జరుగుచుండగా నోరుమూసికొని- చెవులు తెరచికొని ఇండ్లు, గుమ్మములు, వీథులు ఊడ్చుచుండిన చక్కనిచుక్కలగు దాసీపిల్లలు, అందరున మరునిమేషముననే వేగునడిపి తిరుగుబాటుదారులనడంచుటకు 'లేరక్సు' ప్రభుత్వమువారిచే పంపబడిన ఆఫీసర్లచుట్టును భయోత్పాతకపరిస్థితులను కల్పించిరి.

1934 లో అరబ్బీలు 'అస్టూరియన్' గ్రామములలోనికి పోవుటకు జంకుచుండిరి. ఏలయందురా? అచ్చటి రైతుస్త్రీజనము పులులవలె వీరిపైబడి చించివైతురను భయము వీరికి నిండి

పోయినది. కాని ఈ ప్రాంతపు స్త్రీలు గ్రామములు వదలిరారు.

పట్టణ మండలి నేత పరిశ్రమాగారములలోను, కాగితపు పరిశ్రమాగారములలోను పనిచేయునట్టి స్త్రీలకు, గుంపు, దుమ్ము, శబ్దము లక్ష్యములేదు. కావున వారు యుద్ధశ్రేణిలోనికి దుమికి ప్రశాంతముగ పోరగలరు.

దేశస్థులమధ్య యుద్ధము గృహకల్లోలము వంటిది. అందు నీతిసూత్రములు వర్తింపవు. ఆడువారే అని వ్యక్తులను యుద్ధానర్హులుగా ఆలోచించుట పొసగదు. ఇండ్లమీద పడుట తప్పదు. కావున స్త్రీలు ఏది చేతికి దొరకిన దానినిఉపయోగించి పోరాడకతప్పదు ఇందులో సుశిక్షితలు కానివారు మందుగుండు సామగ్రి అమితముగా వ్యయముచేసి తమ పక్షమునకే నష్టము కావింప వచ్చును.

కాబట్టి 'స్పైన్' దేశపుమగవారు స్త్రీలకు చక్కని తరిఫీయతు కల్పించి, వారికి తగినదుస్తులను నిర్ణయించి, యుద్ధార్హలనుచేయుచున్నారు. చేతకాని ముదుసలులను దయతలచి శత్రువులు వదలిన వదలుదురు. లేకున్న వారిగతి దైవమెరుగు.

ఇప్పటికే స్పైన్ దేశమున, యుద్ధప్రక్రియలో పేరుగాంచిన స్త్రీలు గలరు. 'లాపెసనేరియా' అనునామె పార్లమెంటులో సభ్యురాలు - పొడుగరి- పలుచన- వాడినవెల్లముఖము- దట్టమగు నల్లవెండ్రుకలలోరజత రేఖలుచూపుగాంభీర్యము.

ఆమె తేనీరు త్రాగునపుడు ఆరాత్రి చూచితిని.నిద్రపోవునా ఏమి అనుకొంటిని.లేచి ఉపన్యాసము ఆరంభించినది. మైక్రోఫోను (దూరశ్రవణయంత్రము)ఎదుట అద్భుతముగా ప్రసంగించినది. ఆమెనిర్మాణశక్తి అద్భుతమందురు. స్వయముగా యుద్ధముచేయకున్నను, ఫేసిస్టులకు, సోషలిస్టులకు ముమ్మరముగ పోరుకలిగినచోటికి ఇప్పటి యుద్ధమున పోయినది. శత్రువు లీమెనుపట్టుకొనినారు. ఈమెకును, ఈమెతో సమముగా నాయకత్వము వహించియుండు 'మార్గరెటుమెల్కన్', 'ఇజబెల్ మార్టినెస్', 'ఎమీలియారే' అను స్త్రీరత్నములకును ఏమిగతి పట్టినదో ఇప్పుడు చెప్పలేము.

ఈయుద్ధము ముగిసిన పిదప మాత్రము స్త్రీల దశయందు మహత్తమపరివర్తనము 'స్పైన్'లో కలుగుననుటకు సందియములేదు.

---

## వీణ

తెలుగు మాసపత్రిక

అన్నిస్వరాలు పలికేది వీణయందే !

అన్నివిషయాలు కనేది వీణయందే !!

ఫెదర్వైటు పేపరు - ముచ్చటైన ముద్రణ.

డిసెంబరు నెలాఖరులోగా చందా పంపేవారికి

సాలుచందా రు 2 లు మాత్రము. ఆపయిన రు 3 లు చెల్లించాలి.

మేనేజరు : "వీణ": తేలప్రోలు - కృష్ణాజిల్లా.

# రాజవాద జాతకకథ *

(ఉభయభాషాప్రవీణ, శ్రీ కానూరు వీరభద్రేశ్వరరావుగారు, బి.ఎ., ఎల్.టి.)

పూర్వము బ్రహ్మదత్తమహారాజు కాశీరాజ్య మేలుచుండఁగా బోధిసత్త్వుఁ డతని యగ్రమహిషిగర్భమునం దుదయించెను. నిండుమాలాలికి లబ్ధగర్భపరిహారాదిసంస్కారములు జరిగినపిదప శుభలగ్నమం దామెసుఖముగాఁ బ్రసవించెను. పుట్టిన శిశువునకు బ్రహ్మదత్తకుమారుఁ డని నామకరణముఁ జేసిరి. ఆ రాజకుమారుఁడు శుక్లపక్ష చంద్రునివలె దినదినప్రవర్ధమానుఁడై షోడశవర్షప్రాయుఁ డయ్యె. అంత నా యువరాజు తక్షశిలానగరమున కేగి నిఖిలవిద్య లభ్యసించి సర్వకళాప్రవీణ్యుఁ డయ్యెను. పితృమరణానంతర మాతఁడు రాజ్యప్రతిష్ఠితుఁడై ధర్మపరిపాలనముఁ జేయుచుండెను. చండశాసనమునఁ గాక వినిశ్చయమువలన న్యాయము శాసించుచుండెను.

రాజు చేయుచున్న ధర్మపరిపాలనఁ జూచి, అమాత్యులును ధర్మమార్గముననే వ్యవహార వినిశ్చయము గావించుచుండిరి. వ్యవహారము లిట్లు ధర్మమార్గమునఁ బరిష్కృతములగుటఁ జేసి కూటస్థకారకు లదృశ్యులైరి. అభియోగము లభావములైనందున రాజాంగణమం దుపరవము పరిక్షీణమాయెను. అమాత్యులు ప్రతినిత్యమును వినిశ్చయస్థానములం దాసీనులై అందు రాకపోకలుసేయు జనములేమి యూరక పరిక్రమించుచుండిరి. అంతకుమున్ను కిటకిటలాడు వినిశ్చయస్థానములు పరిత్యజింపఁబడిన వాని పోలిక నిర్మానుష్యములైనవి.

బోధిసత్త్వుఁ డిట్లని చింతించెను. "నారాజ్యమందలి ధర్మపరిపాలనవలన వినిశ్చయార్థము జనులెవ్వరు వచ్చుట లేదు. ఉపరవము పరిక్షీణమయ్యెను. వినిశ్చయస్థానములు పరిత్యాగభావముపొందినవి. నా ఆత్మయందలి అగుణములను వెదకి కనుఁగొని వాటిని వర్జించి సద్వర్తన మలవరచుకొనెదఁగాక". అంతటినుండి రాజు తన యవగుణములగూర్చి అగుణవాదులఁ దర్కించెను. నగరమం దెటఁజూచినను స్వీయగుణకథనమే వినవచ్చుటఁజేసి, "వీరు నాకు భయపడి నా అగుణములను గణింపక సద్గుణములనే ఏకరువుపెట్టుచున్నారు. ఇట్లు కాదు, నగరముబయటి జనము నడిగి కనుఁగొనెద"నని తలంచి రాజు నగరమువీడి బాహ్యనగరమందలి చతుర్ద్వారగ్రామకులను ప్రశ్నించెను. వారును దన అగుణములు గణింపక గుణకథనమునే చేయుటఁ జూచి జనపదము లేగ నిశ్చయించెను. రాజంతట మంత్రులకు రాజ్యసర్వస్వ మప్పగించి రథమెక్కి సారథిని వెంటఁగొని అజ్ఞాతవేషధారియై నగరము నిష్క్రమించెను. జనపదము లన్నియుఁ దిరిగియడుగుచు పశ్చాంత భూమికేగి యచ్చటఁగూడ నిజగుణకథనమే వినవచ్చినందున రాజు పశ్చాంతసీమనుండి వెనుదిరిగి మహామార్గమునఁబడి నగరాభిముఖుఁ డయ్యెను.

ఆదే సమయమునకు కోసలమహారాజు మల్లికుఁడనువాడు ధర్మపరిపాలనఁజేయుచు అగుణగవేషణార్థము నగరజనుల నడిగిచూచి యెల్లకడల నాత్మగుణగణకథనమే వినబడినకతమున జనపదములు పరీక్షింపవలెనని బయలుదేరి ఆప్రదేశమువద్దకువచ్చెను. ఉభయ ధరాధిపతులును ఏకకాలమందు నిమ్నశకటమార్గమం దభిముఖులైరి. రథద్వయమునకుఁజాలు ఉత్క్రమణస్థాన. మయ్యెడలేదు. అప్పుడు కోసలరాజుసారథి వారాణసిరాజుసారథిని రథోత్క్రమణముఁ జేయుమని యడిగెను

వారాణసిరాజుసారథి— 'ఓ సూతుఁడా! నీ రథమునే తప్పింపుము. ఈ రథమునందు వారాణసిరాజ్యస్వామి బ్రహ్మదత్తమహారాజున్నాఁడు.

కోసలరాజుసారథి— "ఓ సారథీ! ఈ రథమునందు కోసలరాజ్యస్వామి మల్లికమహారాజున్నాఁడు. నీ రథమునే తప్పించి మారాజురథము ముందుపోవుట కవకాశ మొసంగుము."

కాశీరాజుసారథి— "ఆ రథమునందుగూడ మహారాజున్నాఁడు. కిం కర్తవ్యమ్" అని చింతించి, "ఇందుల కొక్క యుపాయము గలదు. వయస్సుఁ బ్రశ్నించి పెద్దవానిరథము ముందుపోవునట్లు చేసెదను"అని నిశ్చయించి కోసలరాజువయస్సు నడిగెను. ఇరువురును సమానవయస్కులని తేలెను. రాజ్యపరిమాణమును గూర్చియు, యశో బల వాహనాదులఁ గూర్చియు, జాతి గోత్ర కుల ప్రదేశములను గూర్చియుఁ గనుఁగొనఁగా ఇరువురును త్రియోజనశతరాజ్యస్వాములే

* పాలీభాషనుండి తెనిఁగింపఁబడినది.

యనియు సమాన బలధనయశోజాతిగోత్రికుల ప్రదీపకు లనియు ధృవపడెను. కాశీరాజుసారథి, "వీరిరువురిలో శీలసంపన్నాధికు లెవరు" అని మరలఁబ్రశ్నించెను. కోసలరాజు సారథి తన ఱేని శీలాచారములు వర్ణించి అగుణములుకూడ సద్గుణములుగ నెట్లు ప్రకాశించుచున్నవో ప్రథమగీతము(గాథ) నిట్లని పాడెను.

దళ్హం దళ్హస్సఖిపతి మల్లికో ముదునా ముదుం
సాధుంపి సాధునా జేతి అసాధుంపి అసాధునా
ఏతాదిశో అయం రాజా మగ్గా ఉయ్యాహి సారథీతి
కఠినతను దాల్చు కర్కశ గణము నెడల
మృదులత వహించుఁ గోమలహృదయు లందు
శిష్టులను బ్రోచు ఖలులను శిక్ష సేయు
మా నరేంద్రుఁడు సూతుఁడా! మార్గ మిమ్మ.

వా॥ సా॥ ఏమండి, ఇదియేనా మీరాజు గుణకథనము?

కో॥ సా॥ అవును. అంతే.

వా॥ సా॥ ఇవియే మీరాజు సుగుణములైన అగుణము లెట్లుండునో పేర్కొనుము.

కో॥ సా॥ అగుణములైనను అవియే. సుగుణములైనను అవియే. మీరాజు సద్గుణము లెట్టివి?

వా॥ సా॥ అయిన వినుము చెప్పెదను.

వారాణసిరాజు సారథి ద్వితీయగీతము నిట్లు పాడెను.

* అక్కోధేన జినే కోధం అసాధుం సాధునా జినే
జినే కదరియం దానేన సచ్చేనాలిక వాదినం
ఏతాదిశో అయం రాజా మగ్గా ఉయ్యాహిసారథీతి॥
విజయ మొందును క్రోధాగ్నిఁ బ్రేమవృష్టి
దానమున లోభ మలికంబు సూనృతమున
సాధువునను ఖలత్వంబు జయము గాంచు
మా నరేంద్రుఁడు, సారథీ! మార్గ మిమ్ము॥

అది విని మల్లికరాజును సారథియు రథము దిగి అశ్వములు విప్పి రథమును తొలఁగించి వారాణసీ రాజునకు మార్గ మిచ్చిరి. వారాణసీరాజు మల్లికరాజునకు శీలలక్షణము లిట్టి వని యుపదేశించి వారాణసికేగి దానధర్మము లొనర్చి పుణ్యము సముపార్జించుకొనుచు జీవిత పర్యవసానమున స్వర్గపదముఁ జేరెను. మల్లికరాజతని యుపదేశము పరిగ్రహించి జనపదములు పరిక్రమించుచు అగుణవాదులు కానరానందున స్వకీయనగర మరిగి దానధర్మములొనర్చి పుణ్యమార్జించుచు జీవిత పర్యవసానమున స్వర్గపదముఁ జేరెను.

* ఇది ధమ్మపదములోని 'కోధవగ్గో సత్తరసమో' లోని 3 వ గాథ.


# జ్యోతిషము

[స్థాపితము 1920 సం.]

మహాశయులారా!

నేను క్రొత్తగా మెస్మరిజమ్‌పవరును బట్టినన్ని, కొన్ని జ్యోతిషఫలగ్రంథములనుబట్టినన్ని, తమపేరునుబట్టినన్ని, తమజాతకము తయారుచేయగలను. తమ జాతకములో తమపుట్టిన తారీఖు, తిథి, నక్షత్రం, లగ్నం, పాదం, ఆయుస్సు, గృహసంబంధములో కొన్ని సంగతులు, కళత్రములు, సంతానములు, ధనభూలాభములు, గ్రహచక్రం, ఫలచక్రం, లోగడ జరిగిన సంగతులు, రాబోవుసంగతులు, దశ అంతరదశగ్రహాలు, లాభనష్టములు, యింకా అనేక అంశములతో గ్యారంటీగా తయారుచేసి తమ జాతకము V.P.P.గా పంపించగలను. ముందుగా ఒకజాతకము V. P. P. ద్వారాగా తెప్పించి దాఖలాలు చూడుడు.-[రేట్లవివరం.]

1. పుట్టిన తారీఖు మొదలుకొని ఆయుస్సువరకు ప్రతిసంవత్సర ఫలాఫలితములు వ్రాయుటకు:— రు. 4—2—0.
2. పుట్టిన తారీఖు మొదలుకొని ఆయుస్సువరకు ప్రతిదినవారి ఫలాఫలితములు వ్రాయుటకు:— రు. 10—2—0.

ఇట్లు, కొర్లాం చంద్రశేఖరం సిద్ధాంతి,
గలి నౌపడా, గంజాంజిల్లా (B. N. Ry.)

# అత్తమ్మకు జాబు

(శ్రీ టి. శివశంకరంగారు)

[ఇట్టి జాబు లొక్కొక్క విద్యార్థియు తన కుటుంబములోని వారికి పక్షమున కొక్కతూరియైనను వ్రాయనేర్చునేని అట్టి జాబులను ఇంటివారందరు చదివి సంతోషించుటయే కాక, అవివారి రుచులను సంస్కరించి ఇరువైపులవారిచిత్తవృత్తికి నాణ్యము నాపాదించును ]

అత్తమ్మకు,

నందిగామ, శ్రావణశుద్ధ సప్తమి

క్రొత్త చక్రవర్తినిగూర్చి కొన్ని వేడుక కథలను ఒక ఇంగ్లీషుపత్రికలో ఇపుడే చదివి ముగించితిని. నీవు వినియుండిన నిజముగ సంతోషింతువు. వానిని ఈ క్రింద సంక్షేపముగా వ్రాయుచున్నాను. చక్రవర్తిని, ఆయన తల్లిని గూర్చి చదివి నపుడెల్ల నీవును. భీమవరములోని నీ పెద్దకొడుకును జ్ఞాపకమునకు వచ్చుచుందురు

తండ్రి వీడిపోయినతోడనే తల్లికి రాణి పట్టము అంతరించుట సహజమే కదా? అట్లు కానీయక ఆ సత్పుత్రుడు మేరీ రాణియే ఎప్పటి వలె ముందును రాణిగా ఉండవలెనని రాజాజ్ఞగా ప్రకటించెను. ఈ మాతృభక్తి తన సార్వభౌమత్వమునకే ఎంతటి కాంతి నిచ్చినదో నీ చిన్న కొడుకునకు తెలియజెప్పుము. ఇంగ్లీషు వారిలో స్త్రీ పురుషులు కలసి యనుభవించు వినోదములలో నృత్యమొకటి. క్రొత్తచక్రవర్తికి చిన్ననాటినుండి నృత్యమన్న మజా. అంతేకాక దానియందు మంచి నేర్పరి. సందెవేళల లండను నగరములో మేళతాళములతో అక్కడక్కడ నృత్యములు జరుగుచుండును. స్త్రీగాని, పురుషుడుగాని నృత్యశాలకువెళ్లి ఆ వినోదమును పాల్గొనుట వారికి విహారము. ఈ చక్రవర్తి యువరాజుగా నున్నకాలమున తానిట్టివాడని ప్రకాశించకనే పదిలో పదుకొండవవాడుగా ఒక నృత్యశాలకు వెళ్లి స్కూల్ మిస్ట్రెస్ గా ఉన్న యొకయువతితో నృత్యము సల్పెను. ఇట్టి క్రీడలయందు నైపుణ్యమును ప్రదర్శించిన జతలకు కొన్నివేళల బహుమానముల నిచ్చుట అక్కడి యాచారము. ఆసమయమున మనరాజన్యునికిని, ఆయనతో నర్తించిన యువతికిని బహుమాన మియ్యతగినదిగా నృత్యశాలాధికారులు నిర్ణయించిరి. ఈసంగతి తెలిసెనో లేదో యువరాజు తనతో నృత్యమాడినయువతితో చెవిలో చెప్పి సెలవుగైకొని ఎవరికి తెలియక గుంపులో నుండి తసిక తప్పించుకొనెనట. పెద్దతనమునకు వన్నెపెట్టినది ఈపిల్లతనము.

స్కాట్లెండులో బ్యాగ్ పైప్(Bag Pipe) అనునది మిక్కిలి మనోహరమైన సంగీతపు తిత్తులమేళము. ఇట్టిదానిని నీవు సికందరాబాదున వినియుందువు. దీనియందు క్రొత్తచక్రవర్తికి ఆశ మెండు. తాను యువరాజుగా నున్న కాలమున ఒకానొకసారి ఈ మేళమును విని తాను నేర్చుకోవలెనను ఖుష్ లోపల పొడమెను. తనబసకు వెళ్లి వెంటనే నేర్పరి మేళగాని నొకనిని పట్టి తెప్పించి, ఆమేళము వాయించుటకు నేర్వ మొదలిడి అందులో ప్రవీణుడయ్యెనట. పదవిని లెక్కపెట్టక చేతికబ్బిన స్వచ్ఛందసంతోషము లనుభవించనేర్చుట బ్రతుకున నిజమైన జాణతనము.

తరచుగ ఆడువారికి అబ్బివచ్చినది కసూతి

పని. మన నూతనచక్రవర్తికి ఈచేతిపనియందు రుచి మెండు. కార్యాంతరములచే శ్రాంతుడై నపుడు సూదులు చేకొని దారము లల్లుట ఆయనకు విశ్రాంతి. ఆయన అల్లిన అల్లికలపనితనము కనుగొన్నపుడు కలుగు తృప్తి తనకొక విధమైన యానందము నిచ్చునట. సంపాదనలేని నిరుద్యోగులు ఇంగ్లాండున ఎందరో యున్నారు. కలిగిన వారి పాతబట్టల తిరిపెముగా తెచ్చి అట్టి వారికి పంచిపెట్టుటకు సంఘ మొకటియున్నది. దీనికై యపుడపుడు యువరాజు తిరిపెమిచ్చు బట్టలతో తన కసూతియల్లికలను కుప్పగా పంపివేయును. ఇట్టి నిరుపేదలలో రాజన్యుడల్లిన అల్లికపు వస్తువులని తెలియక ధరించు భాగ్యము కొందరికి లభించుచుండును.

ఈత, గుఱ్ఱపుసవారివంటి క్రీడలయందు ఈ నూతన చక్రవర్తికి ఎక్కువ మక్కువ. హాస్యప్రదములగు ప్రహసననాటకములు చూచుట యన్న రక్తి మెండు.

ఒకానొక రాత్రి ఈరాజన్యుడు నాటకము చూచుటకై వెళ్లియుండి తాను ధరించిన ఓవర్ కోటును (చలికై వేసికొను కంబడి పెద్దనిలువుటంగి) అచటి యాచారము ననుసరించి లోపల ప్రవేశించుటకు ముందు బయటి కట్టెమొళకు తగిలించి యుంచను తటస్థించినది. నాటకము చూచి యింటికి మరలునపుడు ఆ ఓవర్ కోటు కనబడదాయె. అమెరికా దేశస్థు డెవడో, యది మంచిరాజచిహ్నమని యాశగొని దొంగతనముగ గొనిపోయె నని ప్రక్కనున్న వా రెవరో మంచలించిరి ఇది విన్నపుడు 'నాకు శ్లేష్మరోగము దాపరించునటుల హర్త యాశించి యుండవచ్చు' (He perhaps wanted that I should catch Pneumonia) నని యుపహసించినవ్వసాగెను. ఇంతలో పోలీసు అధికారు లెవరో పత్తా చేసి యాహర్తను ఓవర్ కోటుతో తెచ్చి రాజన్యుని ముందు నిలబెట్టిరి. "రెండవ సారె నాకోటును దొంగిలింతువేని నీకోటునైనను దానికి బదులు వదలిపెట్టిపొమ్ము; ఇక ముందు యిట్టి చిల్లర చేష్టలమానుకొమ్ము." అని హెచ్చరించి, చుట్టుప్రక్కల వారిని నవ్వించి ఇంటికి బయలు దేరెను. ఘనతయందలి యిటి సరసత, రత్నమునకు బంగారుకుందనము కట్టుటతో పోలును కద?

భోజనశాలఘంట వినవచ్చుచున్నది. ఇక చాలించెదను. మామకు నా నమస్కారములు. మరచితిని. నా ముద్దుల సులోచన ఎప్పటివలె లేనిపోని ప్రశ్నలడుగుచు నిన్నుచిక్కులు పెట్టుచుండునా? దానికి నా ముద్దులు నిమ్ము.

ఇట్లు
నీ యనుంగు నీలకంఠుడు.


# ప్రతిభ

* *
*

త్రైమాసికపత్రిక. సంవత్సర చందా రు 2 లు.

నవ్యసాహిత్యపరిషత్తు: గుంటూరు.

# *చిత్పావన బ్రాహ్మణులెవరు?

## అనార్యులు బ్రాహ్మణులెట్లైరి?

(శ్రీ సురవరము ప్రతాపరెడ్డిగారు.)

మహారాష్ట్రములో చిత్పావన బ్రాహ్మణశాఖ యొకటి కలదు. ఆశాఖాబ్రాహ్మణులు ఉత్తమ బ్రాహ్మణులుగా పరిగణింపబడుచున్నారు. రాజకీయరంగములో మొగలాయిరాజులకాలము నుండి నేటివరకు చాల ప్రాముఖ్యత వహించినట్టివారు. ఆనాడు నానాఫర్నవీసును, ఈనాడు బాలగంగాధరతిలకుగారును ఈశాఖవారే.

ఈ చిత్పావనశబ్ద మెందుకు వచ్చెను? ఈ శబ్దము మన ధర్మ శాస్త్రములందు గాని, పురాణములందు గాని, దేశ చరిత్రలందుగాని, ఎచ్చట నైనను కలదా? మనము చూచునంతవరకు అట్టిప్రమాణము లెచ్చటను కానరావు. కాని సహ్యాద్రిఖండమను గ్రంథములో పరశురాముని మాహాత్మ్యమును ప్రకటించుచో నీజాతివిషయమైన గాథ పేర్కొని యున్నారు.

చిత్పావన అను శబ్దము సంస్కృతముగానే కనబడు చున్నది. దానియర్థము జ్ఞానముచే పావనులయినవారు అని. అనగా వారు మొదట కర్మలచే పావనము కానిపనులు (చేపలవేట - జంతువులవేట అనవచ్చును) చేయుచుండిరనియు,తర్వాత తమబుద్ధికుశలత చేత హిందూ సమాజములో పడయరాని పదవిని - బ్రాహ్మణపదవిని - పొందిరనియు అర్థమిచ్చుచున్నది.

అయితే కొందరు ఈ పదము చిత్పావనకాదనియు "చితిపావన"అని యుండవలెననియు అందురు. శ్మశానములో శవముల కాల్చుటకు ఏర్పాటు చేసిన చితిలో పావనమైనవారు అని దీనియర్థము, ఇట్లు పేరువచ్చుట కొక కథ చెప్పుదురు. మనహిందువులకు (ఎందు తక్కువైనను) కథలు అల్లుటలో పురాణములు పెంచుటలో శాస్త్రిలు నింపుటలో మంచినిపుణత కలదు. ఈ చితిపావనులు బ్రాహ్మణులగుట కొక పురాణగాథ యవసర మయ్యెను. ఆకథ యిట్లు చెప్పబడుచున్నది:—

బొంబాయిరాజధానిలో పశ్చిమతీరమందు కొంకణ మండలము కలదు. అందు రత్నగిరియను నగరము కలదు. ఆ రత్నగిరిలో చిప్లూణ్ అను గ్రామము కలదు. ఒకనాడు (అనగా పరశురాముని కాలములో!) పశ్చిమ సముద్రములో గొప్ప తుపాను చెలరేగినది. ఒకనావ అప్పుడు ప్రయాణము చేయుచుండెను. అందు శ్వేతశరీరములును పచ్చని కనుగ్రుడ్లును కలవారు కొందరుండిరి. ఓడ తుపానుచే కలతచెంది చంచలత ప్రకటించెను. నావికులు ప్రయాణికులు ఓపినకొలది పాటుపడిరి. కాని లాభము లేక, ఓడ మునిగెను. అందరును చనిపోయిరి. మరునాడు తెల్లవార కొంకణతీరమందుండు "చిత్తపోలన" లేక "చిప్లూణ్" అను రేవుతీరములో ౧౪ శవములు గ్రామవాసులకు కనబడినవి. గ్రామవాసులు అనాథప్రేత సంస్కారము చేయ సంకల్పించి అదేతీరములో నొక చితి నేర్పాటుచేసి శవదహనము చేసిరి. పరశురాము డప్పుడు ప్రత్యక్షమై ఆ కాలుచున్న శవములను బ్రతికింపగా వారు చితిశుద్ధులై బయలువెడలిరి. ఆనాటినుండి వారు చితిపావనులని పిలువబడిరి.

వారదేతీరములో చేపలుపట్టుచు వేటాడుచు జీవనము చేసికొనుచుండిరి. అచ్చటి స్త్రీలను వివాహమాడిరి. కొంతకాలమునకు ఈ ౧౪ మందివి ౬౦ కుటుంబముల వరకు పెరిగెను. పరశురాముడు తాను కశ్యపునికి యావత్ప్రపంచము దానముచేసినతర్వాత ఆ కృతఘ్నుడైన ప్రతిగృహీత పరశురాముని తనరాజ్యము నుండి వెడలిపొమ్మనుటయు, అంత నతడు తన పరశువును సముద్రములో పారవైచి క్రొత్తభూమిని సముద్రమునుండి పైకి తీయుటయు, అదియే కొంకణమగుటయు విపులీకరించి చెప్పనవసరము లేదు. ఇట్టి తన నూతనరాజ్యములో నొకనాడొక గొప్ప యుత్సవము చేయుచు బ్రాహ్మణుల నామంత్రణము చేయగా వారువచ్చుటకు నిరాకరించిరి. అంత కోపముచే బ్రాహ్మణ ప్రతిసృష్టి చేసితీరుదు నని సముద్రతీరమున ఆలోచనమగ్నుడై తిరుగుచుండగా మనచితిపావను లెదురైరి. వారు చితిపావనులని తెలిసికొని వారినే బ్రాహ్మణులగునట్లుగా

*ఈ వ్యాసములో చిత్పావనులు ఆర్యహిందువులు కారనియు, వారు ఈజిప్టు దేశమునుండి వచ్చినవారనియు వారు మొదట బెస్తవారుగానో వేటకాండ్రుగానో యుండి క్రమముగా బ్రాహ్మణులైరనియు నూతన సిద్ధాంతము గావింపబడినది.

"ఫర్మానాను" ఇచ్చి, వారిని ౧౮ గోత్రాలవారినిగా విభాగించెను.

ఇది సహ్యాద్రిఖండపురాణగాథ. ఈగాథలో సత్యము దాగియున్నది. పరశురాముని కాలము సుమారు ౪౫౦౦ ఏండ్లక్రిందటిది. అంత ప్రాచీనములో కాకున్నను ప్రాచీన చారిత్రక యుగమునాడు, మనదేశమునకును, ఈజిప్టు, పర్షియా, అసీరియా, ఫినీషియా మున్నగుదేశములకును విరివిగా వ్యాపారము జరుగుచుండెను. ఆకాలములో నెన్నడో ఈజిప్టునుండి౧౮కుటుంబములవారో లేక యింకను హెచ్చు సంఖ్యవారో వ్యాపారార్థమో లేక వలసగానో మనదేశము వచ్చినారు. తుదకు ౧౮ గుంపులవారు కొంకణప్రాంతములో నిలిచి పోయినారు. వారిలో గోత్రాలుకూడా అన్నియు విదేశీయములుగా కనబడుచున్నవి.

"గోట్గే, కర్వే, హింగ్నే, లేలే, గద్రే," మున్నగునవి. ఈపదాలనుబట్టిచూడ వీరు పూర్వ మెన్నడో జెడ్రోషియా, కిర్మన్, మక్రన్ (Gedrosia, Kirman, Makran &c.) ప్రాంతములనుండి వచ్చియుందురని కొందరి సిద్ధాంతము.

ఈచిత్పావనులు తప్పక ఈజిప్టు దేశమునుండి వచ్చియుందురు. మొదట వీరిని "ఈజిప్తవాన్" ఈజిప్తువారు అనియుందురు. క్రమముగా ఈపదము "చిత్పావన్" అయియుండును. దీనిని సమర్థించుటకు యథార్థమును పురాణములో లీనము చేసి కథను కల్పించియుందురు.

విదేశీయులైన అనార్యజాతులు మనహిందూసమాజ జాతులలో క్షత్రియులుగాను, బ్రాహ్మణులుగాను అయిన చారిత్రకనిదర్శనములే వందలకొలది కలవు. ఇక పురాణములవరకు పోవలసిన అవసరము లేదు. హూణులు, శకులు, బర్బరులు, మ్లేచ్ఛులు, పహ్లవులు, గ్రీకులు, ౘనులు మున్నగుజాతులవా రెందరో బ్రాహ్మణ క్షత్రియులై పోవుటయేకాక, పురాణముల కెక్కుటయేగాక, సూర్య చంద్రవంశములలోని కెక్కి పవిత్రులై పోయిరి. అట్టి శాఖలలో ఈజిప్టు దేశమునుండి వచ్చినశాఖ యొకటి.

ఈజిప్టునకును మనదేశమునకును పూర్వము రాకపోకలు, వ్యాపారములు విరివిగానుండెను. క్రీస్తునకు పూర్వము ౧౦౦౦౦ సంవత్సరముల నాడే ఈజిప్టులోని "పిరమిడ్ల"లో రాజుల శవములను కప్పినవి భారతదేశవస్త్రములే. నైల్ (Nile) నదికి నీలనది అని నామకరణము చేసినది మనవారే. మన అగ్నిపురాణములో ఈజిప్టుదేశము యొక్కయు తత్పరిసరరాష్ట్రముల యొక్కయు భూగోళము సక్రమముగా వ్రాయఁబడినదనియు, ఇప్పుడాప్రాంతములు అరణ్యములచేత నిండిన వగుటచేత అగ్నిపురాణములో చూపిన ప్రకారము ప్లాను వేసికొని తాను ఆప్రాంతముల పరీక్షింప గల్గితిననియు, సుమారు ౧౦-౧౫ ఏండ్ల క్రిందట మోడరన్ రివ్యూలో నొక ఆంగ్లేయుడు వ్రాసియుండెను. కావున చిత్పావనులు పరీక్షించి చూడ ఈజిప్టువాసులుగా నుండుటలో నేమియు నాశ్చర్యము లేదు. హిందూమతములోనికి విమతస్థులను, విజాతీయులను తీసికొన నొల్లమను సప్తర్షిసంతతివారమని చెప్పుకొను సనాతనులు పై విషయముల చదివి ఏమనుకొందురో యేమో పాపము!

జర్మన్ విశ్వవిద్యాలయమునకై యాకర్షింపబడి
మదరాసు, మైసూరు, అన్నామలై యూనివర్సిటీలచే మెప్పొందిన

# గానకళాచంద్రిక

ఇయ్యది, టెక్నికల్ పరీక్షార్థుల కత్యంతోపయుక్తమగు సంగీతలక్ష్య లక్షణములను, వాగ్గేయకారకుల జీవితములను వ్రాయబడి ప్రభుత్వామోద మొందిన గొప్ప సంగీత లక్షణగ్రంథము.

400 పుటలు. నిండుక్యాలికో వెల రు. 2—0—0.

గ్రంథకర్త: అరిపిరాల సత్యనారాయణమూర్తి,
గాంధీనగర్, బెజవాడ.

# కార్మికవిద్య - రస్కిను కాలేజి

(శ్రీ జటావల్లభుల పురుషోత్తముగారు ఎం. ఏ.)

కొంతవిద్యను గడించి దాని నే కళాశాలలో నైన జేరి వృద్ధి నొందించుటకు వీలులేని వారికి 'ఆక్సుఫర్డులోని రస్కినుకాలేజి' వారు పోష్టు ద్వారా విద్యను గఱపుదురు. కార్మికులయొక్కయు కార్మిక సంస్థలయొక్కయు యోగక్షేమములకు సంబంధించిన విషయములే సాధారణముగ బోధింపబడును సర్వమానవులకు గావలసిన విషయములును, రాజకీయములును గూడ బోధింపబడును. విద్యార్థి తనభావములను వ్రాతలో స్పష్టముగ జెప్పుటకు సమర్థుడుగ జేయబడును.

సమర్థులైన యుపాధ్యాయులచే పాఠ్య విషయములనుగూర్చి వ్రాయబడును. నెల కొక్కొక్క విషయము చొప్పున విద్యార్థికి పోష్టులో పంపబడును. విషయముయొక్క వివరమైన వ్యాఖ్యానమును, విద్యార్థి దాని నధ్యయనము చేయవలసిన విధమునుగూడ వ్రాసి పంపబడును నెల కొకసారి విద్యార్థి వ్యాసరచన చేయవలసి యుండును. ఆవ్యాసము లుపాధ్యాయుడు దిద్దుటకై పంపబడును. ఉపాధ్యాయుడు వానిని శ్రద్ధగా దిద్ది తగినసూచనలను విద్యార్థికి వ్రాసి పంపును.

ఇట్టి యుపాధ్యాయు లనేకు లుందురు. ప్రతి విద్యార్థియు నొక యుపాధ్యాయునిశిక్షణములో నుండును. వీలైనంతవఱకు నుపాధ్యాయునకును విద్యార్థికిని ననుబంధము హెచ్చుచేయుటకు ప్రయత్నింపబడును. కొందఱు విద్యార్థులు ప్రశ్నలు వేయుటకుగూడ ప్రోత్సహింపబడుదురు. వీని కుపాధ్యాయులు సమాధానముల నిత్తురు. రస్కిను కాలేజిలో నివాసముండి విద్యనభ్యసించుచుండు విద్యార్థులపాఠక్రమమును చాల వఱకు ననుసరించియే యీపోష్టలుశిక్షణ ముండును. కాలేజి ప్రిన్సిపాలు పోస్టలు బోధనశాఖపైని దృష్టిగానుండును. కళాశాలలో నివసించుచుండు నుపాధ్యాయు లందఱును నీశాఖలో శ్రద్ధతో పనిచేయుచుందురు.

పోష్టు ద్వారా పంపుపాఠములుగాక మరేమైన పుస్తకములను విద్యార్థులు చదువవలసి యుండుచో నాపుస్తకములు స్థానికము లగు సార్వజనికగ్రంథాలయములలో లభించును.

పైని దెలిపిన విధముగ పోష్టలుద్వారా భోధింపబడు విద్యాప్రణాళికయొక్క స్వరూపము తెలియుటకై యీక్రింది యుదాహరణము లుపయోగింప గలవు.

1. ఆర్థికచరిత్ర:— ఆఱుమాసములశిక్షణము. చరిత్రయనునది మానవుని యనుభవమును వృద్ధి నొందించును. "అదిమన గ్రహణశక్తినివృద్ధి నొందించును;" సమకాలిక సమస్యలను పరిష్కరించుటకు తోడ్పడును. ఈవిషయముల వివరణము. ఇంగ్లండు యొక్క పూర్వపు టార్థికస్థితి. పూర్వు లెట్లు ధనార్జన చేయుచుండిరో, వారు పట్టణముల కెందులకు చేరుకొనిరో, బ్రిటిషువర్తకము క్రమక్రమముగ పెరిగి నేటి యున్నత స్థితి కెట్లు వచ్చినదో, యొకప్పుడు వ్యవసాయప్రధానముగనుండిన బ్రిటను క్రమముగ నెట్లు పారిశ్రామిక దేశమైనదో యను విషయములు బోధింపబడును.

2. కార్మికోద్యమము:— ఒక సంవత్సరపు ప్రణాళిక. 19 వ శతాబ్దికి పూర్వము ప్రభుత్వమునకును కార్మికులకును గలసంబంధము· ట్రేడు

యూనియనులు, కార్మిక పక్షము బయలు దేరిన హేతువు, విధానము, సహకారోద్యమప్రారంభము. పరిశ్రమలు కొనుబడిదారుల స్వాధీనమగుట. ఉత్పత్తిని నియమముల ప్రకారము నడపింపవలసిన యావశ్యకత. ట్రేడు యూనియనుల వివిధ భేదములు, వాని విధానములు, వానిపలుకుబడి.

3. రాజకీయ సమస్యలు:—ఆఱుమాసముల ప్రణాళిక. పార్లమెంటరీ విధానము, దాని మంచి చెడ్డలు, దానిసంస్కరణ సూచనలు — ఇవి వివరింపబడును. ప్రాతినిధ్య పద్ధతి. పార్టీలపద్ధతి. ప్రపోర్షనలు ప్రాతినిధ్యము. సర్వజనీనాభిప్రాయమును గన్గొనుట. రెండవ శాసనసభ యుండుటా మానుటా, దానిహక్కులెట్లుండ వలెను - అను సమస్య.

4. ఆంగ్లసాహిత్యము:-ఆఱుమాసములప్రణాళిక; వివిధసారస్వతశాఖల భేదములు, వానిలక్షణములు, గొప్ప రచయితల విజయమునకు గారణములు, వీరగేయములు, భావకవిత్వము మున్నగు పద్యములు. నవలలు. చిన్నకథలు. మహాపురుషుల చరిత్రలు. వ్యాసములు. విద్యార్థులు స్వతంత్రరచనలు చేయుటకుదగినశిక్షణమీయబడును. కాని యిందు నిర్బంధము లేదు.

పైని తెలుపబడిన విషయములలోనే కాక యీక్రిందివిషయములలోగూడ నీకళాశాలవారు శిక్షణమిచ్చెదరు ఆర్థికశాస్త్ర ప్రాతిపదిక లేశములు, ఉన్నతార్థశాస్త్రము, ట్రేడుయూనియనులా ఇండస్ట్రియలులా? ఆంగ్ల దేశములోని స్థానిక ప్రభుత్వములు, ఆధునిక సాంఘికరాజకీయచరిత్ర. మనమెట్లు పరిపాలింప బడుచున్నాము? మానసిక శాస్త్రము, ఆంగ్లవ్యాసరచన—వ్యాకరణము. ఆంగ్లసారస్వతము, చారిత్రికదృష్టి, నాటకములు, వేదాంతము, తర్కము.

ఈవిధముగ పోష్టుద్వారా విద్యనేర్చుకొనువారు రస్కిను కాలేజివారికి ఆఱుమాసములకు 1 పౌను 11 షిల్లింగులను, సంవత్సరమునకు 3 పౌనుల 3 షిల్లింగులను నీయవలసి యుండును. కార్మికవిద్యాసంఘము (వర్కర్సు ఎడ్యుకేషనల్ అసోసియేషను) లో సభ్యులైన వారింతకంటె కొంత తక్కువ యీయవలసి యుండును. కాని కొన్నివృత్తిసంఘములవారు తమసంఘసభ్యులకీ విద్య నుచితముగనే నేర్పింతురు. అనగా తామే వారి జీతములను రస్కినుకాలేజివారి కిత్తురు. అట్టి సంఘములు 13 కలవు. నాల్గు సంఘముల వారు సగము జీతమునకు చెప్పింతురు.

నాగరిక ప్రపంచములో జన సామాన్యమునకు విద్యను వెదజల్లుట కిట్టి పద్ధతులెన్నియో కలవు. మన దేశములో నెన్నెన్ని విధముల విద్యా వ్యాపనముగావించిన ప్రస్తుతాజ్ఞానాంధకారము దొలగునోకదా! ఈ విషయమైన చింత మనవిద్యాశాఖాధికారులకుగాని స్థానికసంస్థలకుగాని విశ్వవిద్యాలయములకుగాని కలుగకుండుట శోచనీయము. మన దేశీయులు పాశ్చాత్యదేశములనుండి నేర్చుకొనుచున్న యసంఖ్యాకములగు దురాచారములకు బదులుగ నిట్టి మంచి పద్ధతులను నేర్చుకొనినచో దేశ మీసరి కెంత యున్నతస్థితికి వచ్చియుండునోకదా!

# మేక్సిమ్ గోర్కీ

(రుష్యాదేశపు సుప్రసిద్ధ రచయిత)

ఈమహాపండితునిజీవితము అత్యద్భుతమైనది. ఈయన ది 14-3-1868 తేదీని "నిజినినవ్గొరాడు"లో జన్మించెను. తండ్రి ఒక కలంకారీవర్తకుడు. తలిదండ్రులు చిన్నతనముననే గతించిరి. తరువాత ఈయన చేసిన ఉద్యోగములకు అంతు లేదు. మొదట చెప్పులకుట్టుపనిలో ప్రవేశించెను. కొంతకాలమైన తరువాత అక్కడనుండి పారిపోయి ఒక చిత్రశాలలో చేరెను. తరువాత ఒక ఓడమీదవంటపనికి ఒప్పుకొనెను కొంతకాలముతోటమాలిగా పనిచేసెను. ౧౫ సంవత్సరముల ప్రాయమువఱకు తుంటరిగా తిరిగి తుదకు, 'కాజన్'నగరములో ఒకపాఠశాలలో చదువు మొదలిడెను. ఇది ఎక్కువ కాలము సాగలేదు. జీవనోపాధికి శరీరకష్టము తప్పనది కాదు. రొట్టెల అమ్మకము సాగించెను. కొంతకాలము కూలిపనిచేసెను. ఈ చిత్రమే గమనింప దగినది! ఈకూలివాడు కొంతకాలమునకు 'నిజినినవ్గొరాడు'లో ఒక బారిస్టరువద్ద కార్యదర్శి అయ్యెను. ఆయన ప్రభావమున విద్యాబుద్ధులను పొందగలిగెను. ఇంతకంటెను కూడ "కొరొలెంకొ" అను గ్రంథకర్తయొక్క పరిచయ - సహకారములవలన, ఈయనకు భాషాపరిచయమునందభిరుచి పెంపొందెను.

ఈయన వ్రాసిన మొదటి ప్రహసనము "కుకసస్" అను సంచికలో ప్రచురింపబడెను. తరువాత ఈయన ఒక పత్రికాకార్యాలయములో చేరెను. అప్పుడు ఈయన వ్రాసిన 'చెల్కాష్' అనుకథ చదువరులదృష్టిని మిగుల ఆకర్షించెను.

తుంటరుల జీవితములను గురించి అనేక కథలు వ్రాసి ప్రచురించెను. ఈ కథలలో ఒక వృత్తిలో స్థిరత్వము లేక జీవితములో పిప్పిగంతులువేయువారివర్ణనలు పెక్కు గలవు. తనకువలెనే పారుబోతులుగా తిరిగెడివారి జీవితములలో ఆయన ఒక గొప్పరహస్యమును, సత్యమును గ్రహింపగలిగెను: సంఘముయొక్క మూఢాచారములనెడి శృంఖలములలో ఒడి, తెరువుగానక జనులు ఇక్కట్లుపడుచున్నారని ఆయన గ్రహించెను. ఈవ్యక్తిత్వప్రాధాన్యతతో వ్యక్తిత్వప్రభావమునే ఈయన తనగ్రంథములద్వారా ఎక్కువగా వెల్లడించెను. ఈయన గ్రంథములలోని 'చెల్కాష్' 'సెరెర్యూకా' 'మాల్వా' మొదలగు పాత్రలయొక్క ప్రధానలక్షణ మిదియే. 'ఫోమా గార్డివు' అను నవలలో వ్యాపారస్థులజీవితములను విపరీతముగ చిత్రించెను.

## ప్రభుత్వమువారి కన్నెఱ్ఱ.

గోర్కీయొక్క భావగర్భితమగుమృదుభాషాశైలివలన ఆయనగ్రంథములు ప్రజలఆదరణనుపొందగలిగినవి. బీదవారిపట్ల ఆయనకుగల అభిమానము, ఉద్యోగస్థులను గురిగొని విమర్శించు ధోరణి వీనివలన ఆయన ప్రభుత్వకోపమునకు గురి అయ్యెను. 1901 వ సంవత్సరములో విద్యార్థుల తిరుగుబాటుసందర్భమున పోలీసుఅధికారుల చర్యలను ఖండించుచు ప్రభుత్వమువారికి వ్రాసిన విజ్ఞప్తిలో గోర్కీకూడ సంతకముచేసెను. ఇది నెపముగా గొని విశృంఖలముగా విహరించుచున్న ఈవిద్యార్థిని శిక్షింపవలెనని ప్రభుత్వమువారు సంకల్పించిరి. అప్పుడు సెంటు పీటర్స్‌బర్గు అకాడమీలో గోర్కీ ఒకసభ్యుడుగా ఎన్నుకోబడెను. ఇది విద్యాధికుడు పొందదగిన అత్యున్నతపదవి. ప్రభుత్వమంత్రులు గోర్కీని ఈపదవినుండి విచారణలేకయే తొలగించి తత్క్షణము ముఖ్యపట్టణమును వదలి వెళ్ళవలెనని ఉత్తరువిచ్చిరి.

గోర్కీ ముఖ్యపట్టణమునువదలి 'కేప్రి'లో నివాసమేర్పరుచుకొనెను. తనతోపాటు దేశమును వదలి తలదాచుకొనవచ్చిన దీనులకు పలువురకు తనయింటిలో ఆతిథ్యమిచ్చెను. ప్రభుత్వమువారి ఉరిశిక్షలు, ద్వీపాంతరవాసశిక్షలు తీవ్రముగనుండెను. బుద్ధిమంతులగువారు తమంతటతామే మెల్లగా దేశమును వదలిపోసాగిరి. ఈప్రవాసశిక్ష ననుభవించుచున్న కాలములో గోర్కీ మహాశయుడు 'ది-స్పై' అను గ్రంథమును రచించెను. ఇందులో పోలీసువారి అవినీతిచర్యలను, నిరంకుశ విధానమును బహిర్గతమొనర్చెను. ఈయనవ్రాసిన "ది మదరు" (తల్లి) అనుగ్రంథము రుష్యాదేశపు కార్మిక కర్షకజనములలో విప్లవభావములను పురికొల్పెను. ఈయన రచించిన నాటకరాజములలో కెల్ల అతితీవ్రముగ సత్యమును వెల్లడిచేసినది. "ది లోయర్ డెప్త్స్" అనునాటకము. ఈయన ఈ సంవత్సరముననే చనిపోయెను.

# రుష్యాదేశపు నూతన రాజ్యాంగ ప్రణాళిక.

రుష్యా దేశపు నూతన రాజ్యాంగ ప్రణాళికయొక్క 150 లక్షలప్రతులు అచ్చొత్తించబడి ప్రజలలో పంచిపెట్టబడినవి. ది25-11-1936 తేదీని జరుగనున్న మహాసభలో ఈప్రణాళిక ఖాయపఱచబడును. ప్రపంచములో యంత్రములమీద తయారగుచున్న ఉత్పత్తి మొత్తములో అరవవంతు రుష్యా దేశములో ఉత్పత్తి అగుచున్నది. సర్వసామగ్రియు ప్రభుత్వస్వాధీనములో నుంచుకొని ప్రజలకందరకుపని, విశ్రాంతి, విద్య, రక్షణ, వాక్స్వాతంత్ర్యము కలుగజేయుటకు ఏర్పరచిన పదునేడు కోట్ల ప్రజల యేకోన్ముఖ నిశ్చయము ఈప్రణాళికలో పొందుపరచబడినది.

ఈనూతన ప్రణాళికలో జరిగిన ముఖ్యమగు మార్పు లేవన:

## ఎన్నికలు

ఇదివరలో కార్మిక - కర్షకుల పక్షమున ప్రాతినిధ్యము వహించెడి నియంత స్థానములో ఇకముందు అందరు ప్రజలచే ఎన్నుకొనబడిన ప్రతినిధి పరిపాలనాధికారము వహించును.

పూర్వము, సోవియటు విధానమునకు వ్యతిరేకులైన మతకర్తలు, ద్రవ్యవంతులు, ప్రభువులు, మధ్యతరగతులు వీరికి సోవియటు విధానములో స్థానములేదు. వీరికి ఓటింగు హక్కు లేదు. ప్రజాసంస్థలలో ప్రాతినిధ్యములేదు. వీరికందరికిని నూతన ప్రణాళికలో సోవియటు పౌరత్వపు హక్కు కలుగజేయబడినది. ఓటింగు హక్కు ప్రసాదించబడినది. మొత్తము ఓటర్ల సంఖ్యలో వీరు 100 కి 2½ వంతు అగుదురు.

సుమారు 15 సంవత్సరముల క్రింద రష్యా దేశములో నూటికి 18 మందికంటె అక్షరజ్ఞానము కలవారులేరు. అందుచే సోవియటు గ్రామముల తరఫున సంస్థలతరఫున ప్రతినిధులనెన్నుకొనుటలో ప్రజలు తమ ఓటింగు సమ్మతిని చేతుల నెత్తుటవల్ల సూచించుచుండెడివారు. ఈ కొలది కాలములో అందరును చదువను, వ్రాయను నేర్చినారు. అందుచేత సరిగా 'బేలటు' ద్వారా వ్రాతమూలముగా ఓటునిచ్చుపద్ధతి ఏర్పరుచబడినది. పదునెనిమిది సంవత్సరముల వయస్సుకు మించిన వారందరికి (పిచ్చివారు, అవినీతికరమైన నేరములకు శిక్షలు పొందినవారికి తప్ప) ఓటింగు అధికారము కలదు.

## కేంద్రప్రభుత్వము.

నూతన రాజ్యాంగ విధానములో "కేంద్ర మహాసభ" (The Supreme Council) సర్వాధికారము వహించును. ఈ సభకు నాలుగు సంవత్సరముల కొకసారి ఎన్నికలు జరుగును. ఇందులో రెండు సభలుకలవు. 1. ప్రజాప్రతినిధిసభ (The Council of the Union) 2. జాతీయ మహాసభ (The Council of the Nationalities). ప్రజాప్రతినిధిసభలో మూడు లక్షల ప్రజల కొక్కరు చొప్పున ప్రతినిధులు ఎన్నుకొన బడుదురు. జాతీయ మహాసభలో వివిధ సంస్థల, జాతులతరఫున ప్రతినిధులు ఎన్నుకొనబడుదురు. రుష్యా దేశములో నూరు జాతులకుపైగా కలవు. జనసంఖ్యలో సగముకుపైగా రుష్యాజాతివారే. ఒకేసభ సర్వాధికారము వహించుచో అధిక సంఖ్యాకులగు జాతివారికి ప్రాబల్యము అధికమై అల్పసంఖ్యాకులకు అన్యాయము జరుగవచ్చునను తలంపుతో ఇట్లు ఉద్దేశించబడినది. ఈ రెండు సభలలోను ఆమోదించబడిన తీర్మానములే చట్టములగును. ఇట్టి చట్టములు కేంద్రమహాసభయొక్క అధ్యక్ష కార్య

దర్శులయొక్క సంతకములతో ప్రచురించబడు చుండును.

### పార్టీ ఒక్కటే

సోవియటు రుష్యాలో ఇప్పుడు ఒకే పార్టీ ఉన్నది. ప్రజాస్వామిక ప్రభుత్వములో ఒకే పార్టీ ఎట్లాసాగుతుందిఅంటే ఇదివరలో కార్మిక సంఘములు, కర్షకసంఘములు, యువక సంఘములు, శాస్త్రపరిశోధన సంఘములు మొదలగునవన్నియు ప్రత్యేకసంస్థలుగా భావింపబడు చుండెడివి. ఇప్పుడు ఇవి అన్నియు కమ్యూనిస్టు పార్టీలో చేర్చుకోబడినవి.

### అపూర్వ బాధ్యత

సోవియటు ప్రజాస్వామికము కేవలము రాజకీయ నిపుణత్వమును సూచించునదేగాక, ఇతర దేశములలో ఎక్కడనులేని పౌరత్వహక్కులను బాధ్యతలను కలుగ జేయుచున్నది. సామాన్యముగా పెట్టుబడిదారులుగల ప్రతిదేశములోను ఒక పౌరుడు ఎవరోఒక అభ్యర్థికి తన ఓటును ఇచ్చిన తోడనే అతని కర్తవ్యము పూర్తి అయినట్లు తలచబడుచున్నది. కాని సోవియటు విధానములో దేశముయొక్క యావత్తుఐశ్వర్యమును, గనులు, అడవులు, యంత్రాలయములు సర్వమును ప్రజలకు చెందజేయ బడుటచే ప్రజలే ఈ ఆస్తికి యజమానులు. ఇట్టి విధానములో ఓటింగుచేయుట యన్న దేశముయొక్క సంపదను ఖర్చుపెట్టు విధానము నిర్ణయించుట. ఈపనులను నిర్వహించుటకు వలయు మనుష్యులను నియమించుటఅనుఅర్థము. ప్రతివ్యక్తికి తనస్వార్జనతో పాటు దేశముయొక్క ఐశ్వర్యములోకూడ భాగమున్నది. ఈప్రణాళికలో ప్రతిమనిషికిరోజుకు 7 గంటలపని-విశ్రాంతి, సెలవురోజులలోను అనారోగ్యస్థితిలోను ముసలితనములోను జీవితావసరములను పొందు భీమాఏర్పాట్లు చేయబడినవి. అందరికి ఉచిత నిర్బంధ ప్రారంభవిద్య ఇవ్వబడును ఉన్నత విద్యకూడ ఉచితముగనే ఇవ్వబడును. వైజ్ఞానిక సాంఘిక రాజకీయములన్నిటిలోను పురుషులకున్న అన్నిహక్కులును స్త్రీలకు కూడకలవు. గర్భిణి స్త్రీలకు, చంటిపిల్లతల్లులకు ప్రత్యేక ప్రభుత్వరక్షణకలదు. ఈహక్కులు అనుభవించుటలో జాతిమత వివక్షత పాటింపబడదు. జాతిమత ద్వేషములు పురికొల్పువారు శిక్షార్హులు.

### విశాల దృష్టి

ఇదివరకు మతప్రచారమునకు ప్రతికూలత హెచ్చుగా ఉండెడిది. ఇప్పుడు మతముల పట్ల అనుకూలభావము కలవారికిని ప్రతికూలభావము కలవారికిని కూడ సమాన స్వాతంత్ర్యము కలుగజేయబడినది. కుటుంబ రహస్య నిర్వినాశత్వము శాసనబద్ధముగా సురక్షితమైనది. ప్రజలందరును సైనిక సేవకు సిద్ధులై యుండవలెను. ఈవిధముగా సోవియటు రుష్యా తాను గడించిన అనుభవముతో ప్రజాస్వామిక పరిపాలనము భద్రముగా సాగించుటకు వలయు ననేక మార్పులు నూతన ప్రణాళికలో చేయబడి యున్నవి.

# కాలము విలువ

(శ్రీ గొబ్బూరు వేంకటానంద రాఘవరావుగారు, బి. ఏ.)

కాలముయొక్క విలువ నిరూపింప తరముగాదు. కాలు జారినపుడు కూడదీసికొందుము. కాని, నోరుజారినపుడింక కూడదీయజాలము. కాలము అంతకంటెను కూడతీయరానిది. కాలము ఎప్పుడును వ్యర్థము చేయరాదు. ఈ సంగతి లేశమేని వివేకముగలవారందరికిని స్పష్టముగా తెలిసినదే. సోమరిపోతైన ఒకపల్లెటూరివానికి ఒక శాస్త్రవేత్త కాలముయొక్క విలువను బాగుగా బోధించిన విచిత్ర కథను ఈ క్రింద వ్రాయుచున్నాము. ఇది నిజముగా జరిగినదే కాని కల్పితముకాదు.

బెంజమిన్ ఫ్రాంక్లిన్ అను సుప్రసిద్ధరచయిత తన కార్యాలయములో కూరుచుండి ఆనాటిపత్రికకు ప్రధాన వ్యాసము వ్రాయుచుండెను. ఆ కార్యాలయములోనే వేరొకగదిలో పుస్తకములు విక్రయింపబడుచుండెను. సమీపగ్రామమునుండి పట్టణమునకువచ్చిన గ్రామస్థుడొకడు పనిలేక తిరుగుచు పుస్తకములమ్ము గదిలోనికివచ్చెను. అచ్చట కూరుచుండి వాడు ఆపుస్తకము ఈ పుస్తకము మరొకపుస్తకము ఇట్లు అనేకపుస్తకములు తీయించి పత్రములు అటునిటు త్రిప్పిచూచుచు, తిరుగవేయుచు, అవి అక్కరలేదని ఇచ్చివేసి వేరొకటి తీయుచు అందలిపుటలు కూడ మరల తిరుగవేయుచు, ఇట్లొక గంటసేపు గడపి తుదకొక పుస్తకము తీసి దానిని కొననెంచి, దీనివెల యెంత? అని యడిగెను.

“ఒక రూపాయి” అని అచ్చటి గుమాస్తా చెప్పెను.

“అంతకు తక్కువకు రాదా!” అని సోమరి అడిగెను.

“బేరము చెప్పలేదు. సిసలు ఖరీదు ఒక రూపాయి. దమ్మిడితక్కువకు రాదు. ఇష్టమున్న కొనవచ్చును. లేకున్న పోవచ్చును.” అనిఖండితముగా గుమాస్తా తెలియజెప్పెను.

“పోని”మ్మని వాడాపుస్తకము అక్కడ పెట్టి వెళ్లిపోయెను.

మరొక గంట అటునిటు వ్యర్థముగా తిరిగి తిరిగి ఆ సోమరి మరల ఈపుస్తకములగదికి వచ్చి గుమాస్తాను చూచి “అయ్యా! బెంజమిన్ ఫ్రాన్క్లిన్‌గారు ఇక్కడ ఉన్నారా!” అని అడిగెను. “ఆఁ! ఉన్నారు. అచ్చుకూటములో ఉన్నారు. పత్రికావ్యాసములు చూచుకుంటున్నారు” అని గుమాస్తా ప్రత్యుత్తర మిచ్చెను.

“నేను ఆయనతో స్వయంగా మాట్లాడవలసిన పని ఉన్నది. ఇలాగ ఒకసారి పిలుస్తారా” అని వాడు త్వర పెట్టెను. గుమాస్తా వెళ్ళి అచ్చుకూటములో పనిలో ఉన్న పత్రికాధిపతితో “అయ్యా! ఒకతగు మనుష్యుడు తమతో స్వయంగా మాట్లాడవలసిన జరూరుపనిఉండి వచ్చినాడు” అని చెప్పెను. వెంటనే లేచి బెంజమిన్ వీనివద్దకు వచ్చెను. వెనుకటిపుస్తకమునే మరల తీసి పట్టుకొని “అయ్యా! దీనికి ఏమి ఇమ్మన్నారు. అఖరుమాట చెప్పండి; సిసలు ఖరీదు”అని అడిగినాడు.

బెంజ—ఒకరూపాయిన్నర.

సోమ—అబ్బా! రూపాయిన్నరకేముందండీ ఇందులోనూ? ఇందాకా మీగుమాస్తా రూపాయికే ఇస్తానన్నాడే. మీరువచ్చి ఏమైనా తగ్గిస్తారేమో అనుకుంటే అర్థరూపాయి పెచ్చువేశారా? ధర్మమేనా?

బెంజ—నిజమే అప్పుడైతే రూపాయికే యిస్తుము. పని చెడి పైకివచ్చినందుకు ఇప్పుడురూపాయిన్నరకుతక్కువకు ఇవ్వము.

సోమ——అబ్బే! ఏమిమాటలండీ! చెప్పండీ! సిసలుగా మరోమాట రానియ్యండి.

బెంజ—అయితే సరే. సిసలుఖరీదు రెండురూపాయిలివ్వండి.

సోమ—ఏంచిత్రమండీ! ఇప్పుడు రూపాయిన్నర అంటిరి! ఇప్పటికిప్పుడే మరోఅర్థరూపాయి పెచ్చు వేశారా? ఆకారణం ఏమిటో చెప్పండి?

బెంజ—కారణమా? కాలము చాలావిలువ గలది. అదే మాకు వెండి - అదే బంగారం - అదే మా ధనం - అది వ్యర్థం కాకూడదు. కావాలంటె రెండురూపాయీలు యిచ్చి పుస్తకం పట్టుకెళ్ళండి - లేకపోతే వెళ్ళిపొండి. మీతో వ్యర్థంగా మాటలాడుతూ కూచోడానికి మాకు తెరిపిలేదు అని ఖండితముగా చెప్పివేసెను.

చిత్తమని ఆ సోమరిపోతు విధిలేక రెండురూపాయలిచ్చి ఆ పుస్తకము పుచ్చుకొనెను. కాలముయొక్క విలువ బాగుగా గ్రహించెను.

బెంజమిన్ ఫ్రాన్క్లిన్ సుప్రసిద్ధ శాస్త్రవేత్త. మనము కొన్నివస్తువులను మథించినప్పుడు పుట్టిన విద్యుత్ శక్తియు, ఆకాశమున కనబడు మెఱుపుశక్తియు ఒక్కటేఅని అతడు పరిశోధనలచే కనుగొనినాడు.

# మానవునికి మాంసభక్షణము తగునా ?

మాంసాహారులుకూడ వారి ఆహారమునకు సంబంధించని జీవహింస యన్న కారుణ్యమును వెల్లడింతురు. ఇది సర్వవిదితమే. తాము ప్రాణులను చంపి తినువారయ్యును, తాము పెంచు ప్రాణులను ఎవరేని స్వల్పముగ హింసించినను భరింపజాలరు. ఇట్టి కారుణ్య హృదయులకు మాంసభక్షణమెట్లు ప్రాప్తించినది? నిజముగా విచారణీయాంశమే. వేదములలో వచింపబడిన సూత్రములకు ఉపనిషత్కారులు, వేదాంతులు, టిప్పణికారులు,పండితులు వారికి నచ్చిన విధమున నేటివరకు నూతనవ్యాఖ్యలను వ్రాయుచునే ఉన్నారు. ఎవరెట్లు వ్రాసినను అనుభవ సిద్ధముకానట్టియు, సత్యమునకు దూరమగునట్టియు, అంధవిశ్వాస జనితమైనట్టియు, దురాచార దోషబద్ధమైనట్టియు, జిహ్వాచాపల్యపీడా జనితమైనట్టియు కుతర్కములను వివేకులు హర్షింపరుగదా !

మాంసభక్షణము ఉత్కృష్టధర్మమా, దేహదార్ఢ్యమును సంపాదించుట కేర్పడిన ఏకైక సాధనమా,లేక జారత్వము, చోరత్వమునుబోలు చాపల్యదోషమా అని విచారించుటకు పూర్వము ప్రాణికోటిని సృజించిన సృష్టికర్త మానవుని మాంసాహారిగనే సృష్టించెనా? లేక శాకాహారిగ సృష్టించెనా? అను విషయము ఇంచుక విచారింపదగు. శాకాహారులును, మాంసాహారులును అగు మానవులలో బాహ్యాకృతిలోగాని, లోపలి యంత్రసామాగ్రిలోగాని ఎన్నదగిన భేదము అంతగా కానిపించదు. కనుక మాంసాహారులగు జంతువులకును, శాకాహారులగు జంతువులకును గల తారతమ్యములను గుర్తించి, ఈ రెంటిలో ఏదేని ఒక శ్రేణిలో మానవుని చేర్చుట సమంజసము. యోగిరాఘవేంద్రుని వ్యాసములోని కొన్ని అంశములు ఇచ్చట పొందుపరుప సహేతుకముగనున్నవి.

### మానవుడు మాంసాహారియా?

౧. మాంసాహారికి సహజముగ పగటకంటె రాత్రులయందు కన్నులు బాగుగా కనబడును. అందుచేతనే పులి మొదలైనవి తమయాహారము నిమిత్తమై రాత్రులయందు సంచారము చేయుచుండును. శాకాహారజంతువులగు పశువులకు పగలు కనులుకనబడినట్లు చీకటిరాత్రులయందు కనబడవు. మానవునిస్థితి కూడనిదియే.

౨. మాంసాహారులగు కుక్క, పిల్లి మొదలగువానికి పుట్టినబిడ్డలు కొన్నిదినములవరకు కనులు తెరవలేకుండును. కాని శాకాహారులగు పశువులబిడ్డలు కనులు తెరచియే పుట్టును. మానవుని స్థితికూడ నిదియే.

3. మాంసాహారులగు జంతువులు నీరు త్రాగునప్పుడు నోటితో త్రాగలేక నాలుకతో కతుకును. శాకాహారులగు పశువులు నీటిని నోటితో పీల్చును.

౪. మాంసాహారులగు కుక్క మొదలగు వాని కలసట కలిగిన నాలుకను వ్రేలాడవేసి తద్వారా చెమట కార్చును. కాని శాకాహారులగు పశువుల కలసట కలిగిన శరీరమంతయు చెమటపట్టును. మానవునకు అట్లే.

౫. మాంసాహారులగు పులి మొదలగు వానికి ఆహారమును చీల్చుకొని తినుటకు కోరలు,

గోళ్ళు మొదలగు పరికరములు కలవు. శాకాహారియగు పశువున కట్టి వేవియులేవు. మానవునకు కూడ నంతియే.

౬. మాంసాహారి తనయొక్క ఆహారమును నమలకయే చీల్చుకొని మ్రింగును. కాని శాకాహారి తనయాహారమును నమలి తినును. మానవుడుకూడ తన యాహారమును నమలును.

౭. మాంసాహారియొక్క జఠరాగ్ని విపరీతమగు ఉష్ణము కలిగియుండును. ఈవిషయము ఏదియైన ఒక పిల్లిని ప్రక్కలోపరుండబెట్టుకొనిన ప్రతివానికి విశదమగును. శాకాహారియగు పశువుయొక్క జఠరాగ్ని అంతగా ఉష్ణము కలిగియుండదు. మానవునియొక్క జఠరాగ్నియు అట్లే యుండును.

౮. మాంసాహారియొక్క మలము విపరీతమగు దుర్గంధము కొట్టును. శాకాహారులగు పశువులమల మంతగా దుర్గంధము కొట్టదు. నీచమగు మాంసాహారము తినకున్న మానవుని మలముకూడ అంతగా దుర్గంధము కొట్టదు.

౯. మాంసాహారులగు పులి మొదలైనవాని యొక్క ప్రేగులు సుమారు 7 మూర లుండును. అంతే పరిమాణముగల శాకాహారియగు పశువుయొక్క ప్రేగులు30 అడుగు లుండును. మానవుని ప్రేగుకూడ సుమారు 36 అడుగులుండును. ఇందులకు కారణ మేమన: మాంసాహారము శాకాహారముకంటె బహుతొందరగాకుళ్లిపోవును. కాన జీర్ణము కాగా మిగిలినది తొందరగా ప్రేగులనుండి బయటికి పోవలయును. అందుచే దయాపరుడగు పరమేశ్వరుడు మాసాంహారికి ప్రేగు చిన్నదిగను, శాకాహారికి ప్రేగు పెద్దదిగను నిర్మాణ మొనర్చెను.

౧౦. మాంసాహారులగుమృగములు కేవలము ఇతరాహారములయొక్క తోడ్పాటులేక ఒక్క మాంసమును తిని అయినను జీవయాత్ర గడుపుకొనగలవు. కాని మానవుడు ఇతరాహారముల యొక్కతోడ్పాటులేనిచో కేవలము మాంసమునే తిని జీవించలేడు.

౧౧ మనము తినుఆహారము పచ్చిదిగాని లేక ఉడుక పెట్టినదికాని చేతితో పిసికి నీటిలోకలిపిన అది నీటియందు మిళితమగునదిగా ఉండవలయును. అట్టి ఆహారమే మనజీర్ణకోశములందు జీర్ణించి రక్తముగా మారి మనకు పుష్టి నొసగును. మాంసమును ఎంతగా ఉడుకపెట్టి పిసికి నీటియందు కలపినను అది నీటియందు కరగక దారము దారముగాను, తుట్లుతుట్లుగాను ఉండును. కాన ఇట్టి ఆహారము ఎట్లు జీర్ణమయి రక్తముగా మారును? రక్తముగా మారకున్న అది ఎట్లు మనకు పుష్టి కలిగించును? అది పుష్టినొసంగక పోగా తదితరాహారముతో తయారగు రక్తముయొక్క ప్రవాహమునకు అడ్డు తగిలి అనేక రోగములకు కారణభూతమగు చున్నది.

౧౨. ఎవరిఆహారమును జూచిన వారికి నోటియందు లాలాజల మూరుచుండును. అందువల్లనే ఎలుకనుచూచిన పిల్లి మీదపడిచంపితినుచున్నది. కాని అశుద్ధముతినుపంది దారిని పోవుచుండ మానవున కెవరికైనను, నోరూరునా? అది వాని ఆహారమైన వాడేల దానిపై బడి పీకుకొనితినడు?

వండినమాంసమును చూచిన నోరూరు నని కొందరు పెద్దలు చెప్పవచ్చును. అట్లు నోరూరుట మాంసము సహజాహార మగుటవలన కాదు. దానినితినుటకలవాటుపడినందున అట్లగు చున్నది మాంసము తిను నలవాటులేని ఒక

శాకాహారియగు కుఱ్ఱవాడు దానిని చూచిన వాంతి చేసికొనును. ఎందుకన అది అట్టి నీచాహారమగుటచేతనే. ఇందుకీ చిన్న ఇతిహాసము చూడుడు.

"ఒకనికి ఇద్దరు కుమార్తెలు కలరు. అందొకామెను పూలవర్తకునికి, రెండవయామె నొక చేపలవర్తకునికి ఇచ్చి వివాహ మొనర్చెను. కొంత కాలము గడచినమీదట ఒకనాడు చేపలవర్తకుని భార్య తనసోదరిని చూడవచ్చెను. పూలవర్తకుని భార్య తనసోదరినిచూచి సంతసించి చేపలకంపు గొట్టుమలినవస్త్రములను విడిపించి, స్నాన మాడించి' మంచిదుస్తులను ధరింపజేసి చక్కని భోజన మిడి మంచిసుగంధము వచ్చు పూల గదియందుపరుండబెట్టెను. కాని పాపము! ఆచేపల వర్తకుని భార్య కొంతకాలమునుండినిరంతరము చేపలకంపున కలవడియుండుటచే అట్టిసుగంధము నిచ్చుపూలగదియందు పరుండి నిదురపోలేక ఈవలకువచ్చిమరొకచోట తనచేపలబుట్టనుదగ్గర నుంచుకొని ఆదుర్గంధమును చక్కగా పీల్చుచు హాయిగా నిదురించెనట. ఇది దురభ్యాసదోషము గాక మరొకటియా ? ఇంత ఏల? అనేకులు మలవిసర్జనచేయు మరుగుదొడ్లలో ఆ దుర్గంధము నాస్వాదించుచు మలవిసర్జనచేయుట కలవడి నిర్మలమగు గాలివీచు విశాలమైన బహిరంగ స్థలములో మల విసర్జన చేయవలసి వచ్చిన ప్రాణముమీదికివచ్చినట్లు భావించు బుద్ధిమంతు లెందరు లేరు? ఇది దురభ్యాసదోషము గాక మరియొకటియా?

---

# సనాతన ధర్మసభలు

రాఁబోవు దసరాలో స్వధర్మస్వారాజ్య సంఘమువారియాజమాన్యము క్రింద బెజవాడలో వేదశాస్త్ర మహాసభయు ఆంధ్రదేశ బ్రాహ్మణమహాసభయు జరుగఁబోవుచున్నవి. ఆ సభలలో ఈ దిగువ తీరుమానము ప్రవేశ పెట్టుటకు నిశ్చయింపఁబడినది.

"లోక క్షేమమునకై ఏర్పడిన వర్ణాశ్రమధర్మములు యథానియతస్థితికి వచ్చి సంరక్షింపబడవలె ననిన వేదవిహితమగు బ్రాహ్మణ సంఘ మేర్పడవలెను. అట్టి సంఘము ఏర్పడుటకు బ్రాహ్మణులు పూర్వమువలెనే త్యాగశీలురై వేదవిద్యాపరులై ఉండవలెను. కావున వ్యక్తులుగా కాని, కుటుంబములుగా కాని, ఆస్తిసంపాదనేచ్ఛలేక ఉండువారిని పోగుజేసి వారిబాలురకు తగిన శిక్షణ మియ్యవలసి యున్నది. ఇప్పటి బ్రాహ్మణవర్గములో పై స్థితికి వెళ్లఁజాలనివారు అధ్యాపనాశీర్వచనాదిగౌరవములను వదులుకొనుట ఉచిత పద్ధతి"

ఇప్పటి వర్ణద్వేషక్లిష్టపరిస్థితులలో పైవిచక్షణకొఱకు కృషిచేయుటలో దూరదృష్టిచూపుచున్నారనుటకు సందేహము లేదు. ఈ కృషి వలన మఱుగునపడియున్న బ్రాహ్మణత్వము పైకి విజృంభించి అందఱకు జ్ఞానోదయము కలుగుఁగాక అని కోరుచున్నాను.

సనాతన ధర్మాభిలాషి.

షరా:

సనాతనధర్మపరులు శారదాఆక్టువలన బాధితులుకాకుండ మధ్యకాలములో ఆపద్ధర్మముగా అవలంబింపవలసిన విధానమును గుఱించి ఆలోచించుటకు ఏర్పడిన పండితపరిషత్తు ది 19-10-36 తేదీ మొదలు జరుపుటకు ఏర్పాటుచేయఁబడుచున్నది.

# జపాన్ దేశ వర్తకము - పరిశ్రమములు

ప్రపంచములో ఇప్పుడు జరుగుచున్న వర్తకపుపోటీలో జపానుదేశము ఎట్లు ముందంజ వేయగలుగుచున్నది? ఇది ముఖ్యముగా విచారింపదగినవిషయము. 1931 వ సంవత్సరములో "టోకియో ఛేంబరు ఆఫ్ కామర్సు"వారు జపానుపరిశ్రమముల పరిస్థితులు తెలియగల ఒక నివేదికను ప్రకటించిరి. జపానులో ఇప్పుడు హెచ్చు పెట్టుబడి పెట్టి విరివిగా సాగించుచున్న పెద్దపెద్ద యంత్రాలయములకంటె 15 గురికంటె మించని పనివారలతోనే చిన్నయంత్రములతో పనిచేయు గృహపరిశ్రమాలయములే హెచ్చుగ ఉన్నవి. వీనివల్ల జపానుదేశపు మొత్తము పరిశ్రమములలో ఎంతవరకు ఉత్పత్తి అగుచున్నదో దిగువ ఉదహరింపబడినది.

| పరిశ్రమము | చిన్న ఫ్యాక్టోరీలలో నూటిలో జరుగు పనిపాళ్లు |
|---|---|
| నూలు బట్టలు | 29.5 |
| ఉన్ని | 33.5 |
| పట్టు | 66.7 |
| రేయన్ | 32.6 |
| కుట్టు - అల్లిక | 80.4 |
| పెన్సిళ్ళు | 79.8 |
| ఇమిటేషన్ రాళ్ళు | 56.8 |
| సైకిళ్ళు | 74.3 |
| వడ్రింగము | 77.9 |
| లోహపుబొమ్మలు | 77.5 |
| టోపీలు | 54.1 |
| డబ్బాలలో జాగ్రతపర చేఆహారములు | 31 4 |
| గుండీలు | 50.2 |
| పింగాణి | 70.6 |
| రొట్టె | 77.9 |
| కుంచెలు | 48.5 |
| గొడుగులు | 52.4 |

ఇందువల్లనే ఈ డబ్బులేని దినములలోకూడ జపాను ఠీవిగా నిలువగలిగినది. కాని లోపములుకూడ లేకపోలేదు. చిన్నచిన్న పరిశ్రమములలో వస్తువులపనితనము - నాణ్యము ఒకేమాదిరిగా నుండక అమ్మువారికి కొనువారికి తగాదాలు - నమ్మకము చెడుట మొదలగువాటికి కారణమయ్యెను. దీనిని నివారించుటకు ప్రభుత్వమువారు పరిశోధన - పంచాయతీశాఖలను ఏర్పరచిరి. 1935 సంవత్సరాంతమునకు 83 ఎగుమతి సంఘములు పనిచేయుచున్నవి. ఎగుమతిచేయువస్తువులను పరిశీలించి, నిర్ణయములుచేసి, సలహాల నిచ్చుటయే వీనిపని. అట్లే దిగుమతి సంఘములుకూడా ఉన్నవి. ప్రపంచపుపోటీలో జపాను జయమునకు ముఖ్యకారణము ఈ సంఘములపనియే. ఈ దిగుమతియెగుమతులలో వారు హిందూదేశపువర్తకులను చొరనీరు.

చిన్న ఫ్యాక్టరీలవిషయ మటుండ పెద్ద యంత్రాలయములెట్లు పనిచేయుచున్నవో ఇటీవల అహమ్మదాబాదులోమిల్లుయజమానిఅగు ఎమ్. సి. ఎహియాగారు జపానులో చూచివచ్చిన పరిస్థితులవల్ల తెలియవచ్చును. వారు 27 దినములు జపానులోఉండి అనేక యంత్రాలయములను చూచిరి. అక్కడ యజమానులకును కార్మికులకును ఉన్న సామరస్యము ఏ యితరదేశములోను కానరాదు. అచట కార్మికులకు చేయు సౌకర్యములు ఇప్పటి పరిస్థితులలో హిందూదేశములో చేయజాలమనియే వారియభిప్రాయము. యంత్రాలయములుండు ప్రదేశములలోనే కార్మికులు కాపురముండు గృహములు కట్టింతురు అవి మిక్కిలి పరిశుభ్రముగ ఉండును. శుభ్రమైనఆహారము వారి కిచ్చెదరు. బట్టలమిల్లులలో పనిచేయు కార్మికులలో హెచ్చుమంది గ్రామములనుండివచ్చిన అవివాహితలైన బాలికలు. వారిపోషణ విషయమున అధికారులు కడుశ్రద్ధ తీసికొనుచున్నారు. ఆరోగ్య నియమముల కనుగుణముగా కట్టబడిన యిండ్లలో వారు నివసింతురు. యంత్రాలయములలో రోజుకు ౮ గంటలు పని. రెండు ముఠాలుగా పని చేయుదురు. మిల్లుప్రదేశములలోనే ఉన్నత పాఠశాల లున్నవి. పనిలేని సమయములో కార్మికులు అక్కడ చదువుకొనెదరు. కుట్టుపని, వంట, సంగీతము వారికి నేర్పుచున్నారు. టెన్నిసు, కాలిబంతి మొదలగు ఆటలు ఆడుకొనుటకు కూడా సౌకర్యములు కలవు. నాటకములు, సినిమాలు చూచుటకు సైతము ఏర్పాట్లున్నవి. జపాను కార్మికులు ప్రపంచములో ఇతరభాగములలోని కార్మికులకంటె ఎక్కువ సౌఖ్యముగను ఆరోగ్యముగను ఉన్నారు.

బట్టలమిల్లులోని జపాను కార్మికబాలిక ఒక్కొకతె 30, 40 మగ్గములమీదను, 800, 1000 కదుళ్లమీదను పనిచేయగలుగుచున్నది. మనదేశములో 1, 2 మగ్గములమీదను 200, 250 కదుళ్లమీదను మాత్రము పనిచేయు

[194 పేజీ చివర చూడుడు]

# *వస్తుమార్పిడి విధానమే స్వదేశోద్యమము

(శ్రీ ప్రొఫెసరు, జె. సి. కుమారప్పగారు)

ఫలమునకు ప్రతిఫలమిచ్చుట ప్రకృతిధర్మము. మానవులును అట్లేచేయుట ప్రకృతియొక్క ఆశయము. పొలములోపండిన వేరుసెనగ కోసి దానినుండి నూనెతీయుచున్నాము. పైరువల్ల భూమిలోనిసారము క్షీణించుట లేదా? సహజముగా నూనెను మనము అనుభవించినను సెనగపిండినైనను పొలములో ఎరవుగా ఉపయోగించవలెను గదా?

అదేవిధముగా డబ్బు లావాదేవీలలో కూడ ఒకే త్రోవలో గ్రుడ్డిగాచేయువ్యాపారమంతయు దారిద్ర్యమునకు త్రోవతీయును. ధాన్యముపండించే ఒకవ్యవసాయదారునకు ఒకజతచెప్పులు కావలెననుకొనును. తాను పండించిన ధాన్యమును చెప్పులు కుట్టువానికిచ్చి తనకు కావలసినవస్తువు తీసుకొనును. కాని ఇప్పుడు ఉండే నాణెముల విధానములో (Monetary system) ఈ వస్తుమార్పిడికి బదులు నాణెములప్రమాణ మేర్పడినది. ఈ పద్ధతిలోనైనను దారిద్ర్యము దాపరించకుండా ఉండాలంటే ప్రకృతి ధర్మము పాటింపబడవలెను. పైన చెప్పిన వ్యవసాయదారుడు జపానుదేశములో చేయబడిన చెప్పులను కొన్నాడనుకొందము. అయినప్పటికి ఆ జపానుదేశపు చెప్పులుకుట్టువాడు మన వ్యవసాయదారుడు పండించిన ధాన్యం తీసుకుంటే

---

*షరా:

ఖద్దరు సంస్థానమువారు వస్తుమార్పిడి విధానమును అమలునందుంచియున్నారు. వారిసిబ్బందికి జీతములు ధాన్యముగా ఏర్పాటుచేసిరి. ఆధాన్యము చీట్లరూపమున పుచ్చుకొనుటకును, మార్చుకొనుటకును నిర్ణయము చేసిరి. ధాన్యమునకును మిగతా తినుబండారపువస్తువులకును ధరల వ్యత్యాసముతో నిమిత్తము లేకుండ రేట్లు ఏర్పరచిరి.

వస్తు మార్పిడి రేట్లు.

కందులు, పెసలు, మినుములు, గోధుమలు, అలచందలు, ఉలవలు, సెనగలు, ధనియాలు, బియ్యమునకు సరాసరి.

మంచినూనె, వేరుసెనగనూనె, ఆముదము, కొబ్బరినూనె, మిర్చి మణుగు, అరమణుగు ఏకులు, ౨ మణుగుల చింతపండు, ౨ మణుగుల బెల్లము, ౬ గజముల ఖద్దరుగుడ్డ, ౪ చిట్టుబస్తాలు, ౨ మణుగుల ఆవాలు, ౨ మణుగుల మెంతులు, అరమణుగు జీలకఱ్ఱ, అరమణుగు మిరియాలు, పావుమణుగు లవంగాలు, అరమణుగు వక్కలు, అరమణుగు శొంఠి. ౧ వీ॥ ఏలకకాయలు, ౩౨ సేర్ల పాలు, ౬౫ సేర్ల జొన్నలు ౧ వడ్లబస్తాకు సమానము. సాదానేతకు ౪౫ అం. నెరవు గ ౧ కి ౪ సేర్లువడ్లు; కుప్పడము గ ౧ కి ౬ సేర్లువడ్లు; ఏకుడుకూలి ౩ మణుగులకు ౧బస్తావడ్లు. పనివారలకు సాలు ౧కి ౧౫ బస్తాలు ధాన్యము మొదలు ౫౦ బస్తాలు ధాన్యమును, ౧౦౦ గజములు ఖద్దరుగుడ్డ వఱకు జీతములు ఏర్పాటుచేసిరి.

పైని వ్రాసిన వస్తువులన్నియు, ఏగ్రామమునకు కావలసినవి ఆగ్రామములోగాని ఆప్రాంతములో గాని ఉత్పత్తియై పైరీతిగా మార్పిడి యేర్పాట్లు చేసికొను నెడల ప్రొఫెసరు కుమారప్పగారు సూచించిన స్వదేశివిధానము సులువుగా అమలులోనికి రాగలదు.

కొద్దిమార్పులతో ఈ విధానమును హిందూదేశములోని అన్నిగ్రామముల వర్తింపజేయవచ్చుననియు, పట్టణవాసులుకూడ ఈ విధానమువలన ఎక్కువ సదుపాయములు పొందగలరనియు ఖద్దరు సంస్థానమువారు ప్రచారము చేయుచున్నారు.

27



ప్రకృతిధర్మమును పాటించినవాడవుతున్నాడు. ఈ ప్రకారం ఇచ్చి పుచ్చుకోవడంవల్ల నష్టమేమియు లేదు. కాని ఇప్పుడు ఉన్న పరిస్థితులలో జరుగుతున్న దేమంటే మన వ్యవసాయదారుడు డబ్బు ఇచ్చి జపానుదేశపు చెప్పులు కొంటాడు. ఆ డబ్బుపెట్టి జపానుదేశపు చెప్పులు కుట్టువాడు ఏజర్మనీనుంచో ఏ అమెరికానుంచో వచ్చిన వస్తువులు కొంటాడు. అంతర్జాతీయ వ్యాపారములలో సక్రమముగా ఇచ్చి పుచ్చుకోవడం జరుగుతుంటే లాభనష్టములు కొంతవఱకు సర్దుకుని పోవచ్చును. వ్యవసాయదారుడున్ను నష్టపడడు.

కాని ఇప్పుడు మనుష్యులు తెచ్చిపెట్టిన ఆర్థిక, రాజకీయ, సీమావాంతరములు అనేకములున్నవి. అందుచేత అంతర్జాతీయ వ్యాపారం ధారాళముగా ఒండొరుల మేలు నపేక్షించి సాగించబడుట లేదు. పర్యవసానం ఏమిటంటే: మన దేశంనుంచి పోయేదేకాని తిరిగి వచ్చేది లేదు. అందుకనే దేశం దరిద్రస్థితిలోనికి వచ్చింది. ఎంతకాలమైతే మనకు విదేశ వ్యాపారముమీద పెత్తనము ఉండదో అంతకాలము అట్టి వ్యాపార సంబంధమువల్ల మనకు ముప్పేవాటిల్లును. ప్రస్తుతం మనమీఅంతర్జాతీయవ్యాపారపు అవాంతరముల నుంచి బయట పడవలెనంటే ఒకటే ఉపాయమున్నది. మనము ఎంతవరకు వీలుగా ఉంటే అంతవఱకు మనలావాదేవీలను తగ్గించుకోవలెను. అనగా దూరమునకు విజృంభించరాదు. మనవ్యవసాయదారుడు తాను దూరదేశస్థులతో వ్యాపారముచేయుటకు తగిన స్థితిలో లేనప్పుడు తనకు సమీపముగాఉండు ప్రదేశములలోనే వ్యవహారం జరుపుకోవలెను. అప్పుడు మనుష్యులు కలుగజేసిన కృత్రిమపు అవాంతరములకు గురికావలసిన అవసరముండదు. కాబట్టి మన వ్యవసాయదారుడు తన స్వగ్రామములో ఉన్న చెప్పులుకుట్టువానివద్ద చెప్పులు కొనుక్కోవడంతో తృప్తిపడితే, ఆచెప్పులు కుట్టువాడు వ్యవసాయదారుడు పండించేధాన్యం తీసుకుంటాడు. ఈ విధముగా ఆర్థికచక్రము సహజముగా చుట్టి వస్తూ ఉంటుంది.

దీనిఅర్థము గ్రామమునకు వెలుపలనుంచి ఎప్పుడును, ఏ వస్తువును కొనరాదని కాదు. క్రయవిక్రయములలో కలిగే నష్టమునుంచి తప్పించుకోవలెనంటే సాధ్యమైనంతవఱకు మనము అమ్ము ప్రదేశము కాని మనము కొనుప్రదేశముగాని మనకు దాపులో ఉండవలెను.

మనదేశీయవ్యాపారములో కూడ రైలుఛార్జీలు, స్టీమరుఛార్జీలు, షాహెరీలు, టారిఫులు మొదలగు అనేక ఖర్చులు తగులుబాటు అగుచున్నవి. మైసూరులోఉండే ఒకరు బొంబాయినుంచో కలకత్తానుంచో ఏవైనా సరకులు తెప్పించుకోవలెనంటే అది ప్రమాదముతోకూడిన విషయమే. కారణమేమన క్రయవిక్రయదారులు కలసికొనుటకు అధిక వ్యయప్రయాసలగును. క్రయవిక్రయదారులు ఎంతసమీపములో ఉందురో అంతలాభమును ఉభయులును పొందెదరు. బాగుగా ఆలోచించిన స్వదేశిమంత్రము ప్రజలపాలిట తారకమంత్రమనదగును.

---

# ఐర్లాండులో గ్రంథాలయోద్యమము

( శ్రీ గో. రాధాకృష్ణమూర్తిగారు, బి. ఏ. )

## II

## కౌంటీ లైబ్రరీలు

1925 సం॥పు చట్టము "కౌంటీ*కౌన్సిల్సు"కు అవసరమగు అధికారము నిచ్చినది. అందువలన కౌంటీ అంతటను గ్రంథాలయములకు సంబంధించిన అధికారము ఆకౌంటీ కౌన్సిలునకే యియ్యబడినది.

ప్రతి కౌంటీకిని పుస్తకాల సరఫరాలకు వలయుబండ్లున్నవి. వానిమూలమున కౌంటీకి సంబంధించిన ప్రతి గ్రామమునకును, ప్రతి పాఠశాలకును గ్రంథములు పంపబడుచున్నవి. ఈ కౌంటీల ఉపన్యాసములును కూడ అపుడపుడు జరుపుచున్నవి. ఇట్టి మంచికార్యములు జయప్రదముగ సాగుటకు విశ్రాంతిసమయములందు తమంతట తామే సహాయము చేయవచ్చెడి పెక్కు ప్రజలే చాల వఱకు కారకులట.

*     *     *     *

### కొన్ని విషయములు.

గ్రంథాలయ నిర్వాహకులు (లైబ్రేరియన్స్) శిక్షణ పొందుటకు డబ్లిన్ కళాపరిషత్తుకు సంబంధించిన కళాశాలలో ప్రత్యేకముగ ఒక శాఖ ఏర్పరుపబడినది. గ్రంథ వివరణమందును, పుస్తకముల పట్టికను తయారు చేయుటయందును, గ్రంథాలయ నిర్వహణయందును, గ్రంథాలయ న్యాయశాస్త్రమందును, కావలసిన శిక్షణ ఆ కళాశాలయందు ఇయ్యబడుచున్నది. ప్రతి సం॥న జరుగు పరీక్షలలో నుత్తీర్ణులగు వారికి పట్టాలను ఇచ్చుచున్నారు.

### పట్టికలు తయారుచేయుట.

అమెరికా బ్రిటిష్ గ్రంథాలయ సంఘములు నియమించిన పద్ధతుల ప్రకారము గ్రంథపట్టికలు తయారు చేయబడుచున్నవి.

"డెవీ డెసిమల్ క్లాసిఫికేషన్" సర్వసాధారణముగ అనుకరింపబడినను ప్రత్యేకస్థలములకు కావలసిన ప్రత్యేకపు మార్పులు తేబడుచున్నవి.

*     *     *     *

### గ్రంథాలయ సంఘములు పత్రికలు

1904 సం॥న ప్రప్రథమమున ఐర్లండువారి గ్రంథాలయ సంఘమొకటి స్థాపింపబడినది. అది అమెరికను సంస్థల ననుసరించియున్నది. దాని ఆధిపత్యమున రెండు భాషలుగల "అన్ లెబ్ హర్ వార్" అను పత్రికయొకటి ప్రకటింపబడుచున్నది.

"బిబ్లియోగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఐర్లండు" అనునది మరొక సంస్థ. ఇది 'ఐరిష్ బూక్ లవర్' అను పత్రికను నడపుచున్నది.

1928 లో "క్యూమాన్ లెబ్ హర్ వార్ నఏరియాన్" అను మరొకసంఘము స్థాపింపబడినది. దీని యాజమాన్యమున 1930 లో ఒక కాన్ఫరెన్సు జరిగినది. అందు అడల్టు ఎడ్యుకేషన్ కును, గ్రంథాలయములకును విద్యాసంస్థలకును సంబంధబాంధవ్యము లేర్పరచుటలోనగు సమస్యలును చర్చింపబడినవి. కాని దీనివలన లాభకము కలుగలేదు.

దీనికిగల కారణము, ఈ గ్రంథాలయములలో చాల వఱకు స్వతంత్ర సంస్థలచే నడపబడుచుండుటయే నట. వీనిని ప్రభుత్వాధికారముక్రిందికి తెచ్చిన ఇట్టికష్టము తొలగగలదట. కాని అట్లు ప్రభుత్వాధికారముక్రింద చేర్చుట ఉచితమా? అట్లు చేర్చుటచే ఇప్పుడున్న స్వాతంత్ర్యములో కొంత కోల్పోవలసివచ్చును. అట్లు కోల్పోవుట లాభదాయకమా, కాదా, అను సమస్య వారు ఎదుర్కొనవలసి వచ్చుచున్నది.

*     *     *     *

### కార్నిజీ మహాశయుడు

ఆండ్రూ కార్నిజీపేరు పేర్కొనకుండా ఏదేశములోని గ్రంథాలయోద్యమ చరిత్రనుగూర్చి వ్రాయుట, చెప్పుట అసంభవము. ఆ మహనీయుడు తన ధనముచే అన్నిదేశముల గ్రంథాలయోద్యమములకు పుష్టిని గల్గించినాడు. ఐర్లండు గ్రంథాలయోద్యమము ఈ మాటలకు మినహాయింపుగాదు.

1900,1913 సం॥ల మధ్య ఐర్లండుకు ఆయన చేసిన ధనసహాయపు మొత్తము 150,000 పౌనులు-అనగా సుమారు 2,250,000 రూపాయలన్నమాట. మొదట ఇతని ధనసహాయము లేనిదే ఐర్లండునందు ఈ ఉద్యమము ఇంతటి ఉన్నతదశలోనికి రాకయుండెడిదే.

* మన దేశములో జిల్లాలనువానిని ఆదేశములో కౌంటీలని అందురు.

## II

### ప్రారంభదశ

## ఉత్తరఐర్లండు

1855 వఱకు ఉత్తర ఐర్లండులో ఉన్న ధర్మపుస్తక భాండాగారము ఒకటియే. అది 1771 సంవత్సరము నాటిది. దానిపేరు అర్మాఘ్ లైబ్రరీ. అది మతాధిపతులకు చెందినది. దానిలో 30,000 గ్రంథము లున్నవట. చాలాభాగము వేదాంత - చరిత్రములకు సంబంధించినవి.

మరికొన్ని పీఠాధిపతులకు చెందిన గ్రంథాలయము లున్నవి. కాని, అవి ధర్మభాండాగారములుగావు. అవి విద్యార్థులకే తెరచియుంచబడుచుండెడివి. ఎంతోఅవసరమని నిరూపించినప్పుడుగాని యితరులకు అందు ప్రవేశము శూన్యము.

* * * *

### ఉద్యమము

ఉత్తరఐర్లండులో ఈ గ్రంథాలయోద్యమము చాలా కుంటిగా నడచినది. అది పెండ్లినడకకన్న హీనము.

1855 లో పబ్లిక్ లైబ్రరీస్ చట్టము అమలులోనికి వచ్చినప్పటికిని, బెల్ ఫాస్టు (ఉత్తర ఐర్లండు ముఖ్యపట్టణము)లో గ్రంథాలయపు సుంకమువలన సాగెడి గ్రంథాలయము 1888 సంllము వఱకు పుట్టలేదు.

1888 లో బెల్ఫాస్టునందు కేంద్రధర్మ పుస్తక భాండాగారమను పేర ఒక గ్రంథాలయము స్థాపింపబడినది. అప్పుడు దానిలో 14,105 గ్రంథములు మాత్రము ఉన్నవి. కాని, ఆ సంవత్సరము చదువుటకు తీసికొన్న ప్రతులసంఖ్య 185,147. అనగా ప్రతిపుస్తకము సగటున 13 సార్లు చదువబడిన దన్నమాట ఒక్క ఏడాదిలో.

* * * *

### అభివృద్ధి

దానితో ఆకేంద్రగ్రంథాలయమునకు ఆనగరమునందే ఐదు శాఖాగ్రంథాలయములు ఏర్పడినవి. అందు మూడు శాఖలకు కావలసిన ద్రవ్యము మహనీయుడు అండ్రూ కార్నీజీ విరాళమే!

1931 లో వీటన్నిటియందు ఉన్న పుస్తకములసంఖ్య 180,897. ఆ సంవత్సరము రిఫరెన్సు కోసము తీసికొబడిన గ్రంథముల మొత్తము 75,698. ఇండ్లకు కొనిపోబడిన వాని సంఖ్య 1,397,669.

* * * *

### వ్రాయతగిన తరువాతి అంశము:—

1922 లో కార్నీజీ ట్రస్టువారి సహాయమున అట్రిం జిల్లాలో ఒకగ్రంథాలయము స్థాపింపబడినది. ఆ గ్రంథాలయము జయప్రదముగ సాగుటచూచి తక్కిన కౌంటీలలో చాలమట్టుకు 1924 సంllపు ఉత్తర ఐర్లాండు గ్రంథాలయచట్టము ననుసరించి, గ్రంథాలయములు స్థాపింపబడినవి.

వీనిలో చాలమట్టుకు ప్రథమదశలో కార్నీజీ విరాళముల వలననే గ్రంథములను సమకూర్చుకొన్నవి. పిమ్మట ఇవి కౌంటీ కౌన్సిలు అధికారము క్రిందికి వచ్చినవి.

* * * *

### తరువాతిదశ:—

1927 లో కార్నీజీట్రస్టు వారి యాజమాన్యముక్రింద గ్రంథాలయాధికారులయొక్క, విద్యాసంఘాధికారులయొక్క కాన్ఫరెన్సు జరిగినది. అందు ఉత్తర ఐర్లండులోని అన్ని గ్రంథాలయములకు విద్యాసంస్థలకు ఏవిధముగా సంబంధము కల్పింపవచ్చును అనుసమస్య చర్చింపబడినది.

దానిమూలమున బెల్ఫాస్టు పబ్లిక్ లైబ్రరీ, కల్పన వస్తువుగల పుస్తకములు (ఫిక్షన్) తక్క, తక్కిన గ్రంథము లన్నిటిని, గ్రంథము ఒకటింటికి మూడుపెన్నీల సుంకముచొప్పున తక్కిన గ్రంథాలయములకు పంపుటకు తీర్మానించబడినది. దానికగు తపాలాఖర్చులు భరించుటకు కార్నీజీగారు 5,000 పౌనులను విరాళము నిచ్చిరి.

ఈ సమ్మతి ప్రకారము బెల్ ఫాస్టులో 43 పాఠశాలలకు 5,442 గ్రంథములు పంపబడినవి. 1931 లో 29,189 ప్రతులు పంపబడినవి. పట్టణ గ్రంథాలయములకు పంపబడిన వానిసంఖ్య 228.

తరువాత జిల్లా గ్రంథాలయములు, తమలో తామే గ్రంథముల నిచ్చి పుచ్చుకొనునట్లును, కావలసిన వారే ఖర్చులు భరించునట్లును ఏర్పాటు చేసికొని సాగించుచున్నవి.

[తరువాయి 190 వ పుట చివర]

* * * *

# విజయనగర సామ్రాజ్యము*

## దక్షిణ ఇండియాలో హిందూజనోద్ధరణము

## (క్రీ. శ. 1336 - 1650.)

(శ్రీగాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారు, ఎమ్.ఏ.)

పిచ్చిమహమ్మదు బిన్ తుగ్లఖ్ వంటి ముస్లిముప్రభువుల కాలమున హిందూప్రజలయెడల వారు కనబరచిన క్రౌర్యమును సహించుట సాధ్యము కాలేదు. హిందూరాజ్యము లేర్పడి ముసల్మానుల నదిమిననుగాని మానవమాత్రగౌరవమైనను హిందువులకు నిలువదనుట స్పష్టమై హృదయమున చెక్కిన బల్లెమువలె హిందూసంఘమును వికలపరచినది.

కాకతీయరాజ్యమును ముసల్మానులు విచ్ఛిన్నము చేసినమాత్రమున ఆంధ్రకర్ణాటకశక్తి అంతరించియుండలేదు. కావున నుత్తరప్రాంతములందు గజపతులును, కృష్ణాతీరములోని అద్దంకివైపున రెడ్లును, పశ్చిమోత్తర ప్రాంతముల రాచకొండవైపున పద్మనాయక కులజులును, దక్షిణమున కర్ణాటకులును ఆంధ్రకర్ణాటక ప్రతాపాగ్నిని రవుల్కొల్పుచునే యుండిరి. వీరి అందరిచరిత్రమును ఇచ్చట విపులముగా వ్రాయుటకు వీలులేదు. కాని, ఇందలి కర్ణాటరాజ్యము తుదకు విజయనగరసామ్రాజ్యమై విస్తరించినది. సాళువ, తుళువ వంశములు ఈసామ్రాజ్య విస్తారమునకును ప్రతిష్ఠకును కారణములయ్యెను. ఇవి తెలుగువంశములగుట తటస్థించినది. అందుచేత విజయనగర సామ్రాజ్యము ఆంధ్రకర్ణాటక మహారాజ్యమై ప్రాచీన బాంధవ్యమును స్థిరపరచినది. ఆచరిత్రకు తిలకాయమానముగ రెడ్డిరాజులును, పద్మనాయక ప్రభువులును తెలుగుభాషకు చేసిన సత్కారమును వర్ణింపదగును. కడపటి చోళులనాట నంకురించిన ఆంధ్రసరస్వతి, కాకతీయ యుగమునను, రెడ్లయుగమనదగిన ఈ మహాయుగమునను, అఖండవైభవము ననుభవించినది. ఈ మధ్యయుగమున ప్రసిద్ధతమకవులు శ్రీనాథ, పోతనలు. శ్రీనాథు డాకాలపు రాజుల ఆస్థానము లన్నియును తిరిగినాడు. శ్రీనాథుని నైషధము విద్వదౌషధము. అతని పల్నాటి వీరచరిత్ర వీరరసవిరాజితము. అతని హరవిలాస మప్రతిమానకరుణారసభరితము. ఇతని బావమరది, సమకాలికుడు, సహజపాండిత్య పట్టభద్రుడు, శ్రీరామభక్తశిఖామణి,నరాధములకు కృతి ఇయ్యక దారిద్ర్యమునే అనుభవించిన ధీనిధి; ఆంధ్రమహాభాగవత కల్పతరు నిర్మాతయగు పోతననుగురించి వ్రాయవలయునే! తదంతర్గతమగు రుక్మిణీకల్యాణము, గజేంద్రమోక్షము, ప్రహ్లాదచరిత్ర, నరకాసుర వధ, శ్రీరామచరిత్ర - ఆంధ్రులకు తోడు నీడలు కావా! ఈ కాలమునందు కృష్ణదేవరాయలనాటివలెనే కవిరాజులు, రాజకవులు, కవిమంత్రులు, మంత్రికవులు, కవిదండనాథులు, చాలమంది కన్పట్టుచున్నారు. కోటయ వేమారెడ్డి, సర్వజ్ఞసింగమభూపతి, మాధవరాయడు, పెదకోమటివేమారెడ్డి, వినుకొండ వల్లభరాయడు, మొదటిదేవరాయలకు మంత్రియైయుండిన సిద్దన; ఇట్టిపేళ్లు ఎన్నియైనను వ్రాయనగును. విద్యాపోషకులగు రాజులు, మంత్రులు, దండనాథులు వెలయుటచేతనే పూర్ణ జీవకళతో నొప్పగల విజయనగర సామ్రాజ్యవిస్తారమునకీయుగము మార్గము వేచినది.

విజయనగరసామ్రాజ్యమునకు మూలకందమైనకర్ణాట

---

* విజయనగర సామ్రాజ్యపు ౬ వ శతాబ్ది మహోత్సవము

రాబోవు (1936) డిసెంబరు మాసమున హంపీశిథిలములందు విజయనగర సామ్రాజ్యపు ౬ వ శతాబ్ది మహోత్సవమును జరుపుటకై కన్నడదేశీయులు రెండుసంవత్సరములనుండి తీవ్రప్రయత్నములను చేయుచున్నారు. ఇందుకొరకై చేయదగు ప్రయత్నములనుగూర్చి ఆలోచించుటకై కడచిన (1935) డిసెంబరు నెలయందు బొంబాయియం దొక కన్నడుల ప్రత్యేకపు మహాసభను సమావేశము చేసిరి. మరియు ఈ మహోత్సవమును జరుపుటకై ధార్వారు పట్టణమునందు "విజయనగర సామ్రాజ్యఉత్సవమండలి" అను ఒక సంఘము నేర్పరచిరి. ఆ సంఘమునకు రిటైర్డు సబ్ జడ్జి అగు వి. బి. హల్ భవి (Halbhavi) గారు అధ్యక్షులుగాను, డి. పి. కర్మర్ కార్, ఎమ్. ఏ. ఎల్. ఎల్. బి. గారు అర్గనైజరుగా ఏర్పడిరి. వీరిద్దరును మరికొందరును ఇటీవలనే బళ్ళారి పట్టణమునకు విచ్చేసి అచట సహాయసంఘము నొక దానినిఏర్పాటుచేసి ఉత్సవమునకు కావలసిన తక్కినయేర్పాటులనుగూర్చి యోచించి వెళ్ళినారు.

వంశమునకు కర్తలైనవారు హరిహరరాయలు, బుక్కరాయలు. హరిహరరాయలను హక్కయనియు, బుక్కరాయలను బుక్కయనియు వ్యవహరించుట గలదు. వీరిని గురించిన కథలనేకములున్నవి. అవియన్నియు ఇచ్చట వివరింపనక్కరలేదు. హోయిసల రాజులసేనానియగు సంగముని యైదుగురు కుమారులలో వీరు పెద్దలు. విద్యారణ్య బిరుదాంచితులగు మాధవాచార్యుల శిష్యులు. గురుప్రసాదమున రాజ్యనిర్మాణమొనర్చిన ధీరులు. వీరు రాజధానికి ఏర్పరుచుకొనిన స్థల మప్రతిమానము. తుంగభద్రకు దక్షిణతీరము ఇప్పట్టున నీనదిలోతై గంభీరమై, సరోవరాకారము దాల్చినది. ఈసరోవరమే పంపాసరోవరము, విజయనగరమున కొకరీతిగ ఇది కందకము. ఇక చుట్టునుంగల వివిధాకారముల గట్టిగుట్టలు ఈప్రాంతమునకు పెట్టనికోటలు. దక్షిణాపథమునుండి కృష్ణాదక్షిణ భూమికిగల నాటిరహదారి కీపట్టు మధ్యస్థము. మొదటి హరిహరరాయలకు తరువాత మొదటి బుక్కరాయలు (1343-78) మిక్కిలిగ రాజ్యవిస్తారము కావించెను. మొదటి హరిహరరాయలును, బుక్కరాయలును చక్రవర్తిత్వము ప్రకటించుకొనలేదు. కాని రెండవ హరిహరరాయలు మహారాజాధిరాజ బిరుదమును ధరించెను.

పిదప తెలుగు వంశములైన సాళువ తుళువ వంశములు విజయనగరసామ్రాజ్యమున రాజ్యాధికారము వహించెను. తుళువవంశమున ప్రతాపమార్తాండతేజుడై, ఆంధ్రసామ్రాజ్యనిర్మాతయై, లలితకళాపోషకుడై, సర్వమతసహిష్ణుడై పేరొందిన శ్రీకృష్ణదేవరాయల చరిత్ర విజయనగరసామ్రాజ్యచరిత్రకు తిలకాయమానము. ఈతనికాలమున వెనీసుపౌరుడు 'నికోలోకాంటె' అనువిదేశజుడును, అబ్దుల్ రజాక్ అను పారసీకరాయబారియు ఇతని ఆస్థానమును దర్శించి పోయిరి. వీరు దేవరాయల రాజ్యమును గురించి ముచ్చటయైన కొన్నివిషయములు వ్రాసియుంచిరి.

## శ్రీకృష్ణదేవరాయలు (క్రీ. శ. 1504 - 1530.)

ఇతని కాలమున ఆంధ్రుల కీర్తిప్రతిష్ఠలు లోకమంతటను వ్యాపించెను. మరియొక పర్యాయము హిందూరాజ్యరమ భారతావనిలో తలయెత్తుకొని తిరుగగలిగెను. చంద్రగుప్తుడు, అశోకుడు, హర్షుడు మున్నగా గల లోకైకవీరులగణమున చేరదగిన మహావ్యక్తి దక్షిణయిండియాలో కలడను భాగ్యము శ్రీకృష్ణదేవరాయల పుట్టుకచేత నీప్రాంతమునకు కలిగెను. ఇతని దిగ్విజయములు ఇతనికి ఇరువదియేండ్లు నిండకముందే ఆరంభమైనవి. అపజయమనునది ఇతడెరుగడు. తొలుదొల్త నెల్లూరుమండలములోని "ఉదయగిరి యితనికి లోబడియెను. తరువాతి విజయముల వర్ణన అల్లసాని పెద్దన మహాద్భుతముగా రచియించినాడు. తరువాతి చరిత్రకారులు విపులముగా వర్ణించినారు. దిగ్విజయ యాత్రలు ముగిసినతరువాత ఇతని రాజ్యము ఉత్తరమున మహానది మొదలు కన్యాకుమారి వరకును వ్యాపించి యుండినది. ఇతడు మహావీరుడు మాత్రమే కాదు; మహాపురుషుడు. హిందువుడు కానిండు, ముసల్మాను కానిండు, ఆనాళులలో దక్షిణ ఇండియాలో గుణవంతుడని పేరెన్నికగన్న వాడు ఒక్కడును లేడు. ఆక్రౌర్యములు, ఆమోసములు, ఆదురాశలు, ఆదుష్టప్రవర్తనలు మితిమీరిపోయి యుండినవి. 'అట్టియుగమున ఆమహానుభావుడు శ్రీకృష్ణదేవరాయలు, 'గాజులగనిలో రత్నము పుట్టినరీతిని పుట్టినాడని చరిత్రకారుల అభిప్రాయము. ఇతడు వినయగుణసంపన్నుడు. స్ఫురత్స్వరూపి. మొలకనవ్వులయుమొగముగలవాడు. ఉదారప్రవర్తకుడు. దయార్ద్రహృదయుడు. ఇట్టి గుణగరిష్ఠులకు గల ఒక చిన్నలోప మితనికిని గలదట. ఎప్పుడో ఒకప్పుడు మహాతీవ్రమగు కోపముకలవాడట!

శ్రీకృష్ణదేవరాయలు గొప్పవైష్ణవభక్తుడు. కాని పరమతసహిష్ణుడు. విదేశజులగు పాశ్చాత్యుల యెడలను ఇతడు చూపిన ఆదరణగౌరవములను వారు వేనోళ్ల పొగడినారు. న్యూనిజు ఫెయీసు లనుపోర్చుగీసు ప్రవాసకులు వ్రాసిపెట్టి పోయిన వ్రాతలు శ్రీకృష్ణదేవరాయలమహానుభావత్వమును వెల్లడించుచున్నవి. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానమును, కవులు, గాయకులు, శిల్పులు, చిత్రకారులు, విదేశరాయబారులు, ఎల్లరును అలంకరించిరి. ఇతడు త్రవ్వించిన చెరువులకు, కట్టించిన గోపురములకు, ఇచ్చిన అగ్రహారములకు లెక్కలేదు. ఇతడు సంస్కృతములోను, తెలుగులోను కవిత్వముచెప్పిన మహారాజు. ఈతని ఆముక్తమాల్యద ఆంధ్రమునందలి పంచకావ్యములలో నొకటి. స్వభావోక్తి విలసితముగ సంఘస్థితి వర్ణనకు అశృంఖలలల కడంగినకృతి ఆంధ్రమున ఇది ఒక్కటియే అనచెల్లును. ఇతని ఆస్థానము నలంకరించిన కవుల మహిమచే వారికి అష్టదిగ్గజములను పేరు ప్రసిద్ధమైపోయినది. అందు అగ్రగణ్యుడు అల్లసానిపెద్దన్న. ఇతని "మనుచరిత్రము"పేరు వినని ఆంధ్రులుండరు. "ఆంధ్రకవితా పితామహు"డను ఇతని బిరుదము నెరుంగని తెలుగువా రుండరాదు.

పెద్దనతోకూడ శ్రీకృష్ణరాయని ఆస్థానమున పారిజాతాపహరణము వ్రాసిన ముక్కుతిమ్మన్న, జరా

శేఖరచరిత్రము రచించిన మాదయ్యగారి మల్లన్న మున్నగు వారుండిరి. కన్నడకవులును, అరవకవులును ఈతని సమ్మానమును బొందిరి. రాయలకాలమున విజయనగర పట్టణము అరువదిమైళ్ళ చుట్టుకొలతగలదియై యుండెనట. ఆశిథిలమును హంపీక్షేత్రమున నేడును చూడవచ్చును. అందలి రాతిచెక్కడపు రామణీయకము అప్రమానము. ఎందరు శిల్పులు, చిత్రకారులీ పనులను దీర్చిరో! శ్రీకృష్ణదేవరాయలు క్రీ॥ శ॥ 1530 లో దివంగతుడయ్యెను.

శ్రీకృష్ణదేవరాయలయనంతరము వి జ య న గ ర సామ్రాజ్యచరిత్రలో ఎన్నదగినవాడు అలియరామరాజు. ఇతడు కార్యదక్షుడు. బహిమినిరాజుల నందరను లోఁగదీసికొని, విజయనగరసామ్రాజ్యమహోత్సవమును మహోన్నతపదవికి తెచ్చెను. కాని ఇతనికి గర్వము మితిమీరి బహిమినీసుల్తాను రాయబారులను అవమానించినాడు. వారు నల్వురేకమైనారు. తలికోటవద్ద ఘోరసంగ్రామము జరిగినది. రామరాజు దత్తపుత్రుడని చెప్పుకొనుచుండిన ఆదిల్ షాయే అతనిని పట్టుకొని తల ద్రుంచినాడు. మహావీర్యముతో పోరుచుండిన హిందూసైన్యములు, నాయకుడు నశించుటచే పటాపంచలైనవి. ముసల్మానుసైన్యములు విజయనగరము ప్రవేశించి ఒక్కదినములో అంతటి పట్టణమును వినాశ మొనర్చినవి. రామరాజు సోదరుడు సదాశివరాయలను వెంటబెట్టుకొని బొక్కసములోని విలువగల వస్తువుల నన్నిటిని ఏనుగులకు, గుఱ్ఱములకు నెక్కించుకొని పెనుగొండ చేరినాడు.

విజయనగరపతనముతో హిందూరాజ్యము మరల శకలములై పోయెను. మొదట పెనుకొండలోను, తరువాత చంద్రగిరిలోను, పిదప ఆనేగొందిలోను చేరికొనిన విజయనగరవంశము ఆరవీటి వంశమైపోయెను.

జింజి, మధుర, తంజావూరులలో, నాయకవంశజులు స్వతంత్రులైరి. బెద్నూరు, మైసూరులును ఇదేరీతిని స్వతంత్రములయ్యెను. ఆంధ్రులు దక్షిణదేశమున గాఢముగా నల్లుకొనిన దీ కాలముననే. తెలుగు మహాకవిత, అరవనాడులగు తంజావూరు, మధురలలో రంగనాట్య మొనర్చినదనిన శ్రీకృష్ణదేవరాయలు తెలుఁగున కెంతటి మహోపకారము చేసినవాడో అర్థముకాగలదు. మల్కిభరామని వాఙ్మయమున ప్రసిద్ధుడైన ఇబ్రహీం కుతుబ్షా (క్రీ. శ. 1550-1580 విజయనగర సామ్రాజ్యధ్వంసకుడేయయ్యు, ఆంధ్రవాఙ్మయమునకు దాసుడై, తెలుగుకవులను పోషించినవాడనిన, తల్లి తెలుంగెంతరమణీయరసప్రతిపాదకయో లోకము గ్రహింపగలదు. అట్టిభాష నాభాషయని గర్వపడని ఆంధ్రుడుండగలడా?

[187 వ పుటలోదాని తరువాయి]

## ప్రభుత్వ ప్రవేశము

1928 లో ప్రభుత్వమువారు ఒక సంఘమును నియమించి, ప్రభుత్వగ్రంథాలయము నొకదానిని నిర్మించి అప్పటికే ఉన్న గ్రంథాలయ సముదాయముతో కలసి కృషిసల్పుటలోని వీలును చర్చి[redacted]కోరిరి.

ఆసంఘము 1929 లో ఒక నివేదికను తయారు చేసి ప్రభుత్వమునకు సమర్పించినది. అందలి ముఖ్యాంశములు: అల్స్టర్ * లైబ్రరీ అని పిలువఁబడినట్లు ఒక స్టేట్ లైబ్రరీని స్థాపించవలెను. అందు దేశీయులకు కావలసివచ్చు అన్ని విషయములకు చెందిన గ్రంథము లుండవలెను. ఆ గ్రంథాలయము తక్కిన అన్ని గ్రంథాలయములతో చేరి పనిచేయవలెను,అదిగాక ఉత్తరఐర్లండునఅన్ని గ్రంథాలయములలోని గ్రంథములపట్టిక నొకదానిని తయారు చేయవలెను.

కాని, ఇంతవఱకు ప్రస్తుత ప్రభుత్వము ఈపైసూచనలో దేనినిగాని అమలులో పెట్టజాలక పోయినది.

* * * *

మొత్తముమీద ఐర్లండులో గ్రంథాలయోద్యమము సర్వతోముఖమున పెరుగుచున్నది. గ్రంథాలయముల ఆవశ్యకత, ఉపయోగము ఐరిష్ ప్రజలు, ఐరిష్ ప్రభుత్వము బాగుగ గ్రహించినవి.

కాని ప్రజాస్వామిక ఐర్లండును, ఉత్తరఐర్లండును పోల్చిచూచిన, అన్నివిషయములా దక్షిణ ఐర్లండే మిన్నయని చెప్పకతప్పదు. దక్షిణఐర్లండు ఐరిష్వారిది. ఉత్తర ఐర్లాండు ఇంకను బ్రిటిష్వారిది.ఈ భేదమే ప్రభేదమునకు కారణమేమో!

* ఉత్తర ఐర్లండునకు అల్స్టరు అను మరియొక పేరగలదు.

# ఆంధ్ర ద్విపద వాఙ్మయము

(శ్రీ మండలపర్తి ఉపేంద్రశర్మగారు, బి. ఏ. (ఆనర్సు.)

ఆంధ్రభాషయందలి పద్యజాలము రెండు తెఱఁగులు. సమవృత్తములు, అసమవృత్తములు. ఉత్పలమాల, చంపకమాల, శార్దూలవిక్రీడితము మొదలగునవి సమవృత్తములు. కారణము: ఉత్పలమాలాదులయందలి ప్రతిపాదమునను సమముగ అక్షరము లుండుటయే. వీనికి భిన్నముగనుండునవి అసమవృత్తములు; ఐదువిధముల యక్కరలు; ఆఱుతెఱంగుల కందములు; ఉత్సాహము; తరువోజ; ద్విపదము; త్రిపదము; చతుష్పదము; పంచపాది; షట్పాది; కళికలు; ఉత్కళికలు; తొమ్మిదివిధములగు రగడలు; తొమ్మిదివిధముల గీతములు; ఏడురీతులగు సీసములు.

అసమవృత్తములలోఁ జేరిన ద్విపదము ఆంధ్రభాషకు నిసర్గము; నవ్యశోభావిభాసితము. దేశీయమగు ద్విపదము నిప్పుడు కొందఱు ఆంధ్రకవులు నిరసించుచున్నను, ప్రాచీనకాలమున వాడిరి. (ద్రావిడభాషాకుటుంబములోనివగు ద్రవిడాదులందును దేశీయరచనము లెక్కుడుగనున్నవి. ఇతరద్రావిడభాషలలోవలె నాంధ్రమున వీని కెక్కువ ప్రచారము లేకపోయినను కొంత ప్రచారమున్నదనుటకు శివకవుల దేశిరచనలే నిదర్శనములు. మన పూర్వులు పెక్కుర సంస్కృతసమభాషమీఁదను సంస్కృతవృత్తములమీఁదను నాదరముగలవారయి, దేశిరచనల నంతగాఁ జేయరైరి. పొరుగింటి పుల్లకూర రుచి కుబ్బు ఆంధ్రులస్వవస్తుతిరస్కృతికి ఇంతకన్న నిదర్శనములు వేరుగ వివరింప నక్కఱలేదుగద. కనుకనే మనకావ్యములం దాంధ్రతాముద్రకన్న అన్యభాషానుకరణము లధికముగ నున్నవి.

"కందభేదములాఱు.........
......ద్విపద..............
..........................
..........................

అనుచు నన్నయభట్టు భీమనయుఁ బెద్ద
సచివుఁడును మూర్తితాత నొజ్జయు ననంత
మంత్రియును దిమ్మరాజు నీమాడ్కిఁ జెప్పి
రందముగ వారుచేసిన ఛందములను."

అను అప్పకవిపద్యమునుబట్టి నన్నయకు పూర్వము నుండియు ద్విపదము లున్నట్లే తెలియుచున్నది. కాని కవిత్రయము ద్విపదలను వాడినట్లు కనఁబడదు. గ్రంథము నందంతట నొకేవృత్తముండుట విసుగు కలిగించును గనుక నిది వ్రాయఁబడలేదని కొందఱమతము. సంస్కృతమున మేఘసందేశాది కావ్యముల నొకేవృత్తమునఁ జదివిన వివేకులు విసుగుకొనుచున్నారా? ఆంగ్లమున నొకేవృత్తమున నున్న పద్యకావ్యములు చూచి చీకాకు నందుచున్నారా? లేదు. పైఁగా అరిస్టాటిల్ * కావ్యమున ననేకవిధములగు వృత్తములుండుట కూడదనెను. భామను పూర్ణముగా వ్యక్తపరచుటలో ద్విపదమునకు సాటి మఱొండు లేదు,

రెండేసి పాదములు గలదగుటచే నిది ద్విపదమగుచున్నది. ఇందు ప్రతిపాదమునందును వరుసను 3 ఇంద్రగణములును ౧ సూర్యగణము నుండును. తృతీయగణాద్యక్షరము యతిస్థానము. ప్రాసనియమము గలదు. (ఇది ఆంధ్రమునకు సహజమని లాక్షణికులు సైతము సమ్మతించిరి. కవిజనాశ్రయకర్త 'వెలయంగ తెలుఁగు బాసకు' అను పద్యమున దీనినే సూచించెను.) రంగనాథరామాయణమున ననుసరింపబడిన దీలక్షణమే. పయి లక్షణములన్నియుఁ గలిగి ప్రాసంబునిడకయే పలుకజాలినది మంజరీద్విపదము. దీని నాంధ్రమున వ్రాసినవాఁడు శ్రీనాథసుకవి.

పాల్కురికి సోమనాథుఁడు తనగ్రంథము లందఱును తెలియవలె ననియు, అన్వయక్లేశము లేక అల్పాక్షరముల ననల్పార్థరచన చేయవలెననియు నెంచి ద్విపదమును వాడినాఁడు. పండితారాధ్యచరిత్రలో దీనినిగూర్చి యిట్లు వాకొనినాఁడు:

"ఒప్పునే ద్విపదకావ్యోక్తి నావలవ
దారూఢ గద్యపద్యాది ప్రబంధ
పూరిత సంస్కృతభూయిష్ఠ రచన
మానుగా సర్వసామాన్యంబు గామి
జాను తెనుఁగు విశేషప్రసన్నతకు
నట్టులుగాక కావ్య ప్రౌఢి పేర్మి
నెట్టన రచియింప నేర్చినఁజాలు."

నాగరకులమను కొందఱంగీకరింపకున్నను ఆంధ్రమున ద్విపదకు నుచ్చస్థితిగలదు. ఆధునికు లనేకులు దానిని గ్రహించి తమ కవనములను ద్విపదములందే వెలయించుచు వాసికెక్కుచున్నారు. పూర్వమున తెనుఁగువారియందత్యంత ప్రచారమునందిన పదాలును, పాటలును తఱచుగ ద్విపద

* (Still more absurd would be to mix-different meteres)"

ములుగానే యున్నవి. మంజరీద్విపదము మిక్కిలి పేరు పొందినది. తోలుబొమ్మలవాండ్రు, పంబవాండ్రు, గొల్లవాండ్రు, స్త్రీలు తమపాటలను ఈద్విపదములోనే పాడుచుందురు. వారు పఠించుపద్ధతులు వేరు. వానిని యథాతథముగ మన లేఖకులు తాళపత్రములపై నెక్కించిరి. కనుక అందు లేఖకాది దోషములగు దీర్ఘము లుండును. తన కావ్యము పండిత పామరాపేక్షితమగుటకే సోమనాథుఁడు ద్విపదమును పాటించినాడు. అంతియగాక, దాని ఛందోనిబంధనమున స్వాతంత్ర్యమును చేకొనినాఁడు. రంగనాథాదులవలెఁగాక ద్విపదమున ప్రాసయతిని వాడినాఁడు. బ్రాహ్మణత్వమును విసర్జించిన ప్రౌఢకు భాషాబంధములను తెగనడచుట లెక్కకాదు. ఎంతస్వతంత్రతను జూపినను సోమనాథునిభాషయు, భావములును, ఛందస్సును, దేశీయములగుటచే అతని రచనలు సాటిలేని సొంపుకలిగి, సరసములై యొప్పినవి. ద్విపదములు సర్వజనాదరపాత్రములగుటకు కారణముల నేకములు:

౧. ఇది మిక్కిలి దీర్ఘమును, అతిహ్రస్వమునుగాక పాటవలె పాడుటకు వీలుండుట.

౨. భావములను బాహాటముగ తెలుపుట కనువుగ నుండుట.

౩. చదువునపు డుద్రేకమును కలిగించుట.

౪. నీతుల నుపదేశించుటకు సరియైన దగుట.

౫. ధారణానుకూల మగుట.

౬. గ్రహణసౌలభ్యము కలిగియుండుట, మున్నగునవి.

ఆంధ్రవాఙ్మయమున నన్నయకు పూర్వమునుండియు ద్విపదము లున్నట్లు ఆధారములు కనఁబడుచున్నను గ్రంథజాలము మాత్రము గానరాకున్నది. కనుక దృశ్యమానములగు తెనుఁగు ద్విపదగ్రంథములలో సోమనాథుని ద్విపదగ్రంథములే తొలుతటివి అనఁదగు.

సోమనాథుని సమకాలికుఁడును, గుణస్పర్థచే నాతని శైవకావ్యమునకు ప్రతిగా రామాయణమును ద్విపదగా వ్రాసినవాఁడు నగు రంగనాథుఁడును ద్విపదకొక రమ్యత నాపాదించె ననవచ్చును.

సోమన వాడినట్లు ప్రాసయతుల నితడు వాడియుండలేదు. రామాయణమును వ్రాసిన కవులలో పరమార్థమున మూలమున కింత సన్నిహితుఁడగు కవి ఇంకొకఁడు లేఁడు. ఇతనిభాష ప్రసన్నమైనది. కవితావేశము భవ్యమైనది. కథ హిందువులకుఁ బరమపవిత్రము, ఉదాత్తముకాఁగా నీగ్రంథ మత్యుత్తమ మన బరగుచున్నది.

భాస్కరరామాయణములోని కొన్నివృత్తములలోని భావముకన్న రంగనాథరామాయణమునందలి ద్విపద చరణములలోని భావ మెక్కువ హృదయంగమము.

దీని తరువాత నెన్నఁదగిన ద్విపదకావ్యము తిక్కన సమకాలికుఁడగు గోనేరునాథకవి వ్రాసిన భాగవతము. కోనేరునాథకవి తొలుత భాగవతమును భిన్నవృత్తకావ్యముగ వ్రాసియు, అది బహుజనోపయోగకారి కాదను భీతిచే కాబోలు ద్విపదమున వ్రాసిన వివేకి.

పైభాగవతము తరువాత పేర్కొనదగిన ద్విపదకావ్యము కాచవిభుఁడును విఠల్‌రాజును వ్రాసిన ఉత్తరరామాయణము. వీరిరువురును కోనబుద్ధరాజుపుత్రులు. తండ్రియానతిని తలఁదాలిచి రామాయణమున నవశిష్టమైన ఉత్తరకాండమును ద్విపదములోనే తెనిఁగించిరి. ఇదియు తండ్రిరచనమునకు దీటుగానున్నది. కాని కర్తలు భిన్నులనుటకుఁ జాలినంత వ్యత్యాసములును గానవచ్చుచున్నవి.

పల్నాటి వీరచరిత్ర శ్రీనాథునిచే సంతరింపఁబడిన మంజరీద్విపదతో నొప్పుగ్రంథము. వాస్తవమునకు శ్రీనాథుఁడొక్కఁడే తెలుఁగుకవియని చెప్పనగునని ఈద్విపదము తెల్పుచున్నది. ఇందలి ఇతి వృత్తమాంధ్రము; ఛందమాంధ్రము; రచనమాంధ్రము. తొల్లి ఈ త్రిగుణములచే నుతికెక్కినది బసవపురాణము. కాని, దీనికన్న ఇది కొన్నింట మిన్న. కారణము: బసవపురాణమందలి ఇతివృత్తమంతగా ఆంధ్రము కాకుంటచేతను, ఉద్దేశ్యము మతప్రచార మగుటచేతను సమగ్రఫలము నీయజాలినది కాదు. పెద్దకవులలో నీసమగ్రఫలము నందినవాఁడు శ్రీనాథుఁడు. ఇంత పాండితితో ఇంత ప్రౌఢసాహిత్యముతో మహాకావ్యములు వ్రాసిన కవిసార్వభౌముఁడే దేశిరచనమును చేసెననుట వల్ల ఆతనిఆంధ్రాభిమానమును, అతని దేశభక్తియు, అతని స్వదేశవీరపురుషారాధనపరతయు ప్రకటితములగుచున్నవి.

కృష్ణదేవరాయలకాలమున వెలువడిన ద్విపదగ్రంథములలో తాళ్ళపాక చిన్నన్న కావ్యము గొప్పదిగ చెప్పుదురు. ఇతఁడు ద్విపదవృత్తము నారాధించువాఁడని "చిన్నన్న ద్విపద కెఱుఁగు"నను కందమువలన తెలియవచ్చుచున్నది. ఇతని గ్రంథము అష్టమహిషీకల్యాణము. ఇందు ద్విపద లక్షణము నిట్లు నిరూపించినాఁడు.

"వాసవుల్ మువ్వురు వనజాప్తుఁ డొకఁడు
భాసిల్ల నదియొక్క పదము శ్రీకాంత.
క్రమమున నవి నాల్గు గణములనడచుఁ
గ్రమదూరముగఁ బ్రయోగము సేయరాదు
ఆపాదమునకు మూఁడవగణంబాది
దీపించుయతి యంబుధిప్రియతనయ

యుపమింప నవి ప్రాసయుతములై రెండు
ద్విపదనా విలసిల్లె వికచాబ్జపాణి
ద్విపదకుద్విపదకుఁ దెగఁ జెప్పవలయు
నెపుడు సంస్కృతమున నితరభాషలను
యతులలోపలఁ బ్రాసయతిదక్క సకల
యతులుఁ జెల్లును బ్రయోగానుసారమున
ద్విపదతో ద్విపద సంధిల నేకశబ్ద
మపుడు ప్రయోగింప నదియ యుక్తంబు
మఱియు సంస్కృతపు సమాసరూపమును
నెఱయ నెన్నిటినైన నిర్మింపఁదగును.
అను లక్షణముల ననువొంది సుకవి
జన సుప్రయోగైక శరణమై...

(అష్టమహిషీకల్యాణము)

శ్రీనాథుని ద్విపదము తరువాతది నవచోళచరిత్ర మను కావ్యము. ఈ గ్రంథమున తొమ్మండుగురు చోళ రాజులచరిత్ర గలదు. ఈ రాజులు దక్షిణదేశమున ప్రాజ్యమగు సామ్రాజ్యమును స్థాపించి సత్కీర్తినందినవారు. ఈగ్రంథమును పోసెట్టి లింగకవి వ్రాసినాఁడు. ఇతఁడు పదునైదవ శతాబ్ది చివరభాగమున నుండెను. శంకరదాసమయ్య చరితము, మల్హణచరితము, వీరసంగదేవచరితము, శిష్యప్రబోధనము మున్నగు గ్రంథము లితని యితరకృతులు నవచోళచరిత్రమందలి కవిత్వము నిరుపమానము. వర్ణనము లతిమనోహరములు.

ద్విపదవాఙ్మయమున నత్యుత్తమస్థానము నందినది "గౌరనహరిశ్చంద్ర"చరిత్రము. కావ్యశిల్పమున నిది అద్వితీయమనుటకు అనేకములగు ఉదాహరణములు గలవు. కల్పనావైచిత్రి ప్రశంసనీయము. పాత్రచిత్రణమున నీకవిని మించినవా రాంధ్రకవులలో అనేకులు లేరు. ఉదాహరణమునకు వీరబాహుని, కాలకౌశికుని స్వరూపవర్ణనముల నీయవచ్చును. గౌరనకుఁగలభావనాబలము స్తుతింపఁ దగినది. లలితమును మనోజ్ఞమును రసవంతమును అగు ద్విపదకావ్యము ఆంధ్రవాఙ్మయమునకు ఒక అలంకారము. ఇందు కొన్ని లాక్షణిక సమ్మతములుకాని ప్రయోగములు కలవు.

బహుళాంధ్ర గ్రంథకర్తయు. అభినవ వాగనుశాసన కవిసార్వభౌమేత్యాదిబిరుదాంచితుఁడును అగు కూచిమంచి తిమ్మకవి సారంగధరచరిత్రమను ద్విపదకావ్యము నొకదానిని సృజించెను. అచ్చతెనుఁగుకవిత్వమున కీతని కీడగువార లరుదు. ఇతని కవిత్వమందలి సుగుణము లాంధ్రావలికి నుపదేశించుట కీతని అనేకకృతులె సమర్థములు. మృదుమధురము, రసోచితమును అగు సారంగధర చరిత్రము నీతని యితరకృతుల కుద్దియగును.

ఈ యితివృత్తము నీవఱకే ప్రబంధముగ వ్రాసినవాఁడు బాణాల శంభుదాసకవి. ఇతఁడు విశ్వబ్రాహ్మణకులస్థుఁడు. ద్విపదమున తానాగ్రంథమును.

"భువిలోన సారంగభూవరుచరిత
కవితామహత్త్వంబుగల చేమకూర
అప్పన చెప్పిన యా ప్రకారమున
చెప్పితి బాణాల శంభుదాసుఁడను"

అని చేమకూర అప్పనగ్రంథము ననుసరించి వ్రాసినట్లు వ్రాసికొనినాఁడు. కాన హరిశ్చంద్ర ద్విపదమునకుఁ గల సుగుణములిందును గలవు. రచనము సుబోధము; రసవంతము; ప్రౌఢము.

ముద్రక లేఖకాది దోషముల నన్నిటిని సవరించి స్వర్గీయ శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు దీనిని ప్రకటించిరి. ఇంకను, అనేక ద్విపదగ్రంథములు పండితులు పరిష్కరించి ప్రకటింపవలసియున్నది. ఈ సత్కార్యమునకు ఆంధ్ర పండితులు అవశ్యము పూనవలయును.

ఆంధ్రవాఙ్మయమున ననేక ద్విపదకావ్యము లున్నవి. పెక్కువిధములగు సారస్వత ప్రక్రియలతో నొప్పుచున్నవి. వృత్తకావ్యము లెన్నివిధములవో ద్విపదకావ్యము లన్నితెఱఁగులవి గలవు. ఇందును పురాణములు, కావ్యములు ఇతిహాసములు మొదలగునవి అన్నిరసములతో నలరారునవి గలవు. బసవపురాణము, రామాయణము, భాగవతము, భారతము, భల్లాణరాజులకథలు, కాటమరాజుకథ, బొబ్బిలికథ, పలనాటి వీరచరిత్రము, ప్రతాపచరిత్రము మొదలగునవి సుప్రసిద్ధములు. గోపీ గోపాలసంవాదము, అష్టమహిషీకళ్యాణము మున్నగు శృంగారకావ్యములు నిందు తేజస్సును మించఁజేసినవి.

మాయాచింతానందమంజరి, ప్రభులింగలీల. రాజయోగసారము, తత్త్వానుసంధానము మొదలగు వేదాంతగ్రంథములును ఇందు విలసితములు.

శివభక్తిదీపిక, కపోతవాక్యములు, శివజ్ఞానమంజరి, గురుశిష్యసంవాదము మొదలగు మతగ్రంథములు మచ్చునకిచ్చిన యుదాహరణములు.

మైరావణచరిత్ర, సారంగధరచరిత్ర, నలచరిత్ర, హరిశ్చంద్రోపాఖ్యానము, నవనాథచరిత్ర మున్నగు ప్రబంధములును సొగసు కులికించుచున్నవి. అధునిక కవులద్విపద గ్రంథములగూర్చి మున్ముందు నివేదించుకొనెదను.

# భీమవరము తాలూకా
# గ్రంథాలయ యాత్ర

భీమవరము తాలూకా గ్రంథాలయసంఘము వారియాజమాన్యమున ది 10-9-36 మొదలు కొని 21-9-36 వఱకును గ్రంథాలయ యాత్ర జరిగినది. యాత్రికులు శ్రీయుతులు మారేపల్లి రామచంద్రశాస్త్రిగారును, భూపతిరాజు తిరుపతిరాజుగారును, వేగేశ్న సూరపరాజుగారును, వద్దిపర్తి రాజారావుగారును, కుముదవల్లి, పాలకోడేరు, మోగల్లు, కోరుకొల్లు, మైప, ఎండగండి, గొల్లలకోడేరు, చిలుకూరు, మహాదేవపట్టణము, కలసెపూడి, ఆకివీడు, దుంపగడప, అయిభీమవరము, చెఱుకుమిల్లి, జువ్వలపాలెము, కాళ్ళకూరు, కాళ్ళ, కోలనపల్లి, జక్కరము, వాండ్రము, కోపల్లె, వేముపాడు, చినఅమిరము, రాయలము, భీమవరము గ్రామములందు గ్రంథాలయముల ఆవశ్యకత, ప్రజలకు గ్రంథాలయములు ఉపయోగపడు విధానము, గ్రామపునర్నిర్మాణము, వయోజనవిద్య మొదలగు విషయములనుగూర్చి పూర్ణముగా గంభీరోపన్యాసములిచ్చి ప్రజలలో నూతనోత్సాహమును, గ్రంథాలయాభిమానమును కలుగఁజేసిరి నూతనగ్రంథాలయములను స్థాపించిరి. వార్షికసభలు జరుప ప్రోత్సహించిరి. కొన్ని గ్రామములకు శ్రీయుతులు పాలకోడేటి శర్మగారును, అయ్యంకి వేంకటరమణయ్యగారును, శ్రీధర నారాయణమూర్తిగారును, మందలపర్తి ఉపేంద్రశర్మగారును కూడవచ్చి యాత్రఉత్సాహముగా జరిపిరి.

మొత్తముయాత్ర కాలినడకను 47 మైళ్ళు; 25 గ్రామములు. యాత్ర మొదలు చివర వఱకును వృద్ధులు అగు భూపతిరాజు తిరుపతిరాజుగారుకూడ ఉండి జయప్రదముగా సాగించిరి. ఇందు రామచంద్రశాస్త్రిగారు వృద్ధులయ్యు ఉత్సాహముతోను పట్టుదలతోను కాలినడకను యువకులకంటె కార్యదీక్షాపరులై యాత్రను కొనసాగించిరి. యాత్రికులందఱకు వందనములు కృతజ్ఞులై మా తాలూకా గ్రంథాలయసంఘమువారు సమర్పించుచున్నారు.

భూపతిరాజు తిరుపతిరాజు
అధ్యక్షుడు,
భీమవరము తాలూకా గ్రంథాలయసంఘము.

---

[ 183 పుటలోదానితరువాయి ]

చున్నారు. యంత్రములలో తేడా ఉండిన ఉండవచ్చును. కార్మికులపట్ల చూపించు ఆదరణమే వారివల్ల నిండుపని రాబట్టుటకు ముఖ్యసాధనము. జపానులో ఇప్పుడుగృహపరిశ్రమములకు వలయు యంత్రములఅభివృద్ధి వల్లను, కార్మికుల నేర్పరితనమువల్లను, యజమానులకును కార్మికులకును గల ప్రేమవల్లను వారిఉత్పత్తిఖర్చు చాలా తగ్గుచున్నది. తమ ఎగుమతులపై ఎంత ఎక్కువ సుంకములు విధించినను వారు పోటీచేయగలస్థితిలోనున్నారు. ఈస్థితిలో పారిశ్రామిక ప్రపంచములో జపాను అభివృద్ధి పొందుచున్నదన్న వింత ఏమున్నది! హెచ్చుపెట్టుబడిపెట్టి పెద్దయంత్రాలయములను నిర్మించి అన్ని విధముల హిందూదేశముతో అభివృద్ధిగాంచ దలచువారు ఈపరిస్థితులను ముఖ్యముగా గుర్తించుట, తాము జపానువర్తకులవలె పనిచేయ మొదలిడుట ఎంతయు అవసరము.

# గ్రంథాలయ వృత్తాంతములు

### నెల్లూరు వర్ధమానసమాజము.

ది 13-4-35 మొదలు ది 31-3-36 వరకు కార్యనిర్వాహకవర్గమువారు ప్రచురించిన నివేదికలోని కొన్ని ముఖ్యాంశములు.

సంవత్సరారంభమున ౭ గురు గౌరవసభ్యులు ౧౦ మంది యావజ్జీవసభ్యులు ౨౩౨ మంది సామాన్యసభ్యులు. ఇందు ౧రుమరణించిరి. ౫రు రాజీనామనిచ్చిరి. చందాలు చెల్లింపని ౩౧ మంది తొలగింపబడిరి. ౪౫ మంది క్రొత్తగా చేరిరి. మొత్తము ౨౫౭ మంది సభ్యులున్నారు. ౨ సర్వసభ్యసమావేశములు, ౧౦ కార్యనిర్వాహకవర్గసమావేశములును జరిగెను. సార్వభౌముని రజతోత్సవము, దసరా ఉత్సవములు, మొల్లజయంతి, శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి వర్ధంతి, తిక్కనజయంత్యుత్సవము జరుపబడెను. ఈ యూనియన్‌కు కొంతకాలము అధ్యక్షులుగను మరణాంతమువరకు గౌరవసభ్యులుగ నున్న శ్రీటి.వి. వేంకటరామ అయ్యరుగారు మరణించినందుకు ది 23-3-36 తేదీని సానుభూతిసభ జరుపబడెను.

పఠనాలయమునకు ౫౪ తెలుగు ౧౨ ఇంగ్లీషు పత్రికలు వచ్చుచున్నవి.

గ్రంథాలయములో మొత్తము ౬౨౩౩ గ్రంథములు కలవు.

గ్రంథాలయము తెరచియుండిన ౩౪౨ దినములలో సభ్యులు ౩౬౪౨ పుస్తకములును, సభ్యేతరులు ౭౬౮౪ పుస్తకములును ఉపయోగించిరి. ఇటీవల ఈసమాజమువారు డాక్టరు పట్టాభిగారి కాంగ్రెసుచరిత్రలు రెండు ఖరీదు చేసి గ్రంథాలయములో ఉంచిరి. నెల్లూరుజిల్లా ఎడ్యుకేషనల్ ఆఫీసరుగారు ఈ గ్రంథములు గ్రంథాలయములో ఉంచరాదని ఉత్తరువు చేసిరి.

### వేమనగ్రంథాలయము, తేలప్రోలు - కృష్ణాజిల్లా.

ఈ గ్రంథాలయతృతీయవార్షికోత్సవము ది10-5-36 తేదీని శ్రీయుత అయ్యదేవర కాళేశ్వరరావుపంతులుగారి అధ్యక్షతను జరిగెను. ఈ గ్రంథాలయమునకు శ్రీ జి. కోటిరెడ్డిగారు ఒక భవనము దానము చేసిరి.

### తూర్పు గోదావరిజిల్లా గ్రంథాలయ మహాసభ.

పైసభ శ్రీ చిలకమర్తి లక్ష్మీనృసింహముగారిఅధ్యక్షతను ది 31-5-1936 తేదీన కొత్తపల్లిలో జరిగెను. గ్రామపంచాయతీగ్రంథాలయములకు గవర్నమెంటువారు, జిల్లాబోర్డు గ్రంథాలయములకువలెనే గ్రాంటుల నిచ్చుట అవసరమనియు, గవర్నమెంటువారి ఉత్తరువులేనిదే పంచాయతీ గ్రంథాలయములవారు ఏవిధమైన పుస్తకములు గాని వార్తాపత్రికలుగాని తెప్పించరాదను నియమమును తొలగించవలెననియు, గవర్నమెంటువారు విరివిగా సంచారగ్రంథాలయములను ఏర్పాటుచేయుట అవసరమనియు తీర్మానించిరి. ముఖ్యమగు ఇతరతీర్మానములు కూడ అనేకములు చేసిరి.



### శ్రీ దుర్గా సరస్వతీ గ్రంథాలయము, లక్ష్మీశ్వపురము, దివితాలూకా.

పై గ్రంథాలయము నూతనముగా ది 14-6-36 తేదీన ప్రారంభించిరి. దివితాలూకా గ్రంథాలయాధ్యక్షులగు శ్రీ తేకుమళ్ల రామచంద్రరావుపంతులు ఎమ్. ఎ.బి. ఎల్. గారి అధ్యక్షతను సభజరిగెను. ఆ సభలో పై గ్రంథాలయాధ్యక్ష కార్యదర్శుల ఎన్నికలు జరిగెను.

### శ్రీబాలసరస్వతీ గ్రంథాలయము, మాజేరు- దివితాలూకా.

పై గ్రంథాలయపుష్కరోత్సవము జూన్ నెల 20, 21 తేదీలను ఆంధ్రదేశ గ్రంథాలయాధ్యక్షులగు మ॥ రా॥ శ్రీ॥ గాడిచెర్ల హరిసర్వోత్తమరావు పంతులుగారి అధ్యక్షతను జరిగెను. గ్రంథాలయ శాస్త్రవిశారద శ్రీ అయ్యంకి వేంకటరమణయ్య పంతులుగారు గ్రంథాలయప్రదర్శనప్రారంభోత్సవము జరిపిరి. ఊరేగింపు, మాజిక్ లాంతరు ప్రదర్శనము, ఉపన్యాసములు జరిగెను. శ్రీ తేకుమళ్ళ రామచంద్రరావుగారు రచించిన గ్రంథాలయప్రహసనమును, శ్రీకృష్ణతులాభార నాటకమును ప్రదర్శించిరి. దుర్గాదాసునాటకములో ఒక అంకము ప్రదర్శించిరి.

### స్త్రీలసంచారగ్రంథాలయము, బళ్లారి.

ఈగ్రంథాలయము మహిళాహితవాదిమండలియాజమాన్యమున నడుచుచున్నది. దీని వార్షికోత్సవము జూన్ 21 వ తేదీని జరిగెను.

### శ్రీతిరువెంగడం ఉచితపఠనమందిరము, ఆదముసాహెబు వీధి- రాయపురము, మద్రాసు.

ఈ మందిరతృతీయవార్షికోత్సవము జూలై 3 వ తేదీని సౌందర పాండ్యన్ ఎమ్. ఎల్. సి. గారి అధ్యక్షతను జరిగెను.

### స్త్రీహితైషీమండలి - బాపట్ల.

ఈ మండలి ౫ వ వార్షికోత్సవము జూలై 4, 5 తేదీలలో శ్రీమతి పాలపర్తి సరోజనీదేవిగారిఅధ్యక్షతను జరిగెను.

### ఉచితపత్రికాపఠనమందిరము, కాంగ్రెసు భవనము, రాయపేట, మద్రాసు.

ఈ పఠనమందిరప్రారంభోత్సవము జూలై 11 వ తారీఖున శ్రీ వేమవరపు రామదాసు పంతులుగారు జరిపిరి.

### శ్రీరామచంద్రబాలభక్తగ్రంథాలయము, కోణకంచి - నందిగామ తాలూకా.

ఈ గ్రంథాలయపుగంవవార్షికోత్సవము ది 16-7-36 తేదీని శ్రీ చల్లపల్లిరాజాగారి అధ్యక్షతను జరిగెను. ఆ సందర్భమున గ్రంథాలయప్రదర్శనప్రారంభోత్సవము రావుసాహేబు ఆలపాటి కుటుంబరావు శ్రేష్ఠిగారు జరిపిరి. వివిధభాషాపత్రికలతోడను, విద్యాప్రబోధకఫలకములతోడను, గ్రంథములతోడను, గ్రంథాలయోద్యమసేవకులయు, గ్రంథాలయ భవనములయు పటములతోడను చక్కగ అలంకరించిరి. స్వాగతపత్రములు సమర్పించినపిదప శ్రీకోణకంచి, చక్రధరరావుగారు స్థానికగ్రంథాలయచరిత్రను గురించియు, చెఱుకుపల్లి వెంకటప్పయ్య పంతులు బి. ఏ. ఏల్. టి. గారు గ్రంథాలయావశ్యకతను గురించియు, వావిలాల గోపాలకృష్ణయ్యగారు గ్రంథాలయోద్యమ పరిణామమును గురించియు, శ్రీ డి. వి. సుబ్బారావు బి. ఏ. ఎల్. టి. గారు విద్యాభివృద్ధిసాధనములను గురించియు గంభీరోపన్యాసములు గావించిరి.

శ్రీ చల్లపల్లి రాజాగారు ఆంధ్రోద్యమమును గురించి ముచ్చటించుచు ఆంధ్రరాష్ట్రమును సముపార్జింపకపోవుట ఆంధ్రులదౌర్భాగ్యమనియు, ఇందుకు ముఖ్యకారణము ఆంధ్రులు ఏకాభిప్రాయముతో కేంద్రీకరించి పనిచేయకపోవుటయే అనియు హెచ్చరించుచు, ఇప్పటికైనను ఐకమత్యముతో పనిచేసిన ఆంధ్రరాష్ట్రము త్వరలో సిద్ధించునను నమ్మకము తమకు కలదని నుడివిరి. గ్రంథాలయోద్యమము నెడల తమకు ప్రత్యేకాభిమానము కలదనియు స్థానికగ్రంథాలయ భవననిర్మాణకార్యమునకు తాము సాయము కావించెదమనియు వాగ్దానము కావించిరి. వందనములతో సభ ముగిసెను.

### దివితాలూకా గ్రంథాలయసంఘము. గ్రంథాలయ శాసనోపసంఘము.

పై ఉపసంఘసమావేశము ది 19-7-37 తేదీని బెజవాడలో జరిగెను. శ్రీయుత గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు ఎమ్. ఏ. గారు అధ్యక్షతవహించిరి శ్రీయుత తేకుమళ్ల రామచంద్రరావు ఎమ్. ఏ. బి. ఎల్ గారు తయారు చేసిన చిత్తుచట్టము చర్చించిరి. రాత్రి 10 గంటలకు సభ ముగిసె. ఆంధ్ర దేశ గ్రంథాలయసంఘకార్యదర్శులగు శ్రీయుత అయ్యంకి వేంకట రమణయ్య పంతులుగారును, దివితాలూకా గ్రంథాలయసంఘకార్యదర్శులగు మాజేటి రామచంద్రరావు పంతులుగారును చర్చలయందు పాల్గొనిరి.

### దివితాలూకా గ్రంథాలయసంఘము.

ఈసంఘము యొక్క యాత్రోప సంఘమువారు ది 26-7-36 తేదీని మోపిదేవి సివారు రావివారిపాలెము నందలి శ్రీరామధర్మగ్రంథాలయమును దర్శించిరి. మహాజనసభ జరిగెను.

### శ్రీ విక్టోరియా పఠనమందిరము.

చోడవరము, వీరవల్లితాలూకా, విశాఖపట్టణము జిల్లా.

ఈ గ్రంథాలయ ౨౦ వ వార్షికోత్సవము నూతనభవనములో ది 26-7-36 తేదీని అనకాపల్లిపురపాలకసంఘాధ్యక్షులగు శ్రీఉప్పల సత్యనారాయణ శ్రేష్ఠిగారి అధ్యక్షతను జరిగెను. వీరు గ్రంథాలయమునకు రు 100 లు విరాళమిచ్చిరి.

### శ్రీ రామమోహన గ్రంథాలయము. చినపాఱుపూడి, కృష్ణాజిల్లా.

ఈ గ్రంథాలయభవనప్రారంభోత్సవము ఇటీవల శ్రీగద్దె లింగయ్యగారు జరిపిరి.

### రేపల్లె తాలూకాలో గ్రంథాలయములు.

శ్రీ ఆంధ్రబాలసరస్వతీనిలయము, నల్లూరు, శ్రీజాతీయ బాలభారతీ గ్రంథనిలయము, కనగాల. ఈ రెండు గ్రంథాలయములును గత జూలై మాసములో రిజిష్టరు చేయించిరి. ఇదివరలో కొన్నిగ్రంథాలయములు రిజిష్టరై గవర్నమెంటుగ్రాంటును పొందుచున్నవి.

### శ్రీరామ గ్రంథాలయము, పడాల - తాడేపల్లిగూడెము తాలూకా.

ఈ గ్రంథాలయ నూతనభవనప్రవేశమహోత్సవము ది 7-8-36 తేదీని శ్రీ అల్లూరి రామకృష్ణంరాజు బి. ఏ. రిటైర్డు డిప్యూటీ కలెక్టరుగారి అధ్యక్షతను జరిగెను.

### శ్రీ సరస్వతీగ్రంథాలయము, పెద్దతాడేపల్లి.

ఈ గ్రంథాలయప్రథమవార్షికోత్సవము ది 22-8-36 తేదీని శ్రీ పి. సి. జేమ్సు,ఏ. బి. గారి అధ్యక్షతను బాగుగా

జరిగెను. కార్యదర్శినివేదికలో గతసంవత్సరమున జరిగిన కృషిని వివరించెను. నూతన కార్యనిర్వాహక వర్గమును ఎన్నుకొనిరి. గ్రంథాలయమునకు సొంతభవనము కట్టుటకు తీర్మానించిరి.

### శ్రీ కొడాలి సుబ్బరాయ గ్రంథాలయము, పెదకళ్లేపల్లి - దివితాలూకా.

పైగ్రంథాలయ స్థాపనోత్సవము సొంతభవనములో ది 24-8-36 తేదీని శ్రీయుత బుద్ధ కుటుంబరావు బి. ఏ. బి. ఇడి. గారి అధ్యక్షతను జరిగెను. ఇదివరలో ఈగ్రామములోనున్న శ్రీమదన గోపాల పుస్తక భాండాగారము దీనితో జతపరచిరి. ఆంధ్ర దిన, వారపత్రికలను కొందరు ప్రముఖులు తమ సొంతఖర్చులమీద తెప్పించి గ్రంథాలయమునకు ఇచ్చుటకు వాగ్దానము చేసిరి.

### ఈశ్వరగ్రంథాలయము, కాకినాడ.

ఈ గ్రంథాలయయాజమాన్యమున ఆగస్టు 24 తేదీని భగవద్గీతా కాలక్షేపము జరిగెను. శ్రీ బి. వేంకటేశ్వర్లుగారు ఉపన్యసించిరి.

### శ్రీ గౌతమీ గ్రంథాలయము, రాజమండ్రి.

విద్యాశాఖామంత్రి దివాన్ బహద్దూర్ కుమారస్వామి రెడ్డిగారు ది 26-8-36 తేదీని పై గ్రంథాలయమును సందర్శించిరి.

### శ్రీ సీతారామ విజయసరస్వతీ పుస్తక భాండాగారము, సింగుపాలెము, రేపల్లెతాలూకా.

ది 4-9-36 తేదీని పైగ్రంథాలయమువారు కొల్లి నాగ సత్యనారాయణగారిని అధ్యక్షులుగను, సజ్జారామలింగయ్యగారిని ఉపాధ్యక్షులుగను, ఏర్లగడ్డ రాఘవయ్యగారిని కార్యదర్శిగను ఎన్నుకొనిరి. సహాయకార్యదర్శిని, కోశాధ్యక్షుని, గ్రంథాలయాధిపతిని ఎన్నుకొని, ఒకరిని ప్రతి శనివారము ఇండ్లకు పుస్తకము లిచ్చి తెచ్చుటకుకూడ నియమించిరి.

### శ్రీ మహాలక్ష్మీ స్త్రీపఠనమందిరము, గుంటూరు.

ఈ మందిర చతుర్థ వార్షికోత్సవము సెప్టెంబరు 7-8 తేదీలలో శ్రీమతి ముప్పానేని మాణిక్యమ్మగారిఅధ్యక్షతను జరిగెను. ఈ మందిరములో ౪౨ మంది సభ్యురాండ్రున్నారు. ౨౩౦ గ్రంథములు కలవు. ఈ సంవత్సరములో ౨౪౬ గ్రంథములు స్త్రీలు పఠించిరి. ముఖ్యముగా విద్య, విజ్ఞానము, సహకారము, ఆధ్యాత్మికచింత, సద్గ్రంథపఠనము, పత్రికాపఠనము, సాంఘికసేవ, మొదలగునవి వ్యాపింపజేసి, స్త్రీలోకమును ఉన్నతస్థితికి తెచ్చుటయే ఈపఠనమందిరముఖ్యోద్దేశము.

### శ్రీ సరస్వతీ నిలయము, ఖాజీపాలెము.

ఈ గ్రంథాలయవార్షికోత్సవము ది 13-9-36 తేదీని శ్రీయుత మాధవపెద్ది కాళిదాసు బి. ఏ., బి. ఎల్. గారి అధ్యక్షతను జరిగినది. ఉదయము ఊరేగింపు, సరస్వతీ పూజ, భజన, పురాణకాలక్షేపమును, సాయంకాలము బహిరంగసభయు జరిగినవి.

### ఆంధ్ర అసోసియేషన్ అండు లైబ్రిరీ, కల్యాణి.

పై గ్రంథాలయములో ది 19-9-36 మొదలుకొని ది 27-9-36 తేదివఱకు గణపతిమహోత్సవములు జరిగినవి. అనేకవిషయములనుగురించి ఉపన్యాసములిచ్చిరి.

### శ్రీభ్రమరాంబ గ్రంథాలయము, పెనుమాక - గుంటూరుజిల్లా.

ఈ గ్రంథాలయపు ౮ వ వార్షికోత్సవము శ్రీగాడిచెర్ల హరిసర్వోత్తమరావుగారి అధ్యక్షతను ది 13-9-36 తేదీని జరిగెను. ఆసందర్భమున వారు గ్రంథాలయభవన దాతలును, పోషకులును అగు శ్రీమేకా బసవయ్యగారి ఛాయాపటము బహిర్గత మొనర్చిరి. శ్రీఉప్పలూరి రామ శాస్త్రిగారు పతాకవందనోత్సవము జరిపించిరి. చుట్టు ప్రక్కల గ్రామముల ప్రజలు పెక్కురువచ్చి ఉత్సవములో పాల్గొనిరి.

### తణుకుతాలూకా గ్రంథాలయ ద్వితీయ వార్షికోత్సవము.

పై ఉత్సవము ది 27-9-36 తేదీని తణుకుతాలూకా రేలంగిగ్రామములో శ్రీకృష్ణపుస్తకభాండాగారభవనమున మ॥రా॥శ్రీ॥ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి అధ్యక్షతను జరిగినది.

నరసాపురములో కీ. శే. బడేటి వేంకటరామయ్యగారిస్మారకచిహ్నముగా సహకారఉచితపఠనమందిరమును ఏర్పాటు చేయుచున్నారు. నరసాపురము సహకార సంఘమువారు దీనికి కామన్ గుడ్ ఫండునుండి రు150 లు ఇచ్చిరి.

నైజాంరాష్ట్రమున పాల్వంచ - అశ్వారా యాంధ్ర గ్రంథాలయమునకు శ్రీవేదగిరిరావుగారు రు 60 లు దాన మొసంగిరి. ఉదారులగు కొందరు పాత్రముల నిచ్చిరి.

శ్రీ శారదాగ్రంథాలయమను పేరుతో అనకాపల్లిలో ఒక ఆదర్శ గ్రంథాలయమును స్థాపించుటకు ప్రయ

త్నములు జరుగుచున్నవి. పలుకుబడిగల పురపెద్దలు ఇందు విషయమై కృషి చేయుటకు ఉపసంఘముగా ఏర్పడిరి.

రాజమహేంద్రవరమున హిందూ సమాజమువారు హిందూమతోద్ధరణకార్యములకు పూనుకొని, మత గ్రంథములను ప్రకటించుటకును, కేంద్ర గ్రంథాలయమును స్థాపించుటకును, అందుకుతగిన భవనమును నిర్మించుటకును పూనుకొనినారు. విరాళములు కోశాధికారియగు శ్రీ న్యాపతి కామేశ్వరరావు బి. ఏ., బి. యల్. గారి పేర పంపవలసినదిగా ప్రకటించిరి.

తట్టమంగలం మ్యునిసిపాలిటీవారు ఒక పఠనాలయము నేర్పరుప నిశ్చయించిరి. వీరు రెండు సంవత్సరములనుండి చిట్టూరులో ఒక పఠనమందిరమును నిర్వహించుచున్నారు.

## శ్రీ సీతానాథ్ గ్రంథాలయము
## తిమ్మానాయునిపేట - కోవెలగుంట
## తాలూకా - కర్నూలుజిల్లా.

ఇది చుట్టుప్రక్కల 24 గ్రామములకు కూడలి. భవన నిర్మాణము నిమిత్తము ఉదారబుద్ధితో షావుకారులలో ఒకరు 30 సెంట్ల భూమిని దానము చేసిరి. ప్రాకారపుగోడ కట్టుట పూర్తిఅయినది. భవనముకూడ తయారగుచున్నది.

## కర్నూలుజిల్లాలో గ్రంథాలయోద్యమము.
## జిల్లాబోర్డువారి కార్యక్రమము

కర్నూలుజిల్లాబోర్డువారు గ్రామపునర్నిర్మాణోద్యమ భాగముగా పల్లెటూళ్లలో గ్రంథాలయోద్యమమువ్యాపింప చేయుటకు సంకల్పించిరి. ఇప్పటికి జిల్లా ముఖ్యపట్టణమునకు ౩౦ మైళ్లలోగానుండు ౧౦ గ్రామములలో పని సాగించెదరు. రెండు నెలల కొకపర్యాయము, ౧౦౦ కొత్తపుస్తకములను ఒక్కొక్క కేంద్రమునకు పంపుచుందురు. ఎట్టి చందాతో నిమిత్తములేకుండా జాతి మత వివక్షతలేక అందరును ఈ గ్రంథములను ఉపయోగించుకొనవచ్చును. గ్రంథాలయయాజమాన్యము ఆయా కేంద్రములలో పలుకుబడిగల వారికి ఒప్పగింతురు. ఆయా గ్రామములలోని ఉపాధ్యాయులు పత్రికలు చదివిగ్రామస్థులకు వినిపించుటకు ఏర్పాట్లుచేసెదరు. దీనికి ఇప్పుడు రు 2900 ల మొత్తము మంజూరు చేసిరి.

## గ్రంథాలయోద్యమము - కొచ్చిన్ ప్రభుత్వము వారి తోడ్పాటు.

ఇటీవల కొచ్చిన్ శాసనసభవారు వైజ్ఞానిక రాజకీయాది విషయములనుగూర్చిన వ్రాతప్రతులను ప్రోగుచేసి జాగ్రత చేయవలసిన అవసరమునుగురించి తీర్మానించి యున్నారు. ఈ తీర్మానమును కొచ్చిను ప్రభుత్వము వారామోదించుచు త్వరలో ఆచరణములోనికి తీసికొని వచ్చుటకు తగిన విధానమును తయారు చేయుటకు శ్రీ పి. అంజుమాన్ ఆచన్ గారిని నియమించిరి.

## సారనాథములో చైనా గ్రంథాలయము.

కాశీపట్టణమునకు సమీపమునందలి సారనాథములో చైనా గ్రంథాలయము స్థాపించుటకు ఏర్పాట్లు జరుగుచున్నవి ఇప్పటివరకు సారనాథములోని మహాబోధిసంఘము అంతర్జాతీయ బౌద్ధవిశ్వవిద్యాలయ సంఘము వారివద్దకు మొత్తము ౬౦౦ గ్రంథములు చేరియున్నవి. బుద్ధుని జీవితమునకు సంబంధించిన చిత్రపటములు ఇందు పెక్కు గలవు.

## మద్రాసు యూనివర్సిటీ గ్రంథాలయము.

మద్రాసు విశ్వవిద్యాలయమువారు అయిదులక్షల రూపాయలకుపైగా వెచ్చించి నూతనముగా మద్రాసులో ఒక గొప్ప గ్రంథాలయభవనమును నిర్మించిరి. క్రిందటి నెలలో గవర్నరు సర్ కూర్మా వెంకటరెడ్డినాయుడుగారు భవనప్రవేశోత్సవము జరిపిరి. ఇందులో లక్షకుపైగా గ్రంథములు గలవు. ౧౦౦౦ పైగా వార్తాపత్రికలు వార, పక్ష, మాసిక, త్రైమాసిక, పత్రికలు మొదలగునవి వచ్చుచున్నవి. ఈ గ్రంథాలయము ఉదయము ౭ గంటలు మొ. సాయంకాలము ౮గంటలవఱకు తెఱచి ఉంతురు. విద్యార్థులును తదితరులును దీనిని పూర్తిగా వినియోగించుకోవచ్చును. విశ్వవిద్యాలయవిద్యార్థులు, పట్టభద్రులు, ప్రొఫెసర్లు అందరును రు ౩౦/- లు డిపాజిట్టు చేసినచో తమకు కావలసిన పుస్తకములు ఇండ్లకు తీసికొనివెళ్ళి ఉపయోగించుకోవచ్చును. మద్రాసు పట్టణములోని వారికేగాక బయటి గ్రామ పట్టణములవారికికూడ ఈ సదుపాయము చేయుదురు.

కీ. శే. కావ్యకంఠ గణపతిశాస్త్రిగారిపేర, ఖడ్గపుర ఆంధ్రక్లబ్ వారు శ్రీగణపతిగ్రంథాలయము ఈనెల ౧౩ తేదీని స్థాపించినారు. కాన, గ్రంథరూపమునగాని, పత్రికారూపమునగాని, ధనరూపమునగాని, మరొకరూపమునగాని సాయపడ ఆంధ్రమహాజనులను కోరుచున్నారు.

## ఆసియాఖండ కవిసార్వభౌమ రవీంద్రనాథ టాగూరువారి విశ్వభారతిలో చైనా గ్రంథములు.

చైనా "నాన్కింగ్ సైనో ఇండియన్ కల్చరల్ సొసయిటీ" అధికారులు విశ్వభారతిగ్రంథాలయములో

నెలకొల్పుటకు 8000 గ్రంథములను పంపినారు. ఈ గ్రంథములు వేందాంతము, కళ, జూరిస్ ప్రూడెన్సు, సేనలకు సంబంధమైన శాస్త్రము, వ్యవసాయ శాస్త్రము, పరిశ్రమము, వైద్యము, శారీరశాస్త్రము, జంతుశాస్త్రము, కన్ ఫ్యూషియను మతసంబంధశాస్త్రము, టేయోమత శాస్త్రము, బౌద్ధమతశాస్త్రము – మొ॥ని గురించి చెప్పును.

ఈ గ్రంథములను చీనాదేశములోనుండు అనేక గ్రంథాలయములలోనుండి పై సొసయిటీవారు పారితోషికముగా బడసిరి. ఆ గ్రంథములను విశ్వభారతి విశ్వవిద్యాలయములో "చైనాసెక్షన్" అనుపేర నొక చీనామందిరమును రూ 30,000 లతో నిర్మించి యందు నెలకొల్పుదురు. దీని యేర్పాట్లన్నియు సరిగా గావించుటకు పైసొసయిటీవారితరపున ప్రొఫెసర్ టాన్యన్ షాన్ అనువారు 1936-సం॥ జూన్ ప్రథమవారమున విశ్వభారతికివచ్చిరి. దీనివలన హిందువులకు చైనావారికి విజ్ఞానసంబంధమైన చెలిమి వృద్ధియగును.

### లక్నో యూనివర్సిటీ గ్రంథాలయము.

లక్నో విశ్వవిద్యాలయము వారు నూతనముగా ఒక గొప్ప గ్రంథాలయభవనము నిర్మించుటకు నిశ్చయించిరి. రు 3,07,195 లు ఖర్చుపెట్టుటకు ప్రభుత్వమువారు మంజూరు చేసిరి.

### వైద్యాలయములలో గ్రంథాలయములు.

చిత్తూరుజిల్లా నెమ్మరలో వైద్యాలయములోని రోగుల ఉపయోగముకొఱకు ఒకగ్రంథాలయమునేర్పరచిరి. నెమ్మర హైస్కూలు బాలభటులు ఈ గ్రంథాలయమును నడపుచున్నారు. వారమున కొకసారి వీరు పుస్తకములను చదివి రోగులకు వినిపించుచుందురు. మిగతా రోజులలో రోగులు పరిచారికలు తమంతట తామే చదువుకొను చుందురు. అప్పుడప్పుడు సంగీతముకూడా పాడించుచున్నారు.

### రాజకీయ ఖైదీలు – గ్రంథాలయములు.

అఖిలభారతరాజకీయఖైదీలసహాయకసంఘాధ్యక్షులగు బాబు రాజేంద్ర ప్రసాదు గారు రాజకీయ ఖైదీలకు చేయవలసిన సదుపాయములను గురించి వ్రాయుచు "దాదాపు రాజకీయఖైదీ లందరును విద్యాధికులు. విద్యావంతునకు శరీరపోషణమునకు ఆహారమెంత అవసరమో జ్ఞాన పోషణమునకును వలయు ఆహారము అంత అవసరము. ఏతరగతి రాజకీయ ఖైదీలకైనను వార్తాపత్రికల నందజేయుట ప్రభుత్వమువారి కనీసధర్మము" అని వక్కాణించిరి. రాజకీయ ఖైదీలకు గ్రంథసహాయము చేయుటకు అలహాబాదులో ప్రజలు ప్రయత్నము చేయుచున్నారు.

---

# విశాఖపట్టణము జిల్లా గ్రంథాలయమహాసభ
# శ్రీ వేంకటేశ్వర విలాసపుస్తక భాండాగార వార్షికోత్సవము
# ఉపమాక.

స్వస్తిశ్రీ ధాతృసం॥ ఆశ్వయుజ బ ౧ ఆదివారము (ది 1-11-36) పగలు గం॥ 3 లకు మా గ్రంథాలయ చతుర్దశ వార్షికోత్సవము సొంతభవనమందు ప్రారంభమగును. జిల్లా గ్రంథాలయ మహాసభయును జరుగును.

కాన, గ్రంథాలయాభిమానులందఱును దయచేయ ప్రార్థితులు. కార్యక్రమము తరువాత వెల్లడింతుము.

ఉపమాక – అగ్రహారము,
ది 30–9–1936.

పీ. వేం. కృష్ణమాచార్యులు,
కార్యదర్శి.

# ఇండియన్ అసెంబ్లి

అసెంబ్లి సెషన్సు అగష్టు 31 తేదినుండి ప్రారంభమైనవి.

1919 ఇండియా ఆక్టుప్రకారము కాంపిటీషన్ పరీక్షలలో నెగ్గినవారినే ఐ. సి. యస్. ఉద్యోగులనుగా నియమింపవలెను. ఈవిధముగా నెగ్గిన యూరోపియనులు హెచ్చుమంది లభించని యెడల హెచ్చుమంది ఇండియనులనే నియమింపవలెనుకాని యూరోపియనులను నామినేషన్ చేయరాదు - అను ప్రతిపాదనము హెచ్చుమంది వోట్లతో నెగ్గెను.

*   *   *   *

అఖిల భారత గ్రామ పరిశ్రమల సంఘము విషయములో హాలట్ గారు ఉద్యోగులకు పంపిన సర్క్యులరును గురించి ప్రశ్నింపగా పై సంఘమునకు సహాయము చేయరాదని ఆసర్క్యులరులో లేదని ప్రభుత్వసభ్యుడు విశదపరచెను. సంఘమువారు సహాయము కోరేయెడల ఆజిల్లాఅధికారి ప్రభుత్వమువారికి తెలియపరచునట.

రైళ్లలో టిక్కెట్లు లేకుండా ప్రయాణములు చేసినవారి సంఖ్య గతసంవత్సరములో 30,000లు వరకు ఉన్నది. ఇట్లు జరుగకుండా ఉండుటకు తీసుకుని రాబడిన బిల్లునుగురించి అభిప్రాయమును పొందుటకుగాను సర్క్యులేటు చేయనిర్ణయింపబడినది. పోస్టాఫీసు సేవింగ్సుబ్యాంకులలో డబ్బు వేసినవారు తిరిగి ఇంతవరకు అడుగని మొత్తం పదునాలుగు లక్షల రూపాయలకుపైగా ఉన్నది. ఎవరైన వచ్చి ఫలానా మొత్తము మాది అని అడుగుచో ఋజువుచేసుకొనుటకు సర్వసౌకర్యములను ప్రభుత్వమువారు చేయగలరని విశదపఱచబడినది.

*   *   *   *

దేశనాయకులపటములుగల ప్రైవేటుతపాలు కార్డు ఉపయోగించుటలో ఇప్పుడు సత్యాగ్రహములేదు కనుక తమ కేమియు అభ్యంతరము లేదని ప్రభుత్వసభ్యుడు తెలియపరచెను.

అష్టమ ఎడ్వర్డు ప్రభువుగారిముద్రతో వెలువడే పోస్టుబిళ్ళలు స్టాంపులు కరెన్సినోట్లు 1937 సంవత్సరము రెండవఅర్ధసంవత్సరములో కొన్ని అమలులోనికి రావచ్చునని తెలియజేయబడినది.

---

# మద్రాసు శాసనసభ

గతసమావేశము అగష్టు 27వ తేదినుండి సెప్టెంబరు 4 వ తేదివరకు జరిగినది.

ఇప్పుడుఉన్నమంత్రివర్గము 1937 మార్చి ఆఖరువరకు అధికారములో ఉండును. క్రొత్త రాజ్యాంగ విధానము 1937 ఏప్రిల్ నుండి అమలులోనికి వచ్చును.

జిల్లాబోర్డు లన్నియు విభజించుటకు నిశ్చయించిరి. ప్రధానమంత్రిగారు తమ అధికారకాలము పూర్తి అగులోపల ఈ పని పూర్తి చేయుదుమని సెలవిచ్చిరి. మెడికల్ స్కూళ్ళలోని విద్యార్థులకు ఉచితవైద్యసహాయము చేయుటకు నిశ్చయించిరి.

స్థానికసంస్థలయెన్నికలవివాదములలో ఇంజంక్షను ఇచ్చు అధికారము ఇప్పటికి ఆ యా స్థానికకోర్టులకు ఉన్నది. ఇప్పుడు కోర్టులకుగల అట్టి అధికారము తీసివేసి స్థానికప్రభుత్వపు ఇనస్పెక్టరుకు ఒప్పగించినారు.

మద్రాసు ప్రభుత్వమువారు ఒక ప్రావిన్షియల్ మార్కెటింగుసొసైటీ స్థాపించుటకు నిశ్చయించిరి. దీని కొరకు సాలు 1కి సుమారు రు 7100-0-0లు ఖర్చు పెట్టుటకు మంజూరు చేసినారు. త్వరలోనే ఈ సొసైటీవారు బంగాళా దుంపలు, పండ్లు విక్రయించుటకుగల అవకాశమున్నుగుఱించి కృషి ప్రారంభించెదరు.

# సంపాదకీయములు

## ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్యసంఘము, బెజవాడ.

ఆంధ్రరాష్ట్ర జీవకారుణ్యసంఘాశయములు అత్యుత్కృష్టములు. ఈసంఘము విఖ్యాత ప్రజాసేవా ధురంధరులగు బాబు రాజేంద్రప్రసాదుగారిచే ప్రారంభింపఁబడుట శుభప్రదము. ఆంధ్రదేశనాయకులు పెక్కురు ఈ కార్యక్రమము జరుప పూనుకొనుట చూడ సంకల్ప సిద్ధి అనతికాలములోనే చేకూరఁగలదని విశ్వసింపఁదగియున్నది.

"అహింసా పరమో ధర్మః" అను ఆర్యోక్తి ఎల్లరును పాటింప వలసినది. కాని, గ్రామములలోను, పట్టణములలోను బలులు, మ్రొక్కుబడులు అను మిషతో, సందర్భ శుద్ధిలేని కొన్ని పూర్వాచారములను పురస్కరించుకొని, స్వలాభాపేక్షాపరులై నిర్దయతో ప్రజలు ఘోరమగు పశుహింసకు కడఁగుచుండ, ఇట్టి ఘోరకృత్యములను మాన్పించుటకు తగిన కృషిచేయక ఎవరి ఇచ్చవచ్చినరీతిని వారు అహింసా, భూతదయా, విజ్ఞానములను ప్రబోధము చేయుచున్నామని తృప్తిపడుచో ఉపయోగ మెంత మాత్రమును ఉండ నేరదు.

దేశములో కలరా, మశూచి మొదలగు వ్యాధులు ప్రబలినపుడు తన్నివారణముకొఱకు గ్రామదేవతలకొలుపులు జరుపవలెనను నిశ్చయములు తఱచు జరుగుచుండును. పూర్వాచారపరాయణులు కొందఱును, స్వలాభాపేక్ష కలవారు కొందఱును వారివారిరుచులనుబట్టి ఇట్టి కార్యక్రమములను పురిగొల్పుచుందురు. ఆపత్కాలములందు ప్రజాసామాన్యమునకు తఱచు వివేకము, విజ్ఞానము వెనుకపడుచుండును. ఇట్టి స్థితిలో వారు పైవారిబోధలకు లొంగి జంతువధకు పాల్పడుచుందురు. కనుక ఆపత్కాలములలో గాక సామాన్యపరిస్థితులలోనే జంతువధవలని అనర్థములనుగుఱించి ప్రజలకు బోధచేయవలెను. ఈ ప్రబోధము నిరంతరము సాగవలసినదే. జాడ్యములు, వాని మూలకారణములు, నివారణోపాయములు మొదలగునవి వారికి చక్కగా బోధింపవలెను.

ప్రజలలో చేతివృత్తులు నశించినవి. నిరుద్యోగము హెచ్చినది. ప్రజలకు భూమాధనమే శరణమైపోయినది. పశుభూమినాశనమైనది. తిరుగుటకు చోటు లేక పోవుటవల్లను, బీళ్లు అడవులు సాగుభూములుగా మాఱుటవల్లను, పశువులు మేతలేక శుష్కించిపోవుచున్నవి. పాఁడితగ్గిపోయినది. పశువుల నశింపువలన ఎరువుల ఉత్పత్తి పూర్తిగా తగ్గిపోవుచున్నది. పూర్వము జనోపద్రవముకలుగఁజేయు మొరటుజంతువులుమచ్చునకైనను కనఁబడుటలేదు. ఇట్టి స్థితిలో శుష్కించిపోయిన పశుసంతతిని దేవతలకు బలులపేరుతో చంపుచుండుట క్రమమగు పని కానేరదు.

కాన విజ్ఞానపరులు ఉన్నచోట దేవతాపూజలను భజనలతోను, టెంకాయలతోను, అర్చనలతోను వైభవముగా జరుపుచున్నారు. ఈ స్థితిగతు లన్నియు ప్రచారము జరిపి ప్రజలకు బోధచేయవలసియున్నది.

ఆంధ్రదేశములో తాలూకాకుఒకటిచొప్పునైనను మొదట ఈ సంఘమువారు శాఖలను ఏర్పఱుప వలసియున్నది. పత్రికలు కరపత్రములు ఉపన్యాసములు -- వీనివలన ఈసంఘమువారు తాలూకాసంఘములమూలమున అఖండముగా ప్రచారము చేయవలసి యున్నది. సరియగు పద్ధతులతో ఈకార్యక్రమము నడపించినయెడల పూర్తిగా నెఱవేఱఁగలదు. కొలుపులనుగూర్చియు జంతువధలనుగూర్చియు ఆ యా తాలూకాలపరిస్థితులు ఎప్పటి కప్పుడు తెలిసికొని కేంద్ర

సంఘములకు దెలియఁబఱచి, జంతువధ జరుపకుండుటకు పై తాలూఁకాసంఘములు ఉపయోగపడవలెను.

ఆంధ్రదేశములోని గ్రంథాలయములన్నియు ఈ ఉద్యమమునుగుఱించి పూర్తిగా కృషి చేయవలసియున్నది. ప్రజలలో విజ్ఞానమును వెదఁజల్లుటకు ఆంధ్రదేశగ్రంథాలయసంఘమునకు ఈఉద్యమము కొంత సహకారి కాగలదు.

కాన ఆలస్యము చేయక ఇందునుగుఱించి ఈసంఘమువారి కృషిని విస్తరింపఁజేసి ఆవివరములు పత్రికాముఖమున వెల్లడించుచుండవలెననియు, ఆంధ్రదేశములోని అన్ని జీవకారుణ్యసంఘములవారును పై సంఘముతో అనుబంధ మేర్పఱుచుకొనవలె ననియు కోరుకొనుచున్నాము.

### ఆంధ్ర విశ్వవిద్యాలయము - తెనుఁగు

ఆంధ్రవిశ్వవిద్యాలయమువారి అకేడమిక్ కౌన్సిల్ వారు ఆంధ్రభాషాధారక విద్యాబోధనము సాధ్యము కాదని తోసిపుచ్చిరి. ఇది చిత్రములలో చిత్రము. ఆంధ్రవిశ్వవిద్యాలయ మేమి! ఆంధ్రభాషాప్రవీణుడగు ఉపాధ్యక్షుని యాజమాన్య మేమి! ఆంధ్రసీమలోని నలుకెలంకులనుండి చేరిన విద్యాప్రతినిధులసమావేశ మేమి! ఇట్టి తీర్మానమేమి! ఏప్రథమోద్దేశము ఆంధ్ర విశ్వవిద్యాలయమునకు నిర్ణీతమో, ఏసాధనము ఆంధ్రావనికి ఆవశ్యకమో, ఏపూజ ఆంధ్ర మాతకు సమర్పణీయమో, అట్టి ఉద్దేశమును, సాధనమును, పూజను ఒక్కమాటతో నిర్మూలించిన మేధావులను ఏమని వర్ణింపవలయు! ఉపాధ్యక్షులవారు జరిగినసంగతులెల్ల వివరించుచు గ్రంథసామగ్రి చాలకపోవుట ఒక కారణముగ సూచించిరి. ఆంధ్ర విశ్వవిద్యాలయము ఆవిషయమున చేసిన కృషిని కొంత ఉదహరించిరి. కాని ఇవి ఏవియు చాలలేదనుటను వ్యక్తపరచిరి. శ్రీ గా. హరిసర్వోత్తమరావు గారు బెజవాడలో బహిరంగసభ యందు మాటలాడుచు తెలిపిన రీతిగా ఇవి అన్నియు వట్టిసాకులు. ఉస్మేనియా విశ్వవిద్యాలయము ఆరంభించి సర్వవిషయములు ఉర్దులో బోధించుచు ఉర్దుభాషలో విస్తారవాఙ్మయమును సృష్టించుకొనుచుండు హైదరాబాదు నిదర్శనమును కొనియైనను ముందుకు నడవజాలనిచో ఆంధ్రవిశ్వవిద్యాలయము యొక్క జీవితము వ్యర్థము. బడిపిల్లలకు పతకములు బహుమానములు పెట్టి ఏవో ఒకటి రెండుగ్రంథములు వ్రాయించుటచేతను, తీరిక లేక తిరుగులాడు పండితమిత్రులచేత ఏనాఁడో గ్రంథములు వ్రాయింతుమనుకొని ఒకరిద్దరి కట్టిపని కల్పించి తృప్తులగుటచేతను, విశ్వవిద్యాలయమువారు కార్యము సాధింపఁజాలరు. గట్టిగా నడుముకట్టి, గ్రంథకర్తృత్వశక్తిగల పండితులను చుట్టుచేర్చుకొని ప్రత్యేకము ఆశాఖకొక డైరక్టరును నియమించి లక్షలు వ్యయపరచి గ్రంథములు నిర్మించుకొనవలసియుండును. ఈసహాయము ప్రభుత్వమునుండి రావలసియుండును. రిత్తమాటలు మాట్లాడుమంత్రుల ఉపన్యాసములతో ఇది సాగునదికాదు. దాతలెవరైనను పూనికొనినను మేలే; అథమపక్షము గొప్పప్రకటన కర్తల సంఘ మేర్పడి విశ్వవిద్యాలయపు కంట్రాక్టుతో ఉపాధ్యక్షుని చూపులో కార్యనిర్వహణ మొనర్చుటకు వీలున్నను పని సాగఁగలదు. శ్రీరామలింగారెడ్డిగారు ఇఁక కాలము వ్యర్థపుచ్చక ఉత్సాహముతో పని చేసి ఈదీక్ష సాధించి ధన్యులగుదురని విశ్వసించుచున్నాము. ఇంగ్లీషు సముద్రములో తమ విశ్వవిద్యాలయము తెలుఁగు దీవి యగునని వారూ పడిన నిరాశకు అర్థములేదు. ఇట్టి దీవు లనేకము లేర్పడఁగలవు. తెనుఁగు చావ లేదు; ఉసుఱుపసతో ఉప్పొంగుచు అది వెలయుచుండుట మఱవవలదు.

# భక్తిప్రబోధిని.

—♦ భక్తిప్రచారముచేయు మాసపత్రిక. ♦—

భగవాన్ శ్రీ రామకృష్ణపరమహంస, శ్రీ మద్వివేకానంద, రామతీర్థ, శ్రీ హరనాథ్ఠాకుర్, శ్రీ చైతన్యమహాప్రభువు మొదలగువారు బోధించిన భక్తివిశేషములను తెల్పుచుండుటయే దీని ప్రత్యేకలక్షణము.

☞ కడచిన నాలుగు వత్సరములనుండి ప్రచురింపబడుచున్నది.

సం. చందా. పోస్టేజితో రు 1—0—0

శ్రీ రామకృష్ణ పూజామందిరము,

కొత్తపేట, గుంటూరు.

# గ్రంథాలయ సర్వస్వము

చందా: ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యులకు సభ్యత్వపుచందాతో రు 3 లు మాత్రమే.

ప్రతినెల 5-వ తేదీని వెలువడును.

వ్యాసములు

గ్రంథాలయశాస్త్రము - ఆంధ్రవాఙ్మయము ఆంధ్రాభ్యుదయము - జాతీయ పునర్నిర్మాణములను గూర్చిన అనుభవ పూర్వకములైన వ్యాసములు, గ్రంథాలయ సంఘములయొక్క నివేదికలు, వృత్తాంతములు, గ్రంథముల విమర్శనములు ఇందు ప్రకటింపఁబడును.

పటములు

గ్రంథాలయ భవనములయు, గ్రంథాలయ సభలయు గ్రంథాలయ సేవకులయు సంస్థలయు పటములు ఇందు ముద్రింపఁబడును.

హెచ్చరిక

ఈ పత్రిక ప్రతినెల ౫-వ తేదీని వెలువడును గావున వ్యాసములను పంపువారు ఏ నెల పత్రికయందు అవి ప్రకటింపవలెనో దాని వెనుకటినెల 15-వ తేదీకి పూర్వమే పంపవలయును. పటములను వెనుకటినెల 1-వ తేదీకి పూర్వమే పంపవలయును.

ప్రకటనముల రేట్లు

| | |
|---|---|
| ఒకసారి 1 పుటకు | రు 20-0-0 |
| ఒకసారి ½ పుటకు | రు 12-0-0 |
| ఒకసారి ¼ పుటకు | రు 6-0-0 |

వివరములకు :—

మేనేజరు, గ్రంథాలయసర్వస్వము, బెజవాడ.

RSVmol A 159



Grandhalaya Sarvasvam-Registered No. M 1714


# ఓ రి య ం ట ల్

## గవర్నమెంటు సెక్యూరిటీలైఫ్ అస్యూరెన్సుకంపెనీ, లిమిటెడ్

స్థాపితము 1874. హెడ్ ఆఫీసు : బొంబాయి.

**1935** నివేదిక — సంగ్రహము.

| | | |
|---|---|---|
| జారీచేసిన క్రొత్త పాలిసీలు | రూ. | 8,89,89,149 |
| సాలీనా ఆదాయము | ,, | 3,49,16,412 |
| అమలులోనున్న పాలసీలు | ,, | 59,25,32,038 |
| చెల్లించిన క్లయిముల మొత్తం | రూ | 17,43,21,855 |
| పెరిగిన ఫండు మొత్తములు | ,, | 17,01,62,491 |

ఈ పైన తెలుపబడిన అంకెలు ఓరియంటల్ యొక్క ప్రజాదరణ,
కంపెనీస్థిరత్వమునుగూర్చి వేనోళ్ళ చాటుచున్నవి.
ప్రజాదరణబొంది దినదినాభివృద్ధిగాంచుచున్న ఈ హైందవ భీమాసంస్థలో మీజీవితము భీమా చేసికొనుటకు
ఆలసింపవలదు.

వివరములకు : పి. హెచ్. గుప్త, బార్-ఎట్-లా సెక్రటరీ, ఉత్తరజిల్లాలు,, గోడేవారివీథి, లేక ఈక్రింది ఉదాహరింపబడిన కంపెనీ కార్యాలయములకు వ్రాయవచ్చును. విశాఖపట్టణము,

ఆగ్రా, అజ్మీర్, అహమ్మదాబాద్, అలహాబాద్, అంబాల, బెంగుళూర్, బెరియేలీ, బెల్లారి, కలకత్తా, కాలికట్, కోయంబతూర్, కొలంబో, ఢక్కా, ఢిల్లి, గౌహతీ, గుంటూరు, జల్గాను, జల్పాయిగురి, జబ్బల్‌పూర్, కరాచీ, కోలాలంపూర్, లాహోరు, లక్నో, మాండలే, మధుర, మెర్కారా, మొంభాసా, నాగపూరు, పాట్నా, పూనా, రాయపూరు, రాజసాహి, రాంచీ, రంగూన్, రావల్పిండి, సింగపూర్, సుక్కూర్, తిరుచునాపల్లి, తిరువనంతపురము, విశాఖపట్టణము.

(Oriental)


# Gosamrakshana Samithi, Ellore.

## గోసంరక్షణ సమితి, ఏలూరు.

ఈ సమితియందు దిక్కులేని గోవులు రక్షింపబడును. పాలు ఉన్నయెడల చంటిబిడ్డలకు, దైవపూజలకు, బీదలకు ఉచితముగ నిచ్చెదరు. పచ్చిగడ్డి నిమిత్తము బీడుభూమి కొనవలసియున్నది. మంచిస్థితిలోనికివచ్చిన గోవులను గృహస్థులకు అమ్మెదరు. గోశాలనిమిత్తము స్థిరమైన స్థలము అవసరము. ధర్మములకు రశీదులు, శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా అయిదుగురకు తక్కువగాని శాశ్వత ధర్మకర్తల [రు 500 దాతలు] సంతకములతో పట్టాలనిచ్చెదరు. అభిమానులెల్లరు శక్తికొలది శాశ్వతనిధిధర్మములేకాక వార్షిక మామూళ్లును, నెల చందాలుగను వరిగడ్డి, తవుడు, విరాళములుగను సహాయపడి యీ సమితి అభివృద్ధికి తోడ్పడ గోరుచున్నాము.

గోసంరక్షణసమితి ప్రచురణములకు, రూల్సుబుక్కులకు, రిపోర్టులు మున్నగువానికి:—

ఏలూరు
5—1—1935.

రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుగారు, (ప్రెసిడెంటు, ట్రస్టి.)
మద్దుల వెంకట చినరాజుశ్రేష్ఠిగారు, (వైస్ ప్రెసిడెంటు, ట్రస్టి.)

బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు కుందా లక్ష్మీనరసయ్యగారిచే ముద్రింపబడినది.

| | |
|---|---|
| | మనసు ఫౌండేషన్<br>పుస్తకాల పరిశీలనాపట్టిక |

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01A159 |
| పుస్తకం పేరు | [illegible] |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 49 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | 3, |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Hema |
| పేజీలు విడదీసినది | Hema |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | Pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | Good |